RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org


సోమవారం 23.06.2025 | సంపుటి :11 సంచిక : 335 | పేజీలు :12 వెల : రూ. 4/-




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## హార్మూజ్ జలసంధి

# మూసివేత



### ఇరాన్ కీలక నిర్ణయం

**అమెరికా దాడుల నేపథ్యంలో ప్రతిచర్య**

ప్రపంచదేశాలకు తీవ్ర విఘాతం.. భారత్ పైనా ప్రభావం

ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు ఎగుమతి

ఎల్ఎన్‌జీ రవాణాకు కూడా ఇదే అత్యంత కీలకం

**టెహ్రాన్(జనంసాక్షి):**మ దేశంలోని అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికా బాంబుల వర్షం కురిపిస్తున్న నేపథ్యంలో.. ప్రపంచ చమురు మార్కెట్ కు జీవనాడిగా ఉన్న హార్మూజ్ జలసంధిని మూసివే యాలని ఇరాన్ నిర్ణయానికి వచ్చింది. వరుస దాడుల తో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఇరాన్ అనుకున్నంత పని చేయనుందా? తమ దేశంలోని అణుస్థావరాలే లక్ష్యం గా ఇజ్రాయెల్ అమెరికా బాంబుల వర్షం కురిపించిన నేపథ్యంలో.. ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హార్మూజ్ జలసంధిని మూసివేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనపడుతోంది. ఈ మేరకు ఇరాన్ నిర్ణయానికి వచ్చినట్లు ఆ దేశ పార్లమెంట్ సీని యర్ సభ్యుడు ఇస్మాయిల్ కౌసరి అక్కడి మీడియాతో

మిగతా 2లో..

### చర్చల ద్వారా పరిష్కరించుకోండి

ఇరాన్,ఇజ్రాయెల్‌లకు మోదీ హితవు

ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని ఫోన్

వార్త 2లో

ఇరాన్‌కు అణ్వాయుధాలు సరఫరా చేసేందుకు

### చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయి

అమెరికా దాడి నేపథ్యంలో రష్యా కీలకవ్యాఖ్యలు

## ఇరాన్,ఇజ్రాయెల్ యుద్ధం

# పతాకస్థాయికి


అమెరికా జరిపిన దాడుల్లో ధ్వంసమైన ఇరాన్‌లోని ఫోర్డ్తో అణుశుద్ధి కేంద్రం పరిసరాలు

### ఇరుదేశాల ఘర్షణల్లో అమెరికా ఎంట్రీ

టెహ్రాన్ అణుకేంద్రాలపై ట్రంప్ సేనల దాడులు

ఫోర్డ్తో, సంతాజ్, ఇస్ఫాహన్‌లపై 'బీ-2 స్పిరిట్' ద్వారా బంకర్ బ్లాస్టర్ బాంబుల ప్రయోగం

**న్యూయార్క్,టెహ్రాన్(జనంసాక్షి):**అమెరికా అనుకున్నంత పని చేసింది. ఫోర్డ్తో అణు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకొని పెద్ద ఎత్తున బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించింది. ఇరాన్ లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న ఫోర్డ్తో అణు శుద్ధి కేంద్రాన్ని తాము సంపూర్ణంగా నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. దానిపై ఏకంగా ఆరు బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించామన్నారు. ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇందుకోసం బీ-2 స్టెల్త్ బాంబర్లను వాడినట్లు వెల్లడించారు. ఇస్ఫహాన్, నతాంజ్‌పై తమ సబ్‌మెరైన్ దాదాపు 400 మైళ్ల దూరం నుంచి

మిగతా 2లో..

### యుద్ధానికి ఇరాన్ ముగింపు పలకాలి

లేకుంటే దాడులు మరింత తీవ్రం : ట్రంప్


అమెరికా నిర్ణయం చారిత్రాత్మకం:నెతన్యాహు

వార్త 2లో

### ట్రంప్ ఆరంభించారు.. మేం అంతం చేస్తాం

అమెరికాకు శాశ్వత గాయం ఖాయం

ఆ దేశంలో ఇక చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్



## పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**కులం,మతం పట్టింపులేదు:మంత్రి పొంగులేటి**

**నల్గొండ(జనంసాక్షి):**భారాస హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని ఇవ్వలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మొదటి విడతలో తమ ప్రభుత్వం 4.50లక్షల ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు.నల్గొండ జిల్లా నకిరేకల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు ఇస్తున్నాం. కులమతాలకు అతీతంగా కేటాయిస్తున్నాం. ఎన్నికల నాటికి పేదలకు 20లక్షల ఇళ్లు కట్టిస్తాం. లబ్ధిదారులకు 4 విడతల్లో రూ.5లక్షలు ఇస్తున్నాం. మధ్యవర్తులకు కాకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే వేస్తాం. న్యాయమైన భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుంది" అని పొంగులేటి చెప్పారు.

## కేసీఆర్ కుటుంబానికి ప్రభుత్వమే రక్షణ కవచం



- భారాసకు కాళేశ్వరం ఏటీఎంగా మారిందని ప్రధాని మోదీనే చెప్పారు
- అయినా రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?
- సీబీఐ విచారణ జరపాలని రాహుల్ చెప్పిన మాటలేమైనయ్? : కేంద్ర మంత్రి బండి

వార్త 12లో

## పన్నేతర రాబడులపై

# దృష్టిసారించండి



### ఇన్ ఫ్రా స్ట్రక్చర్, కేపిటెల్ సబ్ కమిటీ సమావేశంలో సబ్ కమిటీ ఛైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హాజరైన మంత్రులు ఉత్తమ్, కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):** నాన్ టాక్స్ రెవెన్యూ రాబడులను పెంచడంపై అధికారులు సీరియస్ గా దృష్టి సారించాలని ఇన్ ఫ్రా స్ట్రక్చర్ అండ్ కేపిటెల్ సబ్ కమిటీ ఛైర్మన్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ రోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన అసెట్స్ సబ్ కమిటీ మంత్రివర్గ ఉప సంఘం భేటీలో మంత్రులు, కమిటీ సభ్యులైన ఉత్తం కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షా సమవేశం నిర్వహించారు. నాన్ టాక్స్ రెవెన్యూ తో పాటుగా కేంద్ర నిధులను కూడా సాధించుకోవలని చెప్పారు. గత ప్రభుత్వ పథకాలను ఒక్కటి కూడా ఆపకుండా కొత్తగా 33,600 కోట్ల రూపాయల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. అధికారంలోకి వచ్చిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన ప్రభుత్వానికి ఔటర్ రింగ్ రోడ్, ఎక్సైజ్ ఆదాయాలు రాకుండా పోయాయని ఆయన చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ

మిగతా 2లో..

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భాజపా పాలన

యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**సికింద్రాబాద్(జనంసాక్షి):** యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం ఉండేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లో ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ నేతృత్వంలో అద్భుత, సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశలకు అనుగుణంగా భాజపా పాలిస్తోందని చెప్పారు."కాంగ్రెస్ హయాంలో ఎక్కడ చూసిన అవినీతి వార్తలే. దేశంలో అవినీతి ప్రభుత్వం ఉండవద్దని 2014లో

మిగతా 2లో..



## 'ఆయిల్‌పామ్'తో సాగుతో అధిక లాభాలు

**వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో సాగుపై రైతులు దృష్టిపెట్టాలి**

- అందుకు అధికారులకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
- జులై నాటికి అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో పెట్టుకోవాలి
- రాబోయే మూడున్నర సంవత్సరాలలో శాచురేషన్ పద్ధతిలో ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కరీంనగర్ బ్యూరో(జనంసాక్షి) :** ప్రతి ఒక్కరి సహకారంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయాలనీ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియం హాల్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో వ్యవసాయ శాఖ, విద్యా శాఖ, హౌసింగ్ తదితర శాఖల పని తీరు పై రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,

మిగతా 2లో..

'పహల్గామ్' ఉగ్రవాదులకు ఆశ్రయం..

## ఇద్దరు అరెస్ట్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పహల్గామ్ ఉగ్రదాడిలో భాగస్వామ్యం కలిగిన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన ఇద్దరిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ఆదివారం అరెస్టు చేసింది.వీరిని పహల్గామ్‌కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, బషీర్ అహ్మద్ జోథర్‌లుగా గుర్తించింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా (ఎల్ఈటీ)తో సంబంధం కలిగిన ముగ్గురు సాయుధ ఉగ్రవాదులకు వీరు ఆశ్రయం కల్పించడంలో పాటు వారికి ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించారని ఎన్ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఉగ్రదాడి కేసుపై ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఈ దాడికి ముందు హిల్ పార్క్ ప్రాంతంలోని ఈ ఉగ్రవాదులను నిందితులు

మిగతా 2లో..




## ఆయుధాలు వీడి అభివృద్ధి పథంలో

# కలిసి రావాలి

### మావోయిస్టులకు కేంద్ర హోమంత్రి అమిత్ షా పిలుపు

**వర్షాకాలంలోనూ ఏరివేత ఆగదని వెల్లడి**



**రాయ్‌పూర్(జనంసాక్షి):**వర్షాకాలంలోనూ మావోయిస్టు ఏరివేత ఆపరేషన్లు కొనసాగిస్తామని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయుధాలు వీడి, అభివృద్ధి పథంలో కలిసి రావాలని మావోయిస్టులకు పిలుపునిచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఛత్తీస్‌గఢ్ చేరుకున్న అమిత్ షా.. రాయ్‌పుర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) క్యాంపస్, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రసంగించారు. "ప్రతిసారి వర్షాకాలంలో పరిస్థితులను అనుకూలంగా తీసుకుని మావోయిస్టులు విశ్రాంతి తీసుకునేవారు. కానీ, ఈసారి వర్షాకాలంలో వారిని నిద్రపోనివ్వం. 2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా మరింత ముందుకెళ్తాం" అని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోవాలని, ఆయుధాలు వీడి.. అభివృద్ధి ప్రయాణంలో చేరాలని పిలుపునిచ్చారు. వారితో చర్చలు అవసరం లేదన్నారు. సాయుధ పోరాటాన్ని వదులుకుని జనజీవన స్రవంతిలో చేరే వారికి మరింత సాయం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధాని మోదీ దార్శనికత చాలా స్పష్టంగా ఉందని అమిత్ షా అన్నారు. "మా ప్రభుత్వం కేవలం ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిపైనే దృష్టి పెట్టడం లేదు. సకాలంలో న్యాయం

మిగతా 2లో..



## పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

**మంత్రి సీతక్కకు హరీశ్‌రావు లేఖ**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు హరీశ్‌రావు లేఖ రాశారు. రాష్ట్రంలో గ్రామాల స్థితి, పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి దయనీయంగా మారిందని లేఖలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీలకు ఇచ్చిన నిధులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల పనితీరు వల్ల తెలంగాణ గ్రామాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిధులు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు తమ సొంత నిధులు ఖర్చు చేస్తున్నారని, ఆ బిల్లులు రాక ఆందోళనకు గురవుతున్నారని

మిగతా 2లో..




సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా

## వామపక్ష పార్టీలన్నీ ఏకం కావాలి

మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించాలి

సామ్రాజ్యవాద అమెరికాకు మోకరిల్లి పనిచేయడం దేశానికి మంచిది కాదు

సిపిఐ జిల్లా మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

వార్త 12లో

ఆపరేషన్ సింధు..

## ఇజ్రాయెల్ నుంచి భారతీయుల తరలింపు షురూ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇజ్రాయెల్- ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఈ దేశాల్లోని భారతీయులను స్వదేశానికి తరలించేందుకు ప్రభుత్వం 'ఆపరేషన్ సింధు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఇరాన్ నుంచి వెయ్యి మందికిపైగా పౌరులను భారత్‌కు తీసుకొచ్చింది. తాజాగా ఇజ్రాయెల్ నుంచి తరలింపు ప్రక్రియ ప్రారంభించింది.

మిగతా 9లో..



# ‘హర్మూజ్ జలసంధి’ మూసివేత




పంచుకున్నారు. అయితే, దీనిపై ఆ దేశ భద్రతా కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20 శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం-ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల బారెల్ల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది. ఇరాన్ నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్యంపైనా ప్రభావం పడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా భారత్ తన అవసరాల్లో 90శాతం ముడి చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అందులో 40శాతం హర్మూజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. ప్రభుత్వం తన 74 రోజుల చమురు నిల్వలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువపైనా ప్రభావం చూపిస్తుంది. ఇప్పటికే బ్యారెల్ ముడిచమురు ధర 90 డాలర్ల వద్ద కదలాడుతోంది. సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ దేశాల నుంచి అత్యధిక మొత్తంలో భారత్ ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఈ చమురును తీసుకొచ్చే నౌకలు ఒమన్-ఇరాన్ సముద్ర మార్గంలో ఉన్న హర్మోజ్ జల సంధిలో ప్రయాణిస్తుంటాయి. ప్రపంచ దేశాలు వినియోగించే ఎల్ఎన్‌జీలోనూ 20% ఇక్కడ నుంచే సరఫరా జరుగుతోంది. ఈ నౌకలన్నీ హర్మూజ్ జలసంధి నుంచే రాకపోకలు సాగించాలి. ఈ నేపథ్యంలో హర్మోజ్ జల సంధిని మూసివేస్తూ ఇరాన్ తీసుకున్న నిర్ణయం కారణంగా భారత్‌లో ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందని వాణిజ్య రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**ఇరాన్‌కు అణ్వాయుధాలు సరఫరా చేసేందుకు చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయి: రష్యా**

**మాస్కో(జనంసాక్షి):**ఇరాన్‌పై అమెరికా గగనతల దాడులు చేసిన నేపథ్యంలో రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రి మెద్వదేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశానికి అణ్వాయుధాలను సరఫరా చేసేందుకు చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అయితే, వాటి పేర్లను మాత్రం వెల్లడించలేదు. ఇజ్రాయెల్, అమెరికా దాడులను రష్యా వ్యతిరేకిస్తుండటం, ఆ దేశం అణ్వాయుధాలను కూడా కలిగి ఉన్న నేపథ్యంలో మెద్వదేవ్ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. అంతేకాకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరుపైనా ఆయన విమర్శలు గుప్పించారు. మధ్యప్రాచ్యంలో మరో యుద్ధానికి ట్రంప్ తెరలేపారని అన్నారు. శాంతి దూతగా చెప్పుకొంటూ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన.. యుద్ధానికి కారణమవుతున్నారని మండిపడ్డారు. ఇజ్రాయెల్ దాడులతో ఇప్పటికే ఇరాన్‌లోని సామాన్య ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని, ఎప్పుడేం జరుగుతుందో తెలియక భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ దేశంపై దాడులు చేసి.. అమెరికా కొత్త వివాదానికి తెరలేపిందని విమర్శించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చి కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశంలోని అణుస్థావరాలే లక్ష్యంగా గగనతల దాడులకు దిగిన ప్రత్యర్థులకు తగిన బుద్ధి చెబుతామన్నారు.

## ట్రంప్ ఆరంభించారు.. మేం అంతం చేస్తాం

**టెహ్రాన్(జనంసాక్షి):**ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫాహన్ అణుకేంద్రాలపై భారీ దాడులకు పాల్పడినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ దాడులకు ప్రతీకారంగా టెహ్రాన్ పశ్చిమాసియాలోని అమెరికా పౌరులు, సైనిక సిబ్బందిని లక్ష్యంగా చేసుకుంటుందని ఇరాన్ అధికారిక మీడియా అగ్రరాజ్యాన్ని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ప్రారంభించారని.. తాము అంతం చేస్తామని హెచ్చరించింది. ఇరాన్ గగనతల నిబంధనలను ఉల్లంఘించి..అమెరికా అతి పెద్ద నేరం చేసిందని..ఇకపై అక్కడి వారికి పశ్చిమాసియాలో స్థానం లేదని తెలిపింది. పశ్చిమాసియాలో ఉన్న యూఎస్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొంటూ వాటికి సంబంధించిన గ్రాఫిక్స్‌ను మీడియా ఛానెల్ ప్రసారం చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో సహకారంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని ప్రకటించిన రెండు రోజుల్లోనే ట్రంప్ ఇరాన్‌పై దాడులు చేశారు. అనంతరం అమెరికా భారీ బాంబులు ఫోర్డోపై వేసిందని.. ఇరాన్ గగనతలం బయట నుంచే ఈ దాడులు చేశామని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఇజ్రాయెల్, అమెరికా చరిత్రలో ఇది చాలా ముఖ్యమైన పరిణామమని తెలిపారు. తమ దాడులతో ఇరాన్ యుద్ధానికి ముగింపు పలకాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. మరోవైపు ఇరాన్‌పై దాడులకు ప్రతిగా తాము ఎర్ర సముద్రంలోని అమెరికా నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని హూతీలు ట్రంప్‌ను హెచ్చరించారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే అవకాశముంది. ఇరాన్‌పై అమెరికా దాడులతో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. టెహ్రాన్ తమపై మరిన్ని దాడులు చేసే అవకాశం ఉందడంతో దేశవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించింది. అమె రికాకు, తమ పౌరులకు నష్టం కలిగించేలా ఇరాన్ ఎటువంటి చర్యలు తీసుకున్నా అగ్రరాజ్యం తీవ్రంగా స్పందిస్తుందని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చ రించారు. తన మాటలను పెడచెవిన పెట్టి..టెహ్రాన్ ప్రతీకార చర్యలకు పాల్పడితే మాత్రం శనివారం రాత్రి టెహ్రాన్‌పై చేసిన దాడుల కంటే తీవ్రంగా..ఎన్నడూ చూడని విధంగా విరుచుకుపడతామన్నారు.



## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం.. పతాక స్థాయికి

30 తోమహాక్ క్షిపణులను ప్రయోగించినట్లు తెలి పారు. ఇరాన్‌లోని కీలక అణు కేంద్రాలే లక్ష్యంగా దాడులు జరిపినట్లు అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. దీనిని ‘ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్’గా పేర్కొన్న పెంటగాన్.. దీంతో ఇరాన్‌లోని అణుకార్యక్రమానికి తీవ్ర విఘాతం కలిగిందని తెలిపింది. ఈ దాడులు చేసినప్పటికీ యుద్ధాన్ని కోరుకోవడం లేదని తెలిపింది. అంతేకాకుండా అక్కడి ప్రభుత్వాన్ని పడగొట్టడం తమ దాడుల ఉద్దేశం కాదని స్పష్టం చేసింది. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను అమెరికా రక్షణశాఖ మంత్రి పీట్ హెగ్‌సేత్ మీడియాకు వెల్లడించారు. “ఇరాన్‌లో పాలనా మార్పును కోరుకోవడం లేదు. అక్కడి ప్రభుత్వాన్ని పడగొట్టడం మా దాడుల ఉద్దేశం కాదు. మా కమాండ్-ఇన్-చీఫ్ (ట్రంప్) నుంచి వచ్చిన ఆదేశాలను పాటించాం. ఇరాన్ అణు కార్యక్రమాన్ని తీవ్రంగా దెబ్బతీశాం.మొత్తంగా 14 బంకర్-బస్టర్ బాంబులను జారవిడిచాం. వీటికి పలు యుద్ధవిమానాలు సహాయంగా నిలిచాయి” అని పీట్ హెగ్‌సేత్ వెల్లడించారు.

**మిస్సైళ్లతో విరుచుకుపడ్డ ఇరాన్..**

ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులతో విరుచుకుపడింది అణుకేంద్రాలపై అమెరికా ప్రత్యక్ష దాడులు చేసిన కొన్ని గంటలకు టెహ్రాన్ ఈ విధంగా స్పందించింది.ఈ దాడులను ఐడీఎఫ్ కూడా ధ్రువీకరించింది. ఇరాన్ క్షిపణులు తమ దేశంపైకి దూసుకొస్తున్నాయని ఐడీఎఫ్ పేర్కొంది. వాటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించింది. అలా చేయకపోతే మా దాడులు మరింత తీవ్రంగా ఉంటాయి.. ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు ఈ దాడులతో టెల్ అవీవ్, జెరూసలెంతో సహా పలు ప్రాంతాల్లో భారీగా పేలుళ్లు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ తన ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. క్షిపణులు దూసుకొస్తున్నందున పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించింది. స్థానిక అధికారుల సూచనలను పాటించాలని, తదుపరి ఆదేశం వరకు అక్కడే ఉండాలని పేర్కొంది. దాదాపు 30 బాలిస్టిక్ క్షిపణలతో ఇరాన్ దాడి చేయగా అవి దేశవ్యాప్తంగా పది చోట్ల పడ్డాయి. ఈ దాడుల్లో అనేక ప్రాంతాలు దెబ్బతిన్నాయని ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది.ఓడ రేవు నగరం హైఫాతో పాటు నెస్ జియోనా, రిషాన్ లెజియన్, టెల్ అవీవ్ ప్రాంతాల్లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని స్థానిక మీడియా చెబుతోంది. ఈ ఘటనల్లో 16 మంది గాయపడినట్లు తెలుస్తోంది. టెల్ అవీవ్‌పై తొలిసారిగా ఖైబర్ షేకాన్స్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించామని ఇరాన్ దళాలు పేర్కొన్నాయి. బెన్ గురియన్ విమానాశ్రయం, బయోలాజికల్ రీసెర్చ్ సెంటర్ సహా వివిధ కమాండ్ కంట్రోల్స్ లక్ష్యంగా ఈ దాడులు జరిపినట్లు తెలిపింది.ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్ తన గగనతలాన్ని మూసివేసింది. ఈ మేరకు ఇజ్రాయెల్ విమానాశ్రయాల అథారిటీ ఓ ప్రకటన జారీ చేసింది. టెల్ అవీవ్‌కు చెందిన వివిధ విమానాయాన సంస్థలు తమ విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. క్షిపణి దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి.

**అమెరికాలో పలుచోట్ల హైఅలర్ట్**

ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలపై అమెరికా ప్రత్యక్షంగా దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడులతో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమయ్యాయి. ఈ నేపథ్యంలో అగ్రరాజ్యం పలు నగరాల్లో హై అలర్ట్ ప్రకటించింది. ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలే లక్ష్యంగా అమెరికా విరుచుకుపడింది. దీనికి ప్రతిగా టెహ్రాన్ ఎలాంటి చర్యలకు దిగుతుందనే ఆందోళన సర్వత్రా నెలకొంది. దీంతో అమెరికా అప్రమత్తమైంది. పౌరులకు ఎలాంటి హాని జరగకుండా ఉండేందుకు ముందుగానే జాగ్రత్తపడుతోంది. అందులో భాగంగా ప్రార్థనా స్థలాలు, సున్నితమైన ప్రాంతాల్లో నిఘాను పటిష్ఠం చేసింది. వాషింగ్టన్‌తో సహా పలు నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. ఇరాన్‌లో దాడుల నేపథ్యంలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు న్యూయార్క్ పోలీస్ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మతపరమైన ప్రదేశాలు, సాంస్కృతిక, దౌత్య ప్రాంతాల్లో భద్రతాపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. లాస్‌ఏంజెలెస్ మేయర్ కరన్ బాస్ కూడా ఇలాంటి ఓ ప్రకటన చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజా భద్రతకు ముప్పు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఎలాంటి బెదిరింపులు రాలేదన్నారు. ప్రార్థనా స్థలాలు, జనసమూహ ప్రాంతాలతో సహా ఇతర సున్నితమైన ప్రదేశాల్లో భద్రతను పెంచినట్లు పేర్కొన్నారు. మెట్రోపా లిటన్ పోలీస్ అధికారులు కూడా కొలంబియాలో ఎలాంటి ఘటనలు జరగకుండా మందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**ఇరాన్ యుద్ధానికి ముగింపు పలకాలి:టంప్**

ఇరాన్ అణుకేంద్రాల లక్ష్యంగా అమెరికా ప్రత్యక్షంగా దాడులకు దిగింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమయ్యాయి. ఈ తాజా దాడుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశ ప్రజలను ఉద్దేశిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై జరిపిన దాడులను చారిత్రక క్షణంగా ఆయన అభివర్ణించారు. ‘ఇరాన్‌పై చేసిన దాడులు విజయవంతమయ్యాయి. యుద్ధానికి ముగింపు పలకాల్సిన పరిస్థితికి ఇరాన్ వచ్చింది. కీలకమైన అణుస్థావరాలను ధ్వంసం చేశాం. దాని అణుసామర్థ్యాన్ని నాశనం చేయడమే మా లక్ష్యం. ప్రపంచం ఎదుర్కొంటున్న అణు ముప్పును ఆపడమే మా లక్ష్యం. పశ్చిమాసియా దేశాలను ఇరాన్ భయపెడుతోంది. ఇప్పుడు ఆ ప్రాంతంలో శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత టెహ్రాన్‌దే. ఇరాన్‌లో ఇంకా కొన్ని లక్ష్యాలు మిగిలే ఉన్నాయి. టెహ్రాన్ శాంతిని నెలకొల్పకపోతే.. దాడులు మరింత తీవ్రంగా ఉంటాయి. యూఎస్, టెల్‌అవీవ్ కలిసి పనిచేస్తాయి’ అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. ఇజ్రాయెల్, యూఎస్‌లు ఒక టీమ్‌లా పనిచేశాయన్నారు. ఇజ్రాయెల్ మిలిటరీపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఈ తాజా దాడుల్లో అమెరికన్ దళాలు అద్భుతంగా పనిచేశాయంటూ అభినందించారు. ఇది పూర్తిగా సైనిక విజయమన్నారు. శాంతి కావాలా? విషాదం కావాలా? అనేది టెహ్రాన్ నిర్ణయించుకోవాలన్నారు. పశ్చిమాసియాలో త్వరగా శాంతి నెలకొల్పకపోతే.. మిగిలిన లక్ష్యాలన్నింటినీ అంతం చేస్తామని హెచ్చరించారు.ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫాహన్ అణుకేంద్రాలపై అమెరికా భీకర దాడులు చేసింది. ట్రంపే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. విజయవంతంగా దాడులు చేశామని పేర్కొన్న ఆయన.. ఇప్పుడు శాంతికి సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఇరాన్ మీడియా సంస్థ కూడా ఈ దాడులను ధ్రువీకరించింది.

అమెరికా నిర్ణయం చారిత్రాత్మకం:నెతన్యాహు

ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలపై అమెరికా బీ-2 స్పిరిట్ బాంబర్లతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ తాజా దాడులకు గాను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. యూఎస్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం చరిత్రను మార్చేస్తుందన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు.‘అధ్యక్షుడు ట్రంప్‌నకు అభినందనలు. మీ అద్భుతమైన, ధర్మబద్ధమైన శక్తితో ఇరాన్ అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ మీ నిర్ణయం సాహసోపేతమైనది. ఇది చరిత్రను మార్చేస్తుంది. ఆపరేషన్ రైజింగ్ లయన్‌లో ఇజ్రాయెల్ అద్భుతమైన ప్రయోజనాలను అందుకుంది, అయితే, తాజాగా అణుకేంద్రాల లక్ష్యంగా అమెరికా చేసిన దాడులు నిజంగా అద్వితీయమైనవి. భూమిపై మరే దేశం చేయలేనిది మీరు చేశారు. ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన పాలనను, దాని వద్ద ఉన్న ఆయుధాలను అంతం చేసేందుకు ట్రంప్ వ్యవహరించిన తీరు చరిత్రలో నిలిచిపోతుంది. ట్రంప్, నేను తరచూ బలమైన శక్తి ద్వారానే శాంతి నెలకొంటుందని చెబుతుంటాం. ముందు శక్తిని ప్రయోగిస్తే.. ఆ తర్వాత శాంతి అదే వస్తోంది. ఇరాన్‌పై దాడుల్లో యూఎస్ చాలా శక్తితో వ్యవహరించింది. ట్రంప్ మీకు నా ధన్యవాదాలు. ఇజ్రాయెల్ ప్రజల తరఫు నుంచి కూడా’ అని నెతన్యాహు మాట్లాడారు.

మాట ఇచ్చా.. నిలబెట్టుకున్నా..

ఇరాన్ అణుకేంద్రాలను నాశనం చేస్తామని యుద్ధ ప్రారంభంలో తాను మాటిచ్చానని.. తాజాగా దాన్ని నిలబెట్టుకున్నానని నెతన్యాహు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అణుకేంద్రాలను ధ్వంసం చేయాలని ఐడీఎఫ్ ఈ నెల 13న చేపట్టిన పనిని.. అమెరికా పూర్తిచేసిందన్నారు. ఈ దాడుల అనంతరం ట్రంప్ తనకు ఫోన్ చేశారని పేర్కొన్నారు. ఈ ఫోన్ కాల్‌లో అధ్యక్షుడు తనను, టెల్‌అవీవ్ దళాలను అభినందించారన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ తమకు గొప్ప స్నేహితుడని, మరెవరికీ ఇలాంటి స్నేహితుడు లేరని వ్యాఖ్యానించారు. ఇరాన్‌లోని ఫోర్డ్, నతాంజ్, ఇస్ఫాహన్ అణుకేంద్రాలపై అమెరికా భీకర దాడులు చేసింది. ట్రంపే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. విజయవంతంగా దాడులు చేశామని పేర్కొన్న ఆయన.. ఇప్పుడు శాంతికి సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఇరాన్ మీడియా సంస్థ కూడా ఈ దాడులను ధ్రువీకరించింది. కాగా.. ఈ దాడుల అనంతరం ట్రంప్, నెతన్యాహు ఫోన్‌లో మాట్లాడుకున్నారు.

## చర్చల ద్వారా పరిష్కరించుకోండి

**ఇరాన్,ఇజ్రాయెల్‌లకు మోదీ హితవు**

**ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని ఫోన్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇరాన్- ఇజ్రాయెల్ మ ధ్య కొనసాగుతున్న దాడులతో పశ్చిమాసియాలో వాతావరణం వేడెక్కింది. టెహ్రాన్‌పై అమెరికా దాడులతో అది మరింత ముదిరింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడులు నిర్వహించడంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడారు.పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిణామాలపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మసౌద్‌తో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం జరుపుతున్న దాడులను ఆపేయాలని కోరారు. శత్రుత్వాన్ని తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. దౌత్య మార్గంలో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

## అమెరికాకు శాశ్వత గాయం ఖాయం

**– ఇరాన్ విదేశాంగ మంత్రి**

తమ దేశంలోని అణుస్థావరాలపై అమెరికా చేసిన దాడులను ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చి తీవ్రంగా ఖండించారు. ఇక అగ్రరాజ్యానికి శాశ్వత గాయం ఖాయమైందని వ్యాఖ్యానించారు. ఆ దేశం తన చర్యలతో అంతర్జాతీయ చట్టాలను, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందాన్ని ఉల్లంఘించిందని పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశమైన అమెరికా.. తన నేరపూరిత ప్రవర్తనతో తాము శాంతి యుతంగా ఏర్పాటు చేసుకుంటున్న అణుకేంద్రాలపై దాడులకు పాల్పడిందని మండిపడ్డారు. ఈ చర్యలతో అమెరికా శాశ్వత పరిణామాలను అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇటువంటి నేరపూరిత ప్రవర్తన ఉన్న అగ్రరాజ్యంతో యూఎన్‌లోని సభ్యులు అప్రమత్తంగా ఉండాలని అబ్బాస్ సూచించారు. ఈ ఘటనపై ప్రపంచ దేశాలు స్పందించాలని కోరారు. యూఎన్ చార్టర్ ప్రకారం.. ఆత్మరక్షణ హక్కును వినియోగించుకుంటూ ఇరాన్ తన సార్వభౌమత్వాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. టెల్‌అవీవ్‌పై టెహ్రాన్ భారీ స్థాయిలో ప్రతిదాడులకు సిద్ధమవుతోందని పేర్కొన్నారు. ఇరాన్‌లోని ఫోర్డ్, నతాంజ్, ఇస్ఫాహన్ అణుకేంద్రాలపై అమెరికా భీకర దాడులు చేసింది. యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. విజయవంతంగా దాడులు చేశామని పేర్కొన్న ఆయన.. ఇప్పుడు శాంతికి సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఇరాన్ మీడియా సంస్థ కూడా ఈ దాడులను ధ్రువీకరించింది. అమెరికా తమపై దాడులు చేసినందుక తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించింది.

## ‘పహల్గామ్’ ఉగ్రవాదులకు ఆశ్రయం..

దాచి ఉంచారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. విచారణ సమయంలో పర్వైజ్, బషీర్ ఈ ఉగ్రదాడిలో పాల్గొన్నవారి గుర్తింపులను వెల్లడించారని, వారు పాకిస్తానీ జాతీయులని నిర్ధారించారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.పర్యాటకులను వారి మతపరమైన గుర్తింపు ఆధారంగా ఉగ్రవాదులు దాడులకు పాల్పడారు. ఇది ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో జరిగిన భారీ ఉగ్రదాడులలో ఒకటిగా నిలిచింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967లోని సెక్షన్ 19 కింద వీరిద్దరినీ అరెస్టు చేశారు. . .

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భాజపా పాలన

భాజపాని అద్భుత మెజార్టీతో గెలిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాకిస్థాన్ ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉండేది. దేశంలోని పలు ప్రాంతాలను ఉగ్రవాదులు నాశనం చేశారు. హైదరాబాద్‌లోనూ పాక్ ఉగ్రవాదులు రక్తపాతం సృష్టించారు. ఉగ్రవాద కార్యకలాపాలు జరిగినా.. ఏం చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో కాంగ్రెస్ ఉండేది. ప్రస్తుతం ప్రధాని మోదీ నేతృత్వంలో పాక్ దాడులకు గట్టిగా బదులిచ్చాం. ప్రపంచ దేశాలు నివ్వెరపోయేలా గట్టి జవాబు ఇచ్చాం”అని కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు మోదీ 11 ఏళ్లలో రూ. 11లక్షల కోట్లు ఖర్చు చేశారని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మోదీ 11 ఏళ్ల పాలన దేశానికి స్వర్ణయుగమన్నారు. .

## స్వతంత్ర భారత చరిత్రలో ఫోన్‌ట్యాపింగ్ అతిపెద్ద నేరం

**హైదరాబాద్(జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికలపై ఇంకా నిర్ణయం జరగలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మంత్రివర్గంలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. బనకచర్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని చెప్పారు. ”కాంగ్రెస్ ముఖ్యనేతలు, పారిశ్రామికవేత్తల ఫోన్లు ట్యాప్ చేసిన చరిత్ర భారాసది. ఫోన్లు ట్యాప్ అయినవారి పేర్లు వెల్లడించాలని సిట్‌ను కోరుతున్నా. కేసీఆర్, కేటీఆర్ ప్రమేయంతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు భావిస్తున్నాం. దీనిలో భాగమైన ప్రతి ఒక్కరూ జైలుకు వెళ్తారు”అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

తెలిపారు. మాజీ సర్పంచులకు సైతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల నోటిఫికేషన్ వస్తే.. బిల్లులు రావడం మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున త్వరగా విడుదల చేయాలని కోరారు. ఈ మేరకు ఆరు డిమాండ్లను హరీశ రావు తన లేఖలో ప్రస్తావించారు.గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని, గతంలో చేసిన పనులకు మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

## పన్నేతర రాబడులపై దృష్టిసారించండి



ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు సహా పలు కొత్త పథకాలను ప్రజలకు ఇస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. బడ్జెట్ నిధులు కొన్ని శాఖలు అధికంగా, మరికొన్ని శాఖలకు అతి తక్కువగా అందుతున్నాయి. బడ్జెట్ ని అన్ని శాఖల, డిపార్ట్మెంట్లకు సమానంగా పంచాలి. డిపార్ట్మెంట్ల మధ్య ఖర్చు అంతరాలను తగ్గించి.. అన్నింటిని ఒకే స్థాయిలోకి తీసుకురావాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. బడ్జెట్ క్కటాయింపులను అన్ని శాఖలు, డిపార్ట్మెంట్లకు సమానంగా పంచబడాలి. అలాగే రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో పెండింగ్ లో ఉన్న మేజర్ ప్రాజెక్టులను ప్రాముఖ్యతను అనుసరించి వెంటనే పూర్తి చేయాల ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రం అవసరాలను, ప్రాముఖ్యతల మేరకు బడ్జెట్ నిధులను ఖర్చు చేయాలి. డిపార్ట్స్ ఖర్చులను కూడా రేషనలైజేషన్ చేసుకుని ప్రయారిటీల అధారంగా ముందుకు వెళ్లాలి. రెవెన్యూ తీసుకువచ్చే శాకలు, డిపార్ట్ మెంట్లపై సీరియస్ గా దృష్టి సారించాలి. అవసరాల మేరకు ఖర్చును చేయాలని సూచించాను. స్టేట్ రియలిస్టిక్ గా, లాజికల్ గా ఖర్చులను చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. రెవెన్యూను పెంచడం, నాన్ టాక్స్ రెవెన్యూపై అధికారులంతా సీరియస్ గా దృష్టి సారించాలన్నారు. పబ్లిక్ ఇంట్రస్ట్, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజా ప్రభుత్వం ఆలోచనల మేరకు అందరూ పని చేయాలని అన్నారు. రేషనలైజేషన్ మేరకు పనులను పూర్తి చేయాలి. స్పిల్ ఓవర్ వర్క్స్ కూడా ప్యారిటీల మేరకు పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే.. రాష్ట్రం సంపూర్ణ స్థాయిలో ముందుకు వెళుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక రాబోయే పది రోజుల్లో రేషనలైజేషన్ పూర్తి చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆయుధాలు వీడి అభివృద్ధి పథంలో కలిసి రావాలి

అందించేందుకూ చర్యలు తీసుకుంటోంది. కొత్త చట్టాలు దీనికి దోహదపడతాయి” అని తెలిపారు. ఇదిలా ఉండగా.. నక్సలిజం సమస్యపై ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఝూరండ్, ఒడిశా ఉన్నతాధికారులతో అమిత్ షా సమావేశం నిర్వహించనున్నారు.

## ‘ఆయిల్‌పామ్’ సాగుతో అధిక లాభాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, కోయ శ్రీ హర్ష, సందీప్ కుమార్, సత్య ప్రసాద్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరెందర్ రెడ్డి, ఎమ్మెల్యే లు కల్వకుంట్ల సంజయ్, మేడిపల్లి సత్యం, చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, డాక్టర్ సంజయ్ కుమార్, కవ్వంపల్లి సత్య నారాయణ, గంగుల కమలాకర్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో వర్షా భావ పరిస్థితులు, క్రాప్ బుకింగ్, సాగు వివరాలు, విత్తనాలు, ఎరువుల లభ్యత, రైతు భరోసా, ఆయిల్ పామ్ సాగు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, గ్రౌండిరగ్ జరిగిన ఇండ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, బడి బాట, మధ్యాహ్న భోజనం, తదితర అంశాలను ఉమ్మడి కరీంనగర్ జిల్లాల వారీగా సంబంధిత జిల్లా కలెక్టర్ లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంగా గత పాలకుల హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న అస్తవ్యస్త పరిస్థితులను సరి చేస్తూ ఆర్థికపరమైన వెసులుబాటు చేసుకొని పాలన సాగిస్తున్నామని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా పని చేయాలని అన్నారు. ప్రజలకు మేల్కైన పాలన అందించాలని, ఎక్కడా ఎటువంటి అవినీతి ఆస్కారం లేకుండా పాలన చేయాలని అన్నారు. జూలై వరకు అవసరమైన విత్తనాలు, ఎరువుల స్టాక్ జిల్లాలో అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. యూరియా వాడకం తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తక్కువ సరఫరా చేస్తుందని, అవసరమైన మేర మాత్రమే యూరియా వాడాలని, అధికంగా వాడటం వల్ల భూ సారం తగ్గిపోతుందని, భూమికి నష్టం జరుగుతుందని, దీని పై రైతులకు రెగ్యులర్ గా అవగాహన కల్పించాలని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఆయిల్ పామ్ సాగు పై మరింత శ్రద్ధ వహించాలని, ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యాలకు మించి ఆయిల్ పామ్ విస్తరణ చేపట్టాలని అన్నారు. ఆయిల్ పామ్ పంట చేతికి వచ్చిన రైతుల అనుభవాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ చేయాలని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 9 రోజుల వ్యవధిలో 9 వేల కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ చేస్తున్న వ్యవసాయ శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులు పూర్తిస్థాయిలో కాకపోయినా తమకు

# కాళేశ్వరం విషయంలో బీజేపీపై విషప్రచారం

- కేసీఆర్ కుటుంబానికి రేవంత్ ప్రభుత్వమే రక్షణ కవచం
- కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం ఏటీఎంగా మారిందని ప్రధానే చెప్పారు.
- అయినా రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.
- సీబీఐ విచారణ జరపాలని రాహుల్ గాంధీ చెప్పిన మాటలేమైనయ్?
- కుటుంబ పార్టీలకు బీజేపీ పూర్తి వ్యతిరేకం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



కరీంనగర్ బ్యూరో, జూన్ 22 (జనంసాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీజేపీపై విష ప్రచారం జరుగుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఆదివారం కరీంనగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... "కాళేశ్వరం విషయంలో మోదీ చెప్పిన మాటలే బీజేపీ విధానం. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని చెప్పారు. ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరపాలన్నదే మా డిమాండ్ ఇందులో మరోదానికి తావులేదు"అని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయమని, దీనిపై సీబీఐ విచారణ జరపాలని రాహుల్ గాంధీ చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రూ.38 వేల కోట్ల ప్రాజెక్టును రూ.1.2 లక్ష కోట్ల అంచనాలు పెంచిన కేసీఆర్ కుటుంబం వేల కోట్లు దోచుకుందన్నారు. కాళేశ్వరంతో ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కాళేశ్వరంపై బీజేపీ స్టాండ్ మారిందని, బీఆర్ఎస్ తో కుమ్మక్కైందని కొంత మంది విష ప్రచారం చేస్తున్నారని ఈ విషయంలో బీజేపీ స్టాండ్ వెరీ క్లియర్ అని కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఆయనతోపాటు అమిత్ షా, జేపీ నడ్డా కూడా మాట్లాడారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరపాలన్నదే బీజేపీ విధానం. అంతేతప్ప ఊసరవెల్లి మాదిరిగా విధానాలు మార్చుకునే పార్టీ బీజేపీ కానే కాదు అని 11 ఏళ్లుగా ప్రధానిగా కొనసాగుతూ నీతివంతమైన పాలన అందిస్తున్న మహానాయకుడు మోదీ ఏ ఆధారాల్లేకుండా కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని చెబుతారా? చెప్పరు కదా. మీరే ఆలోచించండి. అంతెందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండగా ఫోన్ ట్యాపింగ్ జరిగింది. ఇప్పుడు నేను కేంద్ర మంత్రిని అయినా నా స్టాండ్ మారుతుందా? బీజేపీ స్టాండే నా స్టాండ్, కాళేశ్వరంపై బీజేపీ స్టాండ్ కు భిన్నంగా మా పార్టీ నాయకులు ఎవరూ మాట్లాడినా తప్పే. వాళ్ల విషయం హైకమాండ్ చూసుకుంటది. కాళేశ్వరం ముమ్మాటికీ పూర్తిగా అవినీతిమయమైన ప్రాజెక్టు. 38 వేల కోట్ల ప్రాజెక్టును 1.2 లక్షల కోట్ల అంచనాలు పెంచి కేసీఆర్ దోచుకున్నది ముమ్మాటికీ నిజం. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన అధికారులే వందల కోట్లు సంపాదించారంటే, ఇగ కేసీఆర్ కుటుంబం ఏ స్థాయిలో అవినీతికి పాల్పడిరదో అర్థం చేసుకోవచ్చు. నిజానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వేర్వేరు కానేకాదు. సంయుక్తంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. ఈ రెండు పార్టీలు నాణేనికి బొమ్మాబొరుసులాంటివి. కేసీఆర్ కు రేవంత్ రెడ్డి రక్షణ కవచంగా మారారు. అందుకే కేసీఆర్ పై ఎన్ని అవినీతి ఆరోపణలున్నా, కేసులు పెట్టినా ఆయనను మాత్రం అరెస్ట్ చేయకుండా కాపాడుతున్నారు. ప్రజలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు అర్థమైనయ్. అందుకే 'అందరికీ ఇచ్చాం అవకాశం...ఇక బీజేపీకి ఇద్దాం అధికారం' అనే నిర్ణయానికి వచ్చారు. ఎన్డీఎస్ఏ అంటే ఏమనుకుంటున్నరు. కేసీఆర్ లెక్క తాగి ఏది పడితే అది రాసే సంస్థ కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం... పార్లమెంట్ ఆమోదించి ఏర్పాటు చేసిన అథారిటీ ఇది. ఎన్డీఎస్ స్వతంత్ర్యపైనే బురద చల్లుతారా.? బీజేపీ కుటుంబ పార్టీలకు ముమ్మాటికీ వ్యతిరేకం. బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుంటామని ఎందుకు అనుకుంటున్నారు? బీఆర్ఎస్ లాంటి అవినీతి, కుటుంబ పార్టీని దరిదాపుల్లోకి కూడా రానీయం. కరీంనగర్ లో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిందే. ముఖ్యంగా జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలకు సంబంధించిన ఫైలు విషయం పై కలెక్టర్ తో మాట్లాడిన. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కమార్ రెడ్డితోనూ మాట్లాడి తప్పకుండా స్థలాలిచ్చేలా క్రుషి చేస్తా. అట్లాగే మిగిలిన అర్హులైన జర్నలిస్టులందరికీ కూడా స్థలాలు ఇప్పించేందుకు యత్నిస్తా. బీజేపీ అధికారంలోకి వస్తే తప్పకుండా స్థలాలిచ్చే బాధ్యత తీసుకుంటా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

# పీవోడబ్ల్యూ సంధ్యపై పోలీసుల దౌర్జన్యం దారుణం

- ఆమె కాలికి గాయం చేశారు
- తీవ్రంగా ఖండించిన చైతన్య మహిళా సంఘం



హైదరాబాద్ (జనంసాక్షి) : ఈనెల 19న గాజా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడిని నిరసిస్తూ పాలస్తీనాకు మద్దతుగా అమెరికన్ కన్సలేట్ ఆఫీస్ ఎదురుగా వామపక్ష, విప్లవ పార్టీలు దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా జరిగిన నిరసన కార్యక్రమంలో పోలీసులు దౌర్జన్యంగా ప్రవర్తించారని, దీంతో సంధ్య మోకాలు విరిగిందని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, రాష్ట్ర కో కన్వీనర్స్ రాధా, శ్రీదేవి తెలిపారు. ఆ గాయంతోనే ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఆమెకి గాయం అయిన విషయాన్ని పోలీసులకి తెలిపి తనని హాస్పిటల్ కి చేర్చాలని ఎంతగా వేడుకున్నా కూడా కనికరం కూడా లేకుండా ఆమెని రాత్రి 7 గంటల వరకు పోలీస్ స్టేషన్ లోనే నిర్బంధించారని వివరించారు. రాత్రి ఏడు తర్వాతనే ఆమె హాస్పిటల్లో చూపించుకోగా ఆమె కాలికి ఫ్యాక్చర్ అయిందని 45 రోజులు పాటు రెస్ట్ తీసుకోవాలని కాలికి సిమెంట్ కట్టు వేశారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా తరచూ జరిగే ధర్నాలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాల్లో మహిళా ఆందోళనకారులను అదుపు చేయడానికి పోలీసులు ప్రత్యేకంగా "స్విఫ్ట్ విమెన్ యాక్షన్ టీం" అని ఒక అధికారికంగా పేరు పెట్టి స్పెషల్ ట్రైనింగ్ ఇచ్చి మహిళ సంఘాల, ప్రజాసంఘాల మహిళలను ఆందోళనకారుల నుండి వేరుచేసి వారిని అత్యంత దౌర్జన్యంతో పైకి కనబడని హింసతో వాహనాలపైకి ఎక్కించి తరలిస్తున్నారని, మహిళలని, పెద్దవయసు వారు అని కూడా చూడకుండా ఎలా పడితే అలాగా తరలించడం వలన సంధ్యకు కాలికి ఫ్యాక్చర్ అయిందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడు తామని ప్రజలకి వాగ్దానం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మహిళల పట్ల ఇలా అమానుషంగా ప్రవర్తన చేయడాన్ని చైతన్య మహిళా సంఘం తీవ్రంగా ఖండిస్తున్నది. తెలంగాణ ప్రజలు పోరాటాల్లో నిరంతరం భాగస్వామ్యం అవుతూనే ఉంటారు. ప్రభుత్వాలను ప్రశ్నిస్తూనే ఉంటారని, ఆ చైతన్యం ముఖ్యంగా మహిళలకు ఉండటాన్ని ప్రభుత్వం ఓర్చుకోలేక వారిపట్ల నిరంకుశంగా ప్రవర్తన చేస్తూ దాడులుకి దిగడం వారి పట్ల అసభ్యంగా మాట్లాడడం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా ప్రశ్నించే హక్కు నిరసనలు తెలిపే హక్కు ఈ దేశంలో ఉందని తెలిపారు. పీఓడబ్ల్యు సంధ్యను గాయపరిచిన పోలీసులను వెంటనే అరెస్టు చేయాలని దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# జీవో 49ను, కొమరంభీం టైగర్ కారిడర్ రద్దు చేయాలి

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను అడవుల నుండి దూరం చేసే కుట్ర
- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు




హైదరాబాద్ (జనంసాక్షి) : టైగర్ కంజర్వేషన్ పేరుతో ఆదివాసీలు సాగుచేస్తున్న భూముల నుండి, వారు నివసిస్తున్న ప్రాంతాలనుండి దూరం చేసి కార్పొరేట్ కంపెనీలకు అడవులను కట్టబెట్టేందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీవో 49 తీసుకొచ్చాయని, జీవో 49 టైగర్ కారిడర్ ను రద్దు చేయాలనీ, పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని, పోడు పట్టాలకు బ్యాంక్ రుణాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షులు మాజీ భద్రాచలం ఎంపీ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఎదుట టీఏజీఎస్ ఆధ్వర్యంలో జీవో 49 పత్రాలను దగ్ధం చేసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైగర్ కంజర్వేషన్ కోసం ఎలాంటి గ్రామ సభలు జరుపకుండా, షెడ్యూల్ ప్రాంతం రాజ్యాంగ హక్కులను సైతం గౌరవించకుండా 300 పైగా గ్రామాలను ఖాళీ చేసేందుకు వారి ని భూముల నుండి వెళ్లగొట్టేందుకే ఈ జీవో అని మండి పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ దారిలోనే ఆదివాసీలను అడవులనుండి వెళ్లగొట్టే విధానం అమలు చేస్తుందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ అటవీ విధానం షెడ్యూల్ ప్రాంతాల్లోని గ్రామసభ పెసా షెడ్యూల్ హక్కులను కాలరాసి ఆ అటవీ లోని ఖనిజా సంపదలను పెట్టుబడి దారులకు, కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు విధానం తీసుకొచ్చిందని, అందులో భాగంగా చత్తీస్‌గడ్ ప్రాంతంలోని హస్ దే అటవీ ప్రాంతంలోని 4 లక్షల ఎకరాలను ఆదానీకి అప్పజెప్పిందని, దేశంలో అటవీ ప్రాంతంలోని ఆదివాసీలను అక్కడి నుండి వెళ్లగొట్టి టైగర్ కారిడార్‌ల పేరుతో భూములను తీసుకొంటుంది దీన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లో గతంలో కవ్వాల్ టైగర్ జోన్ పేరుతో ఆదివాసీలను భూ నిర్వాసితులను చేసి వారికి ఎలాంటి పరిహారం చెల్లించకుండా వారి కుటుంబాలను రోడ్డు మీదికి లాగరాని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతం లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌళిక సౌకర్యాలు కల్పించి ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న డాక్టర్, ల్యాబ్ టెక్నీషన్, నర్సుల పోస్టులను భర్తీ చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి రవికుమార్, ఎర్మ పున్నం, కె.శ్రీనివాస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆత్రం తనుష్, ఆత్రం కిష్టన్న, తొడసం శంబు, ఉయిక విష్ణు, వృత్తి దారుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ పైళ్ల ఆశయ్య, నాయకులు అశోక్, రాజన్న, దర్శనాల మల్లేష్, సంకె రవి, కుశన్న రాజన్న, లంకా రాఘవులు ,ముంజం ఆనంద్ కుమార్ నైతం రాజు, కొట్నాక్ సక్కు తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత సమయంలో కాళేశ్వరాన్ని పూర్తి చేసిన కేసీఆర్

- సాగునీరు అందించిన ఘనత ఆయనది
- నేటి పాలకులు ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాలు తాకట్టు
- మతం పేరుతో,మనుషుల బలహీనతలతో పాలన
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- తెలంగాణ సోషల్ ఫౌండేషన్(టీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం




హైదరాబాద్ (జనంసాక్షి) : నిర్ణీత సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. నీళ్ల ప్రాధాన్యత తెలియజేసింది తెలంగాణ పాలకులేనని, సకల జీవరాశుల జీవనం కోసం, సారవంతమైన భూముల పరిరక్షణ కోసం ప్రాజెక్టుల నిర్మాణాన్నికి నాంది పలికింది తెలంగాణ పాలకులేనని అన్నారు. "తెలంగాణ జలవనరులు..వ్యవసాయం...నాడు, నేడు, రేపు' అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం హైద్రాబాద్ షోయబ్ హాల్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నీళ్ల ప్రాధాన్యత,నేటి పాలకులు సాగునీటి నిల్వలో నిర్లక్ష్యం చేస్తున్న విధానాలను సోదాహరణంగా వివరించారు. వందల ఏండ్ల కింద సాగునీటి ప్రాజెక్టులు లేనందున వృథాగా పోతున్న నీళ్ళ వల్ల సారవంతమైన భూములు కొట్టుకుపోయి సముద్రములో కలవడం మిగతా భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోవడం,సకల జీవరాశుల జీవనం దుర్భేద్యం కావడం గమనించిన నాటి తెలంగాణ పాలకులు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి నీటిని నిల్వ చేసి భావితరాల భవిష్యత్తు కోసం బాటలు వేశారని కొనియాడారు. నేటి పాలకులు ముందుచూపు లేకుండా వ్యవహరించడంతో మనకు దక్కాల్సిన నీటి వాటాలు ఇతర రాష్ట్రాలకు తరలుతున్నాయని దుయ్యబట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాగార్జున సాగర్,శ్రీశైలం,జూరాల వంటి ప్రాజెక్టులు కట్టడానికి పాలకులు 20,30,40ఏండ్లు సాగదీశారు. కానీ కె.సి.ఆర్ గారు మూడున్నర ఏండ్లలో కాళేశ్వర్ ప్రాజెక్ట్ నిర్మించి కోటి ఎకరాలకు నీళ్లు అందించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల నిర్మాణం 90శాతం పూర్తి చేశారు. ప్రస్తుత పాలకులు మిగిలిన 10శాతం పనులు కూడా చేయలేకపోతున్నారు. ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోవు తరాలు మరో గ్రహం మీద ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం వస్తుంది. ఓటెందు నరసింహ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, శ్రీధర్ రావు దేశ్‌పాండే, వేణుగోపాల్ స్వామి, అయాచితం శ్రీధర్, తన్నీరువెంకటేశం పాల్గొన్నారు.

# అమీన్‌పూర్‌లో ఎమ్మెల్సీ కోదండరాం పర్యటన

- కొమ్ము ప్రాంత వాసుల సన్మానం
- చెరువులను కాపాడుకోవాలని కాలనీ వాసులకు ఎమ్మెల్సీ సూచన



సంగారెడ్డి (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండ రామ్ పర్యటించారు. చందానగర్ జాతీయ రహదారి నుండి అమీన్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ చేయాలని శాసన మండలి లో ప్రస్తావించి...నిధులు మంజూరు చేసేలా చేసినందుకు బంధం కొమ్ము ప్రాంత కాలనీ వాసులు ఎమ్మెల్సీ కి సన్మానం చేశారు. అలాగే బంధం కొమ్ము చెరువు లో పరిసర ప్రాంతాల కాలనీల డ్రైనేజీ కలుస్తుదని...చెరువు కలుషితం కాకుండా కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ ను నిర్మాణం చేయాలని ఎమ్మెల్సీ కోదండ రామ్ కు కృష్ణ బృందావన్ కాలనీ, శ్రీధామ్ హిల్స్, త్రిపుర హెూమ్స్, హిల్ టాప్ హెూమ్స్ కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. అమీన్ పూర్ పెద్ద చెరువు ప్రాంతాల్లో కుడా పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమీన్ పూర్ లోని జీవ వైవిధ్యం కల్గిన పెద్ద చెరువు, బంధం కొమ్ము చెరువులను కాపాడుకోవాలని... అమీన్ పూర్ ప్రాంతంలోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని...శాసన మండలి లో అమీన్ పూర్ ప్రాంత ప్రజల సమస్యలను ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ కోదండ రామ్ హామీ ఇచ్చారు.

# బొడ్రాయి దేవతల ప్రతినిధి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా




హైదరాబాద్ (జనంసాక్షి) : బొడ్రాయి దేవతల ప్రతినిధి అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సరూర్ నగర్ బొడ్రాయి 3వ వార్షకోత్సవంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. బోయిని మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు మాట్లాడుతూ బొడ్రాయి ప్రతిష్ట మహెూత్సవము అనేది మహాలక్ష్మి అంశ అని, బొడ్రాయి అనేది దేవతలకు ప్రతినిధి అని అన్నారు. ఊరి భౌగోళిక పరిమాణం, ఊరి నిర్మాణం పైన ప్రజలందరికీ అవగాహణ కల్పించడం కోసమే ఈ పండుగను చేస్తారని, ప్రతీ ఒక్కరు తమ మత ఆచారాలకు అనుగుణంగా దైవ చింతనను కలిగి ఉండడం వలన మానసిన ప్రశాంతత చేకూరుతుంది. ఊరిలోని వారంతా కలిసి ఐకమత్యంగా ఉండాలని ఊరు బాగు కోసం ప్రతీ ఒక్కరు ఆలోచించాలనేది దీని వెనుక ఉన్న ప్రధాన ఆంతర్యం అని ఆయన అన్నారు.గ్రామ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో పాడి పంటలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అశ్విని కుమార్, శంకర్ యాదవ్, వెంకటేష్, నరేష్, రిష్, గ్రామ పెద్దలు యువత మహిళ సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే టాప్ర నిర్మాణం ప్రత్యేకత

- ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.వీరయ్య
- ఉద్యోగుల కష్టార్జితాన్ని కార్పొరేట్లపరం చేయవద్దు : ఏఐఎస్ జీఈఎఫ్ సెక్రెటరీ జనరల్ శ్రీకుమార్
- జులై సార్వత్రిక సమ్మెలో పెన్షనర్లు పాల్గొనాలి : ఏఐఎస్ జీఈఎఫ్ పీఏ జనరల్ సెక్రటరీ అతుల్ దిగే




హైదరాబాద్ (జనంసాక్షి) : దేశంలోనే టాప్ర నిర్మాణ ప్రత్యేకతను కలిగి ఉందని ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.వీరయ్య అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సొంత కార్యాలయం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి, సంఘ సీనియర్ నాయకులు ప్రభాకర్ నాయర్ సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘ కార్యాలయాన్ని ఎంఎన్ రెడ్డి చైర్మెన్ ఏఐసిసి ఇపిఎఫ్ పిఏ, లిఫ్టుని యు. ఆంజనేయులు పూర్వ ఎన్.జి.ఓ నాయకులు, సమావేశ మందిరాన్ని శ్రీకుమార్ సెక్రటరీ జనరల్, ఏఐఎస్ జిఇఎఫ్ ప్రారంభించారు. అనంతరం సంఘ అధ్యక్షులు పి. నారాయణ రెడ్డ అధ్యక్షతన సమావేశం జరిగింది. టి. సీతారాం సమన్వయ కర్తగా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శి పి క్రుష్ణ మూర్తి భవన కొనుగోలు, అవసరం, భవనాన్ని ఉద్యమ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక నివేదికను సమర్పించారు. ఈ సమావేశానికి ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.వీరయ్య ప్రారంభోపన్యాసం చేస్తూ దేశంలోనే టాప్ర నిర్మాణం ప్రత్యేకతను కలిగి ఉందని మరెక్కడా లేని విధంగా వివిధ రంగాల పెన్షనర్లందరినీ ఒకే వేదిక కిందకు తెచ్చి ఒకరి సమస్యల పరిష్కారం కొరకు ఇంకొకరు ఏ విధంగా సహకరించి అందరి సమస్యలు పరిష్కారానికి ఉద్యమాన్ని నిర్మించే పని టాప్ర చేస్తోందని కొనియాడారు. శ్రీకుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల కష్టార్జితం పెన్షన్ నిధులను ప్రైవేటు పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం డిఫైండ్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తచ్చిందనీ, దానికి యుపియస్ అని పేరు పెట్టినా కొత్తగా చేరిన ప్రయోజనం ఏమీలేదన్నారు. ఉద్యోగుల కష్టార్జితాన్ని కార్పొరేట్ల పరం చేయవద్దని డిమాండ్ చేసారు. అతుల్ దిగే మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం మొత్తం శ్రామిక ప్రజల సమస్యల పరిష్కారంతో ముడిపడి ఉందని, దేశ వ్యాప్తంగా జులై 9వ తేదీన కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో పెన్షనర్లు కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు సిఐటియు, ఏ వెంకట్ యుటియఫ్, ఎం సంయుక్త ఎస్టిఎఫ్ఐ, నాగేశ్వర్ రావు కన్ఫడరేషన్, రామచంద్రుడు, బిఎస్ఎన్ఎల్, విజయ భాస్కర్ రెడ్డి జిఐసి, కెవి, ఎంప్లాయీస్ వాయిస్ సంపాదకులు, అశోక్ క్రుష్ణా నగర్ కాలని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, సంఘ నాయకులు కె. నాగేశ్వర్ రావు, ఎం. జనార్ధన్ రెడ్డి, ఎన్ సోమయ్య, ఎం రంగయ్య, డా. ఎల్ అరుణ, టి. సీతారాం, కె. రాంమోహన్ రావు, జి. అశోక్, వై కొండాల్ రావు, వైకుంఠరావు, రాధాక్రుష్ణ, రామక్రుష్ణ, హరి ప్రసాద్, వివిధ జిల్లాలనుండి వచ్చిన నాయకులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



మల్హర్, జూన్ 22(జనంసాక్షి) : భూపాలపల్లి జిల్లా మాలహర్ రావు మండల పరది లోని కిషన్ రావు గ్రామం లో ఆదివారం రోజున అగ్ని ప్రమాదం లో ఇల్లు దగ్ధం అయింది. గ్రామానికి చెందిన కాగితపు బాపు కు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదం లో పూర్తిగా కాలిపోయింది. బాపు వృత్తిపరంగా వడ్రంగి పనిచేస్తూ జీవనోపాధి పొందూచు జీవిస్తున్న బాపు పనిముట్లు పూర్తిగా కాలిపోయాయి.వారి కుటుంబానికి ప్రభుత్వం పరంగా ఆర్థిక సహాయం చెయ్యాలి అని బాధితులు కోరుచున్నారు.

## పాస్ పోర్ట్ పోయినది

నా పేరు శ్రీమతి పగిడిమర్రి పద్మావతి భర్త శ్రీ సత్యనారాయణ రావు.పాలవరం గ్రామం,అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా,తెలంగాణ..అను నేను పని నిమిత్తం కోదాడ పట్టణం నుండి పాలవరం గ్రామానికి ఆటోలో తిరిగి వస్తుండగా నా పాస్ పోర్ట్ [పాస్ పోర్ట్ నంబర్ M5035645] పోయింది. ఎవరికైనా దొరికినా,ఆచూకీ తెలిసినా సెల్ నెం.8688051543 కు సంప్రదించగలరు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 జూన్ 2025
తెలంగాణ

# భారత క్రీడలలో పతకాల సాధన



భారతదేశం, 144 కోట్ల జనాభాతో సువిశాలమైన దేశం, క్రీడలలో అంతర్జాతీయ స్థాయిలో తన సామర్థ్యాన్ని పూర్తిగా ప్రదర్శించలేకపోతోంది. ఒలింపిక్స్‌లో భారతదేశం గతంలో సాధించిన పతకాల సంఖ్య చాలా తక్కువగా ఉంది, ముఖ్యంగా చిన్న దేశాలతో పోల్చితే. ఉదాహరణకు, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ 7 పతకాలు (1 స్వర్ణం, 2 రజతం, 4 కాంస్యం) సాధించగా, చిన్న దేశాలైన న్యూజిలాండ్ (20 పతకాలు) మరియు కెన్యా (10 పతకాలు) గణనీయమైన విజయాలు సాధించాయి. ఈ వ్యత్యాసానికి కారణాలను పరిశీలిస్తే, శిక్షణ విధానాలు, సామాజిక మద్దతు, మరియు ప్రభుత్వ విధానాలలో మార్పులు అవసరమని స్పష్టమవుతుంది. ఈ వ్యాసం భారత క్రీడలలో సవాళ్లను, అంతర్జాతీయ శిక్షణ విధానాలను, మరియు మెరుగైన ఫలితాల కోసం సూచనలను వివరిస్తుంది.

**భారతదేశంలో క్రీడల సవాళ్లు:**
భారతదేశంలో క్రీడలలో వెనకబాటుకు పలు కారణాలు ఉన్నాయి. మొదట, క్రీడలకు విద్య కంటే తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం సామాజిక సమస్య. చాలా కుటుంబాలు, పాఠశాలలు క్రీడలను కెరీర్ ఎంపికగా చూడవు, దీనివల్ల యువ క్రీడాకారులకు ప్రోత్సాహం లభించదు. రెండవది, ఆధునిక శిక్షణ సౌకర్యాలు మరియు నాణ్యమైన కోచింగ్ లోపం. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు దాదాపు లేవు, మరియు పట్టణాల్లో కూడా అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపడే సౌకర్యాలు తక్కువ. మూడవది, క్రీడాకారులకు ఆర్థిక మద్దతు మరియు స్పాన్సర్‌షిప్ లభ్యత తక్కువగా ఉండటం. ఇవి కాక, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం, క్రీడా సంస్థలలో అవినీతి, మరియు స్వచ్ఛంద సంస్థల పాత్ర పరిమితం కావడం కూడా సమస్యలు.

**గతంలో పతకాలు సాధించిన భారతీయ క్రీడాకారులు:**
భారతదేశం ఒలింపిక్స్‌లో కొన్ని గుర్తించదగిన విజయాలు సాధించింది. 1952 హెల్సింకీ ఒలింపిక్స్‌లో రెజ్లర్ కెడి జాదవ్ స్వతంత్ర భారతదేశానికి తొలి వ్యక్తిగత కాంస్య పతకం సాధించారు. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో లియాండర్ పేస్ టెన్నిస్‌లో కాంస్యం గెలిచారు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అభినవ్ బింద్రా షూటింగ్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో స్వర్ణం గెలిచి అథ్లెటిక్స్‌లో భారతదేశానికి తొలి ఒలింపిక్ స్వర్ణం అందించారు. సానియా మీర్జా టెన్నిస్‌లో డబుల్స్ విభాగంలో అనేక అంతర్జాతీయ టైటిళ్లు సాధించారు. ఈ విజయాలు భారత క్రీడాకారుల సామర్థ్యాన్ని చాటుతాయి, కానీ స్థిరమైన విజయాలకు సమగ్ర వ్యవస్థ అవసరం.

**అంతర్జాతీయ శిక్షణ విధానాలు:**

**చైనా:** చైనా ఒలింపిక్స్‌లో స్థిరమైన విజయం సాధిస్తోంది (2020 టోక్యోలో 88 పతకాలు). చైనా యొక్క శిక్షణ విధానం బాల్యంలోనే ప్రతిభను గుర్తించి, రాష్ట్ర-స్పాన్సర్డ్ క్రీడా పాఠశాలలలో శిక్షణ ఇస్తుంది. ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలు, శాస్త్రీయ శిక్షణ, మరియు ఆర్థిక మద్దతు అందిస్తుంది. భారతదేశం ఈ విధానాన్ని అనుసరించి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గుర్తింపు కార్యక్రమాలను బలోపేతం చేయాలి.

**ఆస్ట్రేలియా:** ఆస్ట్రేలియా ఒలింపిక్స్‌లో ఈత, సైక్లింగ్‌లో రాణిస్తుంది (2020 లో 46 పతకాలు). ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్ (ఏ.ఐ.ఎస్.) అధు నాతన శిక్షణ కేంద్రాలు, స్పోర్ట్స్ సైన్స్, మరియు మానసిక శిక్షణపై దృష్టి సారి స్తుంది. భారతదేశం ఇలాంటి కేంద్రీకృత శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయాలి.

**కెన్యా:** కెన్యా దీర్ఘ-దూర పరుగు ఈవెంట్‌లలో అగ్రస్థానంలో ఉంది. కెన్యా యొక్క విజయానికి కారణం స్థానిక సంస్కృతిలో క్రీడలకు ఇచ్చే ప్రాధాన్యత, సహజమైన శిక్షణ వాతావరణం (ఎత్తైన ప్రాంతాలు), మరియు స్థానిక కోచ్‌లు. భారతదేశం స్థానిక క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడం, సహజ వనరులను ఉపయోగించడం ద్వారా ఇలాంటి విధానాన్ని అనుసరించవచ్చు.

**నిపుణుల సూచనలు - సలహాలు:**

**కుటుంబం, పాఠశాలలు:** క్రీడలను పాఠ్యాంశంలో భాగంగా చేర్చాలి. పాఠశాలల్లో క్రీడా శిక్షణ కోసం కోచ్‌లను నియమించి, టోర్నమెంట్‌లను నిర్వహించాలి. తల్లిదండ్రులు క్రీడలను కెరీర్‌గా ప్రోత్సహించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

**క్రీడా సంస్థలు:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్.ఏ.ఐ.) వంటి సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. శాస్త్రీయ శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, మరియు డైట్ నిపుణులను నియమించాలి.

**ప్రభుత్వాలు:** కేంద్ర, రాష్ట్ర , స్థానిక ప్రభుత్వాలు క్రీడల బడ్జెట్‌ను పెంచాలి. 'ఖేలో ఇండియా' వంటి కార్యక్రమాలను మరింత విస్తరించి, అంతర్జాతీయ కోచ్‌లను ఆహ్వానించాలి. పతక విజేతలకు ఆర్థిక బహుమతులు, ఉద్యోగ అవకాశాలు అందించాలి, ఉదాహరణకు, మణిపూర్ ప్రభుత్వం సుశీల చానుకు బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు.

**స్వచ్ఛంద సంస్థలు:** ఎన్.జీ.ఓలు. క్రీడాకారులకు స్పాన్సర్‌షిప్, శిక్షణ సౌకర్యాలు, మరియు మానసిక మద్దతు అందించాలి. స్థానిక క్రీడా క్లబ్‌లను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ప్రతిభను ప్రోత్సహించవచ్చు.

**క్రీడాకారులు మరియు కోచ్‌లు:** క్రీడాకారులు కఠిన శిక్షణ, క్రమశిక్షణ, మరియు మానసిక దృఢత్వంతో పనిచేయాలి. కోచ్‌లు ఆధునిక శిక్షణ పద్ధతులను నేర్చుకోవాలి మరియు అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే అవకాశాలను కల్పించాలి.

చివరిగా...భారతదేశం క్రీడలలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే, సమగ్రమైన విధానం అవసరం. చైనా, ఆస్ట్రేలియా, కెన్యా వంటి దేశాల నుండి శిక్షణ విధానాలను స్వీకరించడం, పాఠశాలల నుండి ప్రభుత్వాల వరకు అన్ని స్థాయిలలో సమన్వయం, మరియు స్వచ్ఛంద సంస్థల సహకారం ద్వారా భారతదేశం తన సామర్థ్యాన్ని నిరూపించగలదు. నీరజ్ చోప్రా, సానియా మీర్జా వంటి క్రీడాకారులు స్ఫూర్తిగా నిలిచి, యువతను ప్రేరేపిస్తారు. సమాజం, ప్రభుత్వం, మరియు క్రీడాకారుల సంయుక్త కృషితో భారతదేశం ఒలింపిక్స్‌లో గణనీయమైన పతకాలను సాధించగలదు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమేనా?



ఆధునిక జీవన శైలితో ప్రస్తుతం ప్రజలు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారు. యోగ, ధ్యానం సాధన చేయడం ద్వారా వీటిని దూరం చేయవచ్చని ప్రచారం జరుగుతుంది. నేటి బిజీ జీవితాలలో మనిషి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఒత్తిడి. దీంతో ప్రజలు రకరకాల జబ్బుల బారిన పడుతున్నారు. వీటి నుంచి విముక్తి పొందడానికి శాస్త్రీయ వైద్య విధానాలున్నాయి. మరోవైపు యోగాను ప్రత్యామ్నాయ సాంప్రదాయ వైద్యంగా ప్రచారం చేస్తున్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ యోగాను ఆయుష్ విభాగంలో చేర్చారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక వికాసం పొందవచ్చునని యోగ సాధకులంటున్నారు. దీంతో యోగాకు ఇటీవల విస్తృత ప్రాధాన్యం పెరిగింది. భారత్ చొరవతో అంతర్జాతీయ యోగ దినోత్సవంను కూడా నిర్వహిస్తోంది. ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుటకై 2014లో ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. ఇప్పటికి పది సంవత్సరాల యోగ డే ప్రయాణం పూర్తయిన సందర్భంగా "ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా" అనే నినాదంతో ఈ యేడు నిర్వహించుకొంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమం భారతదేశంలో ప్రభుత్వ సంస్థల్లో అధికారికంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది యోగా డే రోజు ప్రధానమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాల్గొననున్నారు. ఈ క్రమంలో మానవ జీవనశైలిలో యోగ ఏ మేరకు ప్రభావం చూపుతుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని కొందరు, యోగ కూడా వ్యాయామం లాంటిదనీ మరికొందరు, యోగాతో ముక్తిని పొందవచ్చని ఇంకొందరు ఎవరికి తోచినట్లు వారు ప్రచారం చేస్తున్నారు. నిజానికి యోగాను ప్రతిపాదించిన పతంజలి దాన్ని మోక్షానికి మార్గం గానే చెప్పాడు తప్ప, ఆరోగ్యాన్ని దానితో ముడి పెట్టలేదు. ఆలోచనలను స్తంభింప చేయడమే యోగ అని పతంజలి భవన. దీనిలో సమాధి, సాధన, విభూతి, కైవల్యం అనే నాలుగు ప్రక్రియలు ఉంటాయి. యోగాకు ఇటీవల ప్రజాదరణ లభించడంతో ఇది వ్యాపార వస్తువుగా, సామాన్యులకందని విద్యగా మారిపోయింది. జనాలను ఆకర్షిం చడం కోసం ఆరోగ్యాన్ని, వ్యాయామాన్ని, భక్తిని కలగలిపి పలు పేర్లతో యోగాను ప్రజల ముందుకు తెచ్చి, కొందరు గురువులుగా చలా మణి అవుతున్నారు. పట్టణాల లో యోగ, ధ్యాన కేంద్రాలు విపరీతంగా వెలిసాయి. మరోవైపు జిమ్, ఏరోబిక్ వంటి ఫిట్నెస్ కేంద్రాలకు కూడా డిమాండ్ పెరుగుతుంది. ఈ నేపథ్యంలో యోగాను ఒక ఆరోగ్య సైన్స్ గా ప్రచారం చేస్తున్నారు. మరి ధనికులు, విద్యావంతులే చేసే ఈ యోగా, ధ్యానంలో శ్రమజీవుల పాత్ర ఎంత? వారి ఆరోగ్యం కోసం దేన్ని అనుసరించాలనేది ప్రశ్న.

**అవాస్తవాలు ప్రచారం చేయవద్దు**

ఇటీవల యోగాకు రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక రంగులను రుద్దుతూ విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. రోజు రోజుకు యోగా సాధనం చేసే వారి కన్నా ప్రచారకులే ఎక్కువయ్యారు. జిమ్ లో చేసే వ్యాయామం, రన్నింగ్, వాకింగ్, ఆటల కన్నా యోగాను అద్భుత వ్యాయామంగా పోలుస్తున్నారు. యోగాలో ఒక ప్రక్రియగా గుర్తింపు పొందిన ప్రాణాయామంలో ఊపిరిని చాలా సేపు బిగియ పట్టడం వల్ల కార్బన్ డైయాక్సైడ్ ఎక్కువసేపు శరీరంలో ఉండిపోయి, సరిపడా ఆక్సిజన్ మెదడుకు అందక కొంచెం మత్తుగాను, నిస్సత్తుగాను అనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం మనం పీల్చే గాలిలోని ఆక్సిజన్‌లో 20 శాతంపైగా మెదడు ఉపయోగించుకుంటుంది. ఊపిరి బిగ పట్టడం వల్ల మెదడుకు కావలసినంత ఆక్సిజన్ అందక మరో లోకంలో తేలిపోతున్న భావన కలుగుతుంది. దానివల్ల చిత్తభ్రాంతులు కలుగుతాయి. దాన్నే ఆత్మజ్ఞాన సాధన, మోక్షానికి చేరుకోవడంగా భావిస్తారు. మరి ఇప్పుడు యోగా ఆధ్యాత్మిక మార్గంగా భావించాలా? ఆరోగ్య మార్గమా అనేది ప్రశ్నార్థకంగా మారింది. శ్వాస మీద ధ్యాసతో తరచు ప్రాణాయామం చేయడం వల్ల మెదడుకు హాని జరిగే ప్రమాదం కూడా ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇక్కడ యోగాను తప్పు పట్టడం లేదు, కానీ ప్రజల్లో దీనికి సంబంధం లేని అనేక ఆరోగ్య లాభాలను ప్రచారం చేస్తూ తప్పు దోవ పట్టిస్తున్నారు. ఇప్పటి వరకు ఏ పరిశోధన కూడా యోగాతో మానవునికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చెప్పలేదు. ఈ క్రమంలో ఆధునిక వైద్య శాస్త్రానికి అంతుచిక్కని వ్యాధులు సైతం యోగా ద్వారా తగ్గుతాయని యోగ గురువులు ప్రచారం చేయడం సరికాదు. మన సాంప్రదాయ వైద్య విధానాలైన ఆయుర్వేదం, యోగ మరియు న్యాచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి వంటి వాటిపై ఇంకా అధ్యయనాలు జరగాలి. యోగా, ధ్యానం మన ఒత్తిడి, ఆందోళనకు కొంత ఉపశమన సాధనంగానే చూడాలి తప్ప, చికిత్స సాధనంగా చూడవద్దు. మానవ జీవనశైలిలో నడకే ఆరోగ్యాన్ని మంచిదని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ప్రతిరోజు ఉదయం చేసే చిన్నపాటి వ్యాయామాలే మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ప్రజలు గుర్తించాలి. వీటిని జీవనశైలిలో భాగం చేసుకోవాలి. ఇదే నిజమైన ఆరోగ్య సైన్స్.

సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7989579428

## సంకల్పంతోనే సారథ్యం



మనుషులు
అంతర్గతంగా
జ్వలించే
సంకల్పంతోనే
సారధిగా
ఎదుగుతారు
పేరుకోసం
ప్రఖ్యాతి కోసం
అధికారం కోసం
హోదాకోసం
వేతనం కోసం
వ్యతిగత ఆస్తులు
పెంచుకోవడం కోసం
పనిచేసే వారు సంస్థను
బృందాన్ని నడిపించే
వారు కాలేరు సారథులు
బాహ్య విషయాలతో
ప్రభావితమయ్యే వారు
ఇతరుల ప్రభావంతో
పనిచేసే వారు
ఇతరులపై
ఆధారపడే వారు
ఎప్పటికీ సంస్థకు
బృందానికి కాలేరు
సారథులు
మనిషిలో అంతర్గతంగా
జ్వలించే బలమైన
సంకల్పంతో
పనిచేసే వారే
సంస్థను బృందాన్ని
ఉన్నత స్థాయికి
తీసుకువెళ్ళుతారు
సంస్థ పై బృందం పై
సానుకూల ప్రభావం
చూపుతారు
లక్ష్య సాధనలో
మిగతావారు
అలసిపోయి
విశ్వాసం కోల్పోయి
పని నుంచి
విరమించుకున్న
ఎవరైతే తమ
వనరులను
శక్తి సామర్థ్యాలను
సద్వినియోగం
చేసుకుంటూ
ముందుకు వెళ్తారో
వారినే సంస్థ
బృంద సభ్యులు
అనుసరిస్తారు
జనహితమే
పరమావధిగా
పనిచేసే వారే
త్యాగధనులు
సంస్థకు బృందానికి
నిజమైన నాయకులు
సంస్థ బృంద సభ్యుల
సంక్షేమం పురోగతికి
దోహదంచేయడమే
తమ కర్తవ్యంగా
భావిస్తారు

సృజన విశ్లేషణ
సామర్థ్యం
సమస్య పరిష్కారశక్తి
నైపుణ్యాలు ఉన్న
వ్యక్తులే చరిత్రలో
మహనీయులుగా
నిలిచి
స్ఫూర్తి దాతలుగా
మిగిలి జాతి ప్రగతికి
వెలుగు దివ్వెలౌతారు


నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరం సామాజిక
ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్
9440245771

## వెనక్కి లాగితేనేం..!!

సంకల్పం మంచిదైనప్పుడు
ఎవరు వెనక్కి లాగితేనేమి
సంకెళ్ళను తెంచుకుని నడువు
విజయం నిన్ను చేరదీస్తుంది

ముళ్ళ బాటను కూడా
పూల దారిలా మలుచుకో
కష్టాల కడలి నిరంతరం ఈదు
సుఖాల తీరం చేరుకుంటావు
నీ ధృడ నిశ్చయానికి
నీ పట్టుదలను తోడు చెయ్
ముందుకు సాగిపోతావు

కదిలే కాళ్ళను
బెదిరించే నోర్లు ఎక్కువే
అదిలించే నిర్భయత్వాన్ని





వెనువెంటే పెట్టుకో
ఎన్ని అడ్డంకులు ఎదురొచ్చినా
సమిధవై ప్రకాశిస్తూ కదులు
విజయం నీకు నీడనిస్తుంది

సహనం నీ ఆయుధం కావాలి
పట్టుదల నీ పిడికిల్లో ఇమడాలి
మంచితనం
నీ మనసులో వెలగాలి
పదిమంది మంచి కోసం
పది సార్లు ప్రయత్నించు
జనం నీ పక్కన వుంటాది

ఎవరు వెనక్కి లాగితేనేం
నీ సంకల్పాన్ని సడలనివ్వకు
మడమ తిప్పని మనిషిగా
ముందుకు సాగిపో
జయం పలకరిస్తుంది
నీ జన్మ తరించిపోతుంది

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

# యుద్ధాల గాయాలు



ప్రపంచవ్యాప్తంగా ఇరాన్-ఇజ్రాయెల్, రష్యా-ఉక్రెయిన్, భారత్-పాకిస్తాన్ మధ్య సంఘర్షణలు మానవాళికి తీవ్రమైన గాయాలను మిగిల్చాయి. ఈ యుద్ధాలు ఆర్థిక నష్టాలు, మానవ బాధలు, పర్యావ రణ విధ్వంసం, ఆయుధ క్షీణతలను కలిగించడమే కాక, సమాజంలో బాలలు, వృద్ధులు, స్త్రీలపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపాయి. ఈ వ్యాసం ఈ యుద్ధాల వల్ల కలిగిన నష్టాలను విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా పరిశీలిస్తూ, యువతకు ఈ అనర్థాల గురించి స్పష్టమైన అవగాహన కల్పిస్తుంది.

**ఇరాన్-ఇజ్రాయెల్ సంఘర్షణ:**
ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం రాజకీయ, సైనిక ఉద్రిక్తతలకు కేంద్రబిందువైంది. 2025 జూన్‌లో ఇజ్రాయెల్ మొస్సాద్ ఆధ్వర్యంలో జరిగిన "ఆపరేషన్ రైజింగ్ లయన్" దాడులు ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేశాయి, దీనివల్ల ఇరాన్ రక్షణ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లింది. ఈ దాడుల్లో డ్రోన్లు, మిస్సైళ్లు వినియోగించబడ్డాయి, ఇవి ఇరాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. గణాంకాల ప్రకారం, 72 గంటల్లో ఇరాన్‌లో 400 మంది, ఇజ్రాయెల్‌లో 19 మంది మరణించగా, 1300 మంది ఇరాన్‌లో, 450 మంది ఇజ్రాయెల్‌లో గాయ పడ్డారు. ఈ దాడులు ఇరాన్‌లో ఆహార, నీటి కొరతను తీవ్రతరం చేశాయి, ముఖ్యంగా అరక్, తబ్రిజ్ వంటి నగరాల్లో నివాస, వైద్య సౌకర్యాలు కుప్పకూలాయి.
పర్యావరణ నష్టం కూడా తీవ్రంగా ఉంది. అణు కేంద్రాల ధ్వంసం వల్ల రేడియోధార్మిక కాలుష్యం వ్యాపించే ప్రమాదం ఉంది, ఇది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. బాలలు, వృద్ధులపై ఈ దాడుల ప్రభావం ఘోరంగా ఉంది, ఎందుకంటే ఆసుపత్రులు, ఆశ్రయ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇజ్రాయెల్ డ్రోన్ల నుంచి చిన్నపిల్లల ఏడుపు శబ్దాలను వినిపించి పాలస్తీనీయులను ఆకర్షించి దాడులు చేసిన ఆరోపణలు ఈ యుద్ధంలోని నీతివిరుద్ధతను తెలియజేస్తాయి.

**రష్యా-ఉక్రెయిన్ యుద్ధం:**
2022 నుంచి కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మానవాళికి ఒక శాపంగా మారింది. ఈ యుద్ధంలో 500,000 మంది గాయపడ్డారని, 50, 000 మంది మరణించినట్లు అంచనా. ఉక్రెయిన్‌లో ఆర్థిక నష్టం $400 బిలియన్లకు పైగా ఉంది, ఇందులో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక సౌకర్యాలు ధ్వంసమయ్యాయి. రష్యా ట్యాంకులు, బాంబర్ విమానాలు, క్షిపణులు ($-300, ఇస్కాండర్) విస్తృతంగా వినియోగించింది, ఇవి ఉక్రెయిన్ నగరాలను శిథిలాలుగా మార్చాయి.
పర్యావరణ నష్టం కూడా భయానకం. రష్యా దాడుల వల్ల నీటి వనరులు, అడవులు, వ్యవసాయ భూములు కలుషితమయ్యాయి. ఉక్రెయిన్‌లో 15 మిలియన్ల మంది ప్రజలు ఆహారం, నీరు, ఆశ్రయం కోసం ఇబ్బందులు పడుతున్నారు. బాలలు, వృద్ధులపై దాడులు, లైంగిక వేధింపులు, బలవంతపు వలసలు మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీశాయి. రష్యా సైనికులు బుచా, మారియుపోల్‌లో చేసిన దాడులు యుద్ధ నేరాలుగా పరిగణించబడ్డాయి.

**భారత్-పాకిస్తాన్ సంఘర్షణ:**
భారత్-పాకిస్తాన్ మధ్య సంఘర్షణలు, ముఖ్యంగా కాశ్మీర్‌లో, దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. 1947 నుంచి నాలుగు ప్రధాన యుద్ధాలు, అనేక చిన్న సంఘర్షణలతో ఈ రెండు దేశాలు 70,000 మంది ప్రాణాలను కోల్పోయాయి. 2019 బాలాకోట్ దాడిలో భారత్ ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసిన ఎస్.పీ.ఐ.సీ.ఈ.-2000 బాంబులను ఉపయోగించింది. ఈ దాడులు రెండు దేశాల సైనిక సామర్థ్యాన్ని బలహీనపరిచాయి, ఆర్థికంగా రూ.4771 కోట్ల నష్టం వాటిల్లింది.
పర్యావరణంపై ప్రభావం కూడా గణనీయం. కాశ్మీర్‌లో యుద్ధాల వల్ల అడవులు, నీటి వనరులు దెబ్బతిన్నాయి. స్థానిక ప్రజలు ఆహారం, ఆశ్రయం, విద్యా సౌకర్యాలు కోల్పోయారు. బాలలు, వృద్ధులు మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. సైనికులు చేసిన హింసాత్మక చర్యలు, మానవ హక్కుల ఉల్లంఘనలు ఈ సంఘర్షణలను మరింత జటిలం చేశాయి.
చివరిగా... ఈ యుద్ధాలు కేవలం రాజకీయ లేదా సైనిక పరమైనవి కాదుబీ ఇవి మానవత్వానికి వ్యతిరేకమైన చర్యలు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో అణు స్థావరాలపై దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని విమర్శలు వచ్చాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో అమాయక పౌరులు, ఆసుపత్రులపై దాడులు యుద్ధ నీతిని ప్రశ్నార్థకం చేశాయి. భారత్-పాకిస్తాన్ సంఘర్షణలో రెండు దేశాలు సైనిక వ్యయంపై దృష్టి పెడుతూ, పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్యం వంటి అంశాలను విస్మరిస్తున్నాయి. యువతకు ఈ యుద్ధాలు ఒక హెచ్చరిక. ఆర్థికంగా, సామాజికంగా, పర్యావరణపరంగా ఈ సంఘర్షణలు దీర్ఘకాలిక నష్టాలను మిగిల్చాయి. యుద్ధాలు శాంతిని కాదు, విధ్వంసాన్ని మాత్రమే తెస్తాయని యువత గ్రహించాలి. శాంతి సంపాదన, సహకారం, సమస్యలను సామరస్యంగా పరిష్కారించు కోవటమే ఉత్తమ మార్గం. ఇరుగు పొరుగు దేశాలు ఇచ్చి పుచ్చుకోవడం ద్వారా సహకారం, సమన్వయం, ప్రేమ, పరస్పర గౌరవం, పెరుగుతాయి. శాంతియుత సహజీవనంతో ఈ యుద్ధ నష్టాలను నివారించగలవు.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

# చెమట చైతన్యం మామిండ్ల ఎల్లయ్య

గ్రామాలలో నిజాం ప్రతినిధులుగా దొరలు అమాయక ప్రజలను అణచివేత దోపిడీ లకు గురి చేస్తుంటే సహనం నశించిన చోటు నుంచే సాహసం మొదలవుతుందన్నట్లు ప్రజలు తిరగబడ్డారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం ప్రజా శ్రేణులు సంఘటితమై పోరాడాయి. కళ్లెదుటే కనిపిస్తున్న అన్యాయాన్ని,అక్రమాన్ని ప్రతిఘటించారు. 1944లో భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభ ప్రభావం తెలంగాణ అంతట విస్ఫులింగాలను ప్రజ్వరిల్ల చేసింది. అందులో ఎగిసిపడిన అగ్గి రవ్వ ఐలవ్వ. పాలకుర్తికి కూతవేటు దూరంలో నిజాం సైన్యానికి ఉపసేనానిగా పేరొందిన విసునూరు రామచంద్రారెడ్డి ప్రజా కంటకుడిగా మారి జనగామ ప్రాంతంలో అరాచకం సృష్టిస్తుంటే అతని ఆగడాలను అడ్డుకోవటానికి పీడిత ప్రజానీకం సంఘం గా ఏర్పడింది. అందులోని నిప్పు కణికె మామిండ్ల రామయ్య. అతని కుమారుడే మన మామిండ్ల ఎల్లయ్య.

తెలంగాణలో దొరలకు ఎదురొడ్డి పోరాడిన ప్రజలేమి విద్యావంతులు కారు. సంపన్నులు అంతకన్నా కారు. జరుగుతున్న మోసాన్ని పిడికిలి బిగించి పోరాడిన ఎర్ర చెలకల మట్టి బిడ్డలు. పైగా వివేకవంతులు. అందుకే తెలంగాణ సాయుధ పోరాటం ఇది ఆకలి కేకల ఆర్తనాదాల ఆక్రందనల పోరాటం కాదు. ఆత్మాభిమాన పోరాటం. అందుకే అది ప్రపంచ పోరాట చరిత్రలో ప్రసిద్ధికెక్కింది. ఆ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న మామిండ్ల ఎల్లయ్య. జీవితాంతం ఆ సిద్ధాంతాన్ని అనుసరించాడు. ఆర్థిక అవసరాలు సమకూరగానే అవకాశవాదంతో రంగులు మార్చుకునే రోజుల్లో ఆత్మవిశ్వాసంతో కట్టే కాలేదాకా దానిని నమ్ముకున్న ఆదర్శ వ్యక్తి. అతని జీవితం కారు చీకటిలో కాంతి కిరణం వంటిది. మిత్రుడు మామిండ్ల రమేష్ రాజా రచించిన మా నాన్నే నా హీరో అనే పుస్తకం అమ్మ నవలలో కొడుకైన పావెల్కు తల్లి ఇచ్చిన స్ఫూర్తి, ప్రేరణ ఇక్కడ తండ్రి ద్వారా రమేష్‌కు సంక్రమించినట్లు స్పష్టంగా తెలుస్తుంది. జనగామ ప్రాంతంలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను, అరాచకాలను తుదముట్టించడానికి పీడిత ప్రజానీకం పోరాడిన మార్గమే కమ్యూనిజం అయింది. అదొక తత్వశాస్త్రంగా ఇక్కడి పరిస్థితులకు దానిని అన్వయించారు. చెన్నూరు నియోజకవర్గం నుండి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎస్ .వి .కె. ప్రసాద్ ఆ తరువాత పేద బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించిన జనగామ పూర్వ శాసనసభ్యులు ఏ.సి.రెడ్డి మొదలైన నాయకుల ఆచరణాత్మకమైన జీవనశైలి అట్టడుగు వర్గాల ప్రజలను ప్రభావితం చేసింది. అందుకే ఇక్కడి ప్రజలు పుస్తక జ్ఞానంతో కాదు అనుభవ జ్ఞానంతో నేర్చుకున్నారు. కార్యకర్తల అభిప్రాయాన్ని పట్టించుకోకుండా నేతలు నాయకత్వ అభిప్రాయాన్ని వాళ్లపై రుద్దడం వల్ల కమ్యూనిజం అనేది కాలక్రమేణ కనుమరుగు అవుతున్న దృశ్యం కనబడుతూనే ఉంది. ఎన్నికల సమయంలో బూర్జువా పార్టీలతో అవకాశవాద పొత్తు కూడదన్న ఎల్లయ్య లాంటి సామాన్య కార్యకర్తల, సానుభూతిపరుల మాటలను పట్టించుకుంటే కమ్యూనిస్టులకు ఇక్కడ మరింత మనుగడ ఉండేది. మామిండ్ల ఎల్లయ్య ధన్యజీవి. పుత్రాదిచ్ఛేత్ పరాజయం అన్నట్లు తన కళ్లెదుటే ఎదిగి వచ్చిన తన కొడుకు కమ్యూనిస్టుగా మారడాన్ని చూసినవాడు. ఆశల సాధన కోసం కాకుండా ఆశయ సాధన కోసం పోరాడుతున్న వాడు. సమాజాన్ని కుటుంబంగా భావించి సంక్షేమ రాజ్యం కోసం పరితపిస్తున్నవాడు కావడం విశేషం. చిన్ననాటి నుండి తండ్రి బతికున్నంత కాలం తన మాటల ద్వారా చేతల ద్వారా రమేష్ ను ఏ విధంగా ప్రభావితం చేశాడో ఈ పుస్తకంలోని ప్రతి పుట అందుకు సాక్ష్యం ఇస్తుంది. ఏ గద్దర్, నారాయణమూర్తుల పాట, సినిమాలంటే తండ్రి ఎల్లయ్య ఇష్టపడ్డాడో రమేష్ కు ఉద్యమ కారణంగా వాళ్లతో సాన్నిహిత్యం, సహచర్యం ఏర్పడింది. అదొక గుణాత్మకమైన అనుభవం. ఆస్తిపాస్తులకు కాకుండా తండ్రి మామిండ్ల ఎల్లయ్య ఆశయ సాధనకు వారసుడై నడుం బిగించి అతని చెమట చైతన్యాన్ని, జీవిత చరిత్రను అల్పాక్షరాలలో అనల్పార్థ రచనగా అక్షరబద్ధం చేసిన మామిండ్ల రమేష్ రాజాకు నా హార్దిక అభినందనలు. ఈ పుస్తకం పాఠకులకు కొత్త స్ఫూర్తిని, చైతన్యాన్ని అందిస్తుందని ఆశిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

# స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి సమాయత్తం

- ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్న అధికారులు
- గ్రామాల్లో పోటీకి సిద్ధమవుతున్న ఆశావాహులు
- పుంజుకుంటున్న సంక్షేమ పథకాల అమలు తీరు
- రైతు భరోసా నిధుల జమతో రైతుల కళ్ళలో ఆనందం




**బొంరాస్‌పేట, జూన్ 22 (జనం సాక్షి) :** మండల పరిధిలోని గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం మొదలుకానుందా అంటే అవును అనే సమాధానం వినిపిస్తుంది. ఇప్పటికే రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారులు జడ్పిటిసి ఎంపీపీ స్థానాల లెక్కలు తేల్చారు.

### ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్న అధికారులు

ప్రభుత్వం నుండి ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికారులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.మండల పరిధిలో 35 గ్రామపంచాయతీలు, ఒక ఎంపిపీ, ఒక జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి.

### గ్రామాల్లో పోటీకి సిద్ధమవుతున్న ఆశావాహులు

స్థానిక సంస్థల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో ఆశావాహులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో మండల పరిధిలో మొత్తం స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది.

### పుంజుకుంటున్న సంక్షేమ పథకాల అమలు

మండల వ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలు తీరు రోజురోజుకు పుంజుకుంటుంది. ఇప్పటికే ప్రభుత్వము ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి గ్రామాల వారిగా మంజూరు పత్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు అందజేస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మరోవైపు గ్రామాల్లో సిసి రోడ్డు,అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులతో పాటు గ్రామాలు,తండాలకు బీటీ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

### రైతు భరోసా నిధుల జమతో రైతుల కళ్ళలో ఆనందం

మండల వ్యాప్తంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం పంట పెట్టుబడి సాయంగా అందజేసే రైతు భరోసా నిధులు ఇప్పటికే 90% రైతుల వ్యక్తిగత ఖాతాలో జమ చేయడం జరిగింది. పెట్టుబడి కింద అందజేసిన డబ్బులను తీసుకునేందుకు బ్యాంకులకు రైతులు పరుగులు పెట్టారు.

## ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా జర్నలిస్టులు



**బోడుప్పల్, జూన్ 22 (జనంసాక్షి) :** ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారదులుగా జర్నలిస్టులు నిలుస్తారని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం తోటకూర వజ్రేష్ యాదవ్,బోడుప్పల్ నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ లను మర్యాదపూర్వకంగా కలవగా మాజీ అధ్యక్షుడు కల్వారి ఎల్లయ్య,మాజీ కోశాధికారి ననుబోతు రాము యాదవ్,నూతన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్డేమాన్ సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్‌లను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు.ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో విలేకరుల పాత్ర కీలకమన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రిపోర్టర్ల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎస్. సాగర్ రెడ్డి, చింత రమేష్,గుండ్ల కుమారస్వామి,నాగిరెడ్డి,శేరి కరుణాకర్ రెడ్డి,మరాటి మత్స్యగిరి, చిన్నం మధు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం



**న్యాల్‌కల్, జూన్ 22 (జనం సాక్షి) :** మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసి, నిజమైన సమాజాన్ని నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ సమిష్టి కృషితో కృషి చేయాలని, డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దాలని హద్దునూర్ ఎస్సై చెల్లా రాజశేఖర్ అన్నారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారి పరితోష్ పంకజ్ ఆదేశం మేరకు ఆదివారం న్యాల్ కల్ బైపాస్ రోడ్డు, భారతీయ స్టేట్ బ్యాంక్ ఆవరణలో యువకులు, వాహన చోదకులు, ప్రయాణికులు, వ్యాపారులు, తదితరులకు అవగాహన కల్పించారు. జూన్ 26న "అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం – అక్రమ రవాణా వ్యతిరేక దినం" సందర్భంగా మాదకద్రవ్యాల వాడకం, సేవించడం, వాటి వల్ల కలిగే నష్టం, అనారోగ్యం పై అవగాహన కల్పించారు. మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చిన వెంటనే స్థానిక పోలీసులకు లేదంటే 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు. అనంతరం పోలీసులు, స్థానికులు కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్థానిక సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, పోలీస్ సిబ్బంది సేవాలాల్, శ్రీకాంత్, భరత్, స్థానిక యువకులు దత్తు, సంతోష్, బసవరాజ్, పాండు, జగన్నాథ్, సత్యప్ప, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో శిశువును వదిలేసిన గుర్తుతెలియని వ్యక్తులు




**నర్సాపూర్, జూన్ 22 (జనం సాక్షి) :** అభం శుభం ఎరుగని పసికందు మగ శిశువును కన్ను పేగు బంధాన్ని మరిచి మానవత్వాన్ని వదిలి వేసి గుర్తు తెలియని వ్యక్తులు ఒక నాలుగు నెలల మగ శిశువు అడవి ప్రాంతంలో చెట్ల పొదల్లో వదిలి వేసిన హృదయ విదారక సంఘటన నర్సాపూర్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.నర్సాపూర్ హైదరాబాద్ జాతీయ రహదారిలో గల నర్సాపూర్ కొండాపూర్ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు నెలల పసికందు మగ శిశువును మానవత్వం మరిచి వదిలి వెళ్ళిపోయారు. ఈ క్రమంలో మెదక్ నుండి హైదరాబాద్ నగరానికి ఇదే జాతీయ రహదారిపై వెళుతున్న వాహనదారులు నర్సాపూర్ అటవీ ప్రాంతంలోకి రాగానే మూత్ర విసర్జన కోసం వాహనాన్ని ఆపి బయటకు రోడ్డు పక్కన వెళ్లగా అడవిలోని చెట్ల పొదల నుంచి పసిపాప ఏడుపులు వినిపించాయి ఈ ఏడుపు చప్పుడు విన్న వాహనదారులు వెళ్లి చూడగా చెట్ల పొదల్లో నాలుగు నెలల పసికందు మగ శిశువు కనిపించాడు వెంటనే వారు 100 నంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించారు సమాచారం తెలుసుకున్న ఎస్సై బి లింగం వెంటనే సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించి మగ శిశువును నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పసికంధను వైద్యులు పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నట్లు ధృవీకరించారు వెంటనే ఎస్సై బి లింగం ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందించి మగ శిశువుని మెదక్ లోని బాలుర సంరక్షణ కేంద్రానికి తరలించారు ఈ సంఘటనపై ఎస్ఐబి లింగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం



**బోడుప్పల్, జూన్ 22 (జనంసాక్షి) :** జర్నలిస్టులు సమాజంలో నిజానిజాలు తెలుసుకోవడానికి ఎంతో కృషి చేస్తారని, సమాజంలో వారి పాత్ర ఎంతో కీలకమని మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి కొనియాడారు.ఆదివారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా మాజీ అధ్యక్షుడు కల్వారి ఎల్లయ్య,మాజీ కోశాధికారి ననుబోతు రాము యాదవ్,నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి వడ్డేమాన్ సుందర్,కోశాధికారి మరాటి మల్లేష్ లను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు.విధి నిర్వహణలో పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చింత రమేష్,గుండ్ల కుమారస్వామి,నాగిరెడ్డి,శేరి కరుణాకర్ రెడ్డి,మరాటి మత్స్యగిరి,చిన్నం మధు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో పంచాయతీ విద్యుత్ కార్మికుడు మృతి



**తూప్రాన్, జూన్ 22 (జనం సాక్షి) :** విద్యుత్ షాక్‌కు గురై, కల్లకల్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న విద్యుత్ కార్మికుడు మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ మండలం కాల్లకల్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. బాధితులు పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన మర్రి రాములు(50) కాలకల్ గ్రామపంచాయతీలో విద్యుత్ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఆదివారం 12 గంటల సమయంలో రాములు మరియు మరో ఆపరేటర్ నరసింహులు తో కలిసి సాయం దుర్గేష్ కు చెందిన బోరు పనిచేయకపోవడంతో విద్యుత్ వైర్లు ఫిట్ చేయాలని రాములు కు చెప్పడంతో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ వైర్లు విద్యుత్ స్తంభానికి అతికిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ కు గురై స్థంభంపై నుండి పడి అక్కడికక్కడే చనిపోయాడు. వెంటనే తూప్రాన్ అస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, మృతుని బంధువులు,గ్రామస్తులు అగ్రహావేశానికి గురై పోస్టుమార్టం గదిలో ఉన్న శవాన్ని తీసుకొని ఆటోలో తీసుకెళ్తున్న క్రమంలో ఎస్సైలు సుభాష్ గౌడ్, శివానందములు వారిని నచ్చజెప్పి పోస్టుమార్టం గదికి తీసుకొచ్చారు. ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం ఉండడంతో తూప్రాన్ సిఐ రంగాకృష్ణ సిబ్బందితో బాదిత కుటుంబాలను సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.

## సఖి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌లో సందడి చేసిన డాక్టర్ ప్రీతి రెడ్డి



**ఖైరతాబాద్, జూన్ 22 (జనం సాక్షి) :** నగరంలోని శ్రీ కన్వెన్షన్ లో ఈరోజు సఖి లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది సఖి లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ను డాక్టర్ ప్రీతి రెడ్డి వైస్ ఛాన్సర్ విశ్వ విద్యాపీఠ్ డీమ్డ్ టు యూనివర్సిటీ ముఖ్య అతిథిగా విచ్చేశా రు. ఆర్గనైజర్స్ సి.వాణి, ఇందు 100 పైగా స్టాల్ తో మొదటి సారిగా కొంపల్లిలో ఇలా ఎగ్జిబిషన్ లు పెట్టడం ఎంతో మందికి సెల్ఫ్ ఎంప్లాయ్ మెంట్ మరియు బిజినెస్ అవగాహన కల్పిస్తున్నారు. ప్రీతిరెడ్డి మాట్లాడుతూ ఎగ్జిబిషన్ లో జ్యువెలరీ, ఆర్ట్ ఎగ్జిబిషన్ వస్తువులు, కలంకారీ, పట్టు చీరెలు సంప్రదాయ విలువలు కలిగిన చేనేత, మగ్గం పని తనం కనబరిచిన ఎందరో స్టాల్ ఓనర్లు కి అభినం దనలు తెలియచేశారు. ఏ పనిలో ఉన్నా మహిళ లు డాక్టర్స్ ఇంజనీర్స్, పైలెట్లు, బిజినెస్ ఎంట్రుపె న్యూర్, పొలిటికల్ లీడర్స్ ప్రతి మహిళా మరొక మహిళకు ప్రేరణ కలిగిస్తుందని కొనియాడారు. ప్రతి స్టాల్ యజమానికి ప్రత్యేకమైన విషెస్ అందించారు.

## కడవేరుగు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలి




**చేర్యాల, జూన్ 22 (జనంసాక్షి) :** కడవేరుగు గ్రామంలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం చేర్యాల మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. చేర్యాల మండలంలోని కడవేరుకు గ్రామంలో వంతెన నిర్మాణం చేపట్టాలని గత కొన్ని సంవత్సరాలుగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చేసిన పోరాట ఫలితంగా 2 కోట్ల 80లక్షల రూపాయలు మంజూరు కావడంతో వంతెన నిర్మాణం పనులు 80 శాతం పనులు జరిగిన నేటి వరకు పూర్తికాకపోవడం కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో బురదమయంగా మారి నిత్యం ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, మండల కోశాధికారి నంగి కనకయ్య, మండల నాయకుడు పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి,మనేపల్లి కిష్టయ్య, ఎగుర్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం సరికాదు



**చేర్యాల, జూన్ 22 (జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల పనితీరును పర్యవేక్షించడానికి ఎస్జిటి, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించి బాధ్యతలను అప్పగించడం సరికాదని, ఇది విద్యారంగ తిరోగమన చర్యకు దారి తీస్తుందని అన్నారు. విద్యారంగం సంక్షోభానికి గురవుతుందని వెంటనే ఈ ఉత్తర్వులను విరమించుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు డి.కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ .తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు.

## గౌతమ్ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, జూన్ 22 (జనం సాక్షి) :** విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మీర్పేట్ హెచ్. బి కాలనీ డివిజన్ పరిధిలోని నర్సింహా నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ్ పబ్లిక్ స్కూల్ (సీబీస్) ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన సూచించారు. కష్టపడి చదివి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు మంచి బోధన చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి , ఫౌండర్ ఝాన్సీ రాణి గారు, మురళీధర్ పటేల్ గారు, డైరెక్టర్ విక్రమ్ గారు, హరికా గారు , రంగు ప్రసాద్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీ బలం

- పరిగి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి
- వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలి
- టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**సదాశివపేట, జూన్ 22 (జనం సాక్షి) :** కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని పరిగి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బసవ సేవా సదన్ ఫంక్షన్ హాల్లో సదాశివపేట పట్టణ, మండల మరియు కొండాపూర్ మండలం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిగి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి, టిజీ ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ, సంగారెడ్డి అబ్జర్వర్ దయాకర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరికి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారాధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పట్టణ,గ్రామ స్థాయిలో తీసుకెళ్లి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలి సూచించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రైతులను,ప్రజలను మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలంలోనే ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల కరెంటు ఫ్రీ, 500 కే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, సబ్సిడీపై రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. అనంతరం టీజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారాధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిధులు ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని దిశా నిర్దేశం చేశారు. పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ధరణి ద్వారా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరిస్తుంది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీల అమలుతోపాటు మరెన్నో సంక్షేమ పథకాలు అందిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు గాలి అనిల్ కుమార్, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శిలు తోపాజి అనంత కిషన్,చిన్న, చర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాకుల కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అన్నదాతల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**• ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**



**వనపర్తి బ్యూరో, జూన్ 22 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అన్నదాతల శ్రేయస్సునే పరమావదిగ నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డిలు అన్నారు. ఆదివారం భీమ ఫేస్ 2 స్టేజ్ 1 వద్ద వారు మోటార్లను ప్రారంభించి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు తెలంగాణ రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకొందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ బియ్యం, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు,రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, లాంటి అనేక పథకాలతో నేడు గ్రామ గ్రామాణ ప్రభుత్వ పండగ వాతావరణం నెలకొందన్నారు. నేడు భీమా పేస్ 2 ద్వారా ఒక నెల ముందుగా నీటిని విడుదల చేస్తున్నామని దీంతో అన్నదాతలు ముందస్తు తూకాలు, నారుమడులు తయారు చేసుకోవచ్చని సూచించారు. రామన్ పాడు ప్రాజెక్టు పూర్తిగా నిండి ఉండడంతో నేడు బీమా పంప్ హౌస్‌లోని మోటార్లను ప్రారంభించామని వారు తెలిపారు. 12 మెగావాట్ల సామర్థ్యం గల ఈ మోటర్లు 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తాయని వారు తెలిపారు. ఈ నీటి ద్వారా దేవరకద్ర నియోజకవర్గంలోని 22వేల ఎకరాలకు వనపర్తి నియోజకవర్గం లోని 18 వేల ఎకరాలకు,కొల్లాపూర్ నియోజకవర్గం లోని 52 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, ఈఈ కేశవరావు, డిఈ కిరణ్ కుమార్, ఏఈలు మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి, దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికలలలో బీఆర్ఎస్ సత్తా చాటాలి



**శ్రీరంగాపూర్, జూన్ 22 (జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండల పరిధిలోని తాడిపాముల మరియు కంబలాపురం గ్రామాలకు బిఆర్ఎస్ శ్రేణులు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం సందర్భంగా సింగిల్ విండ చైర్మన్ జగన్నాథం నాయుడు మాట్లాడుతూఉద్యమనాటి పోరాటస్ఫూర్తి ప్రదర్శిస్తామని కన్నతల్లిలాంటి పార్టీతో అన్ని ప్రయోజనాలు పొంది ద్రోహం చేసిన నాయకులకు గుణపాఠం వచ్చేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయధూందుభి మోగించాలని తాటిపాముల, కంబల్లాపురం కార్యకర్తలకు సూచించారు. మొన్న జరిగిన సమావేశంలో నాయకులకు దిశా నిర్దేశం చేసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో పార్టీ పట్ల నిబద్ధత నాయకుని పట్ల విధేయత ప్రజల పట్ల విశ్వాసంతో పనిచేస్తే విజయం మనదే అని సూచించారని,మరియు మండలంలోని వివిధ గ్రామాల్లో నాయకులు పర్యటించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయాలని సూచించినట్లు జగన్నాథం నాయుడు తెలిపారు. ప్రతి బి.ఆర్.ఎస్ కుటుంబ సభ్యునికి తాను అండదండగా ఉంటానని నా చుట్టూ తిరగకుండా ప్రజల చుట్టూ తిరగాలని అప్పుడే మీకు మన పార్టీకి భవిష్యత్తు ఉంటుందని మాజీమంత్రి మొన్న జరిగిన మండల నాయకుల సమావేశంలో కార్యకర్తలకు సూచించారని సత్యనారాయణ యాదవ్ మాజీ సర్పంచ్ తెలిపారు. మండల నాయకులు ప్రతి గ్రామము తిరిగి రావాలని ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకొని వారికి బాసటగా నిలుస్తామని మండల నాయకులు సూచించారు. ఈ స్థానిక సంస్థలలో ఏమాత్రం అనుమానం లేదని ఈసారి శ్రీరంగాపూర్ మండలంలోని అన్ని గ్రామాల స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని పునరుద్ఘాటించారు. ఈ సమావేశములో శ్రీరంగాపూర్ బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు సింగిల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు,మండల పార్టీ అధ్యక్షులుఆర్ వెంకటస్వామి ,తాటిపాముల మాజీ సర్పంచ్ సత్యనారాయణ యాదవ్, నాగరాల మాజీ సర్పంచ్ రాధాకృష్ణ , బిఆర్ఎస్ నాయకులు ఎద్దుల రాజ వర్ధన్ రెడ్డి, ఎస్ బక్కయ్య, మరియు గ్రామ ప్రజలు, రైతులు యువకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ స్థానాలు

**• బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చంటి రాహుల్ కిరణ్**



**సంగారెడ్డి, జూన్ 22 (జనం సాక్షి) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆందోల్ నియోజకవర్గం లో అత్యధిక స్థానాలు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే గెలుస్తారని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు చంటి రాహుల్ కిరణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించుకున్నారు. ఈ సందర్భంగా చంటి రాహుల్ కిరణ్ తో పాటు బిఆర్ఎస్ పార్టీ మునిపల్లి మండల ప్రధాన కార్యదర్శి మంతూర్ శశి కుమార్‌తో కలిసి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పిటిసి లతో పాటు మున్సిపాలిటీలు కూడా కైవసం చేసుకుంటుందని జోష్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో గెలవలేమనే భయంతో ఎన్నికలు పెట్టడం లేదన్నారు. ఇప్పటికీ ఆందోల్ నియోజకవర్గం లో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వస్తాయని కార్యకర్తలు ఎదురుచూస్తున్నారని తమ పార్టీకి సంబంధించిన వారిని ఎన్నికల్లో గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని వారన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, రజనీకాంత్, శివకుమార్, చేవెళ్ల విట్టల్, శివశంకర్, ఆనంద్, హైద్లపూర్ విటల్, కార్తీక్, పాండు పాల్గొన్నారు.

# దొంగతనాలు నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు

**• ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి**



**మక్తల్, జూన్ 22 (జనంసాక్షి) :** దొంగతనాలు నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పూర్తి స్థాయిలో నిఘా ఉంచి, ఫింగర్ ప్రింట్ డివైస్ తో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ మక్తల్ బస్టాండ్ లో అనుమానిత వ్యక్తులను ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని, బస్టాండ్ లో ప్రయాణికుల మాటున కొంతమంది వ్యక్తులు రద్దీగా ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని అలాంటి వాటికి చెక్ పెట్టడానికి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బస్సుల్లో ప్రయాణించేటప్పుడు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించి తమ విలువైన బంగారు వస్తువులను, బ్యాగులను, పర్సులను జాగ్రత్తగా ఉంచుకోవాలని కోరారు. అలాగే అపరిచిత వ్యక్తులు ఏమైనా తినుబండరాలిస్తే తీసుకోరాదని ప్రయాణికులకు సూచించారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100 కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ తనిఖీల్లో మక్తల్ పోలీసులు మహేష్, శ్రీహరి పాల్గొన్నారు.

# వెంకన్న సన్నిధిలో కలెక్టర్ దంపతుల పూజలు



**బిజినేపల్లి, జూన్ 22 (జనం సాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ దంపతులు ఆదివారం నాడు వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి ని దర్శించుకున్నారు. దేవస్థాన యాజమాన్యం, ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చక బృందం స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి ఆశీర్వచనం ఇచ్చారు.

# సమాచార హక్కు చట్టం ప్రజలకు ఆయుధం

**• వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్గేష్**



**వీపనగండ్ల, జూన్ 22 (జనం సాక్షి) :** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి బొలమోని దర్గేష్, చిన్నంబావి మండల ప్రధాన కార్యదర్శి నక్క సుధాకర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు ఆయుధం లాంటిదని, సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఎప్పటికప్పుడు ప్రశ్నించడానికి సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. చట్టం నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర కార్యవర్గం, రాష్ట్ర నలుమూలల నుండి వివిధ జిల్లాల ప్రధాన కార్యదర్శులు, వివిధ మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# నకలీ విత్తనాలు అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు



**కృష్ణ, జూన్ 22 (జనం సాక్షి) :** నకలీ విత్తనాలు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కృష్ణ ఎస్సై నవీద్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నకలి విత్తనాలు ఎరువులు, రైతులకు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపిస్తామని, విక్రయించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు ఎరువులు పురుగు మందులకు డీలర్ల వద్ద నుండి రసీదును తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆమోదించిన పత్తి విత్తనాలు మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. నకలి విత్తనాలు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు అధికారులకు గానీ, లేదా వ్యవసాయ అధికారులకు గానీ తెలియజేయాలని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**రాజాపూర్, జూన్ 22 (జనంసాక్షి) :** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదివారం రోజు దోండ్లపల్లి గ్రామానికి వెళ్ళి కృష్ణయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొనడం జరిగింది. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు నరహరి, రమేష్, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, శేఖర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, రవి కుమార్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుబంధు పూర్తిస్థాయిలో అమలు చేయాలంటూ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**ఇబ్రహీంపట్నం, జూన్ 22 (జనం సాక్షి) :** రైతుబంధు స్థాయిలో అమలు చేయాలంటూ ఇబ్రహీంపట్నం మండలం పేతుల్ల గ్రామపంచాయతీ ముందు నిరసన తెలుపుతూ రైతులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడు.. రాష్ట్రంలో రైతులకురైతు భరోసా ఇవ్వాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. నియోజకవర్గంలో 4 మండలాలకు రెండు మండలాలకు గుండుతున్న పెట్టిందని ఎద్దుల ఆ రెండు మండలాల్లో కూడా సగం మందికే వేసిందని వెంటనే రైతుబంధు అందరికీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి, మాజీ ఎంపీపీ కృపేష్,మాజీ సర్పంచ్ యాదగిరి,బుగ్గ రాములు, రాజు, రైతులు తుదితరులు పాల్గొన్నారు.

# చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరం



**కూకట్‌పల్లి, జూన్ 22 (జనంసాక్షి) :** సమాజానికి నిస్వార్థంగా సేవలు అందించడంలో రాందేవ్ ఆస్పత్రి ముందుంటుందని రాందేవ్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు పేర్కొన్నారు. ఆదివారం ఆదరణ ఫౌండేషన్ (స్వచ్ఛంద సంస్థ) సహకారంతో రాందేవ్ ఆసుపత్రిలో ఒకటి నుండి 16 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని రాందేవ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ లక్ష్మీ కమలాకర్ లో అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలకు జనరల్ స్క్రీనింగ్, ఐ చెకప్, ఇతర వ్యాధులను గుర్తించడానికి రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యోబు మాట్లాడుతూ చిరుప్రాయంలోనే పిల్లలకు ఎలాంటి రోగాలు రాకుండా ఉండడానికి వైద్య శిబిరంలో పలు పరీక్షలు నిర్వహించి పిల్లలకు రోగాల పట్ల అప్రమత్తత ఉండడానికి డాక్టర్లచే పలు సూచనలు చేయించడం జరిగిందన్నారు. పిల్లల వైద్య శిబిరానికి ఆదరణ ఫౌండేషన్ సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదరణ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ అరగెల రఘునాథ్ బాబు మాట్లాడుతూ రాందేవ్ ఆస్పత్రి వైద్యరంగంలో అందిస్తున్న సేవలు అద్భుతం అని కొనియాడారు. ఈ వైద్య శిబిరంలో రాందేవ్ హాస్పటల్ డాక్టర్ మాణికుమార్, డాక్టర్ దయాకర్, డాక్టర్ మణి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ ప్రిన్సీ, కల్పన మంతెన, లీలా సృజన లు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఆదరణ ఫౌండేషన్ కోశాధికారి భాను వర కుమార్, ప్రధాన కార్యదర్శి పి మేరీ జోన్స్, ఎ. అనిషా, ఎ. సన్నీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్యమిత్రుడి కూతురు వివాహానికి హాజరైన ఎమ్మెల్యే



**వనపర్తి బ్యూరో, జూన్ 22 (జనంసాక్షి) :** పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన తన బాల్యమిత్రుడు పెద్ద పాష కూతురు వివాహానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. కొత్తకోట లోని బీఆర్ గార్డెన్లో ఆదివారం నిర్వహించిన వివాహానికి హాజరైన ఎమ్మెల్యే వధూవరులను ఆశీర్వదించి,తన మిత్రుడితో కాసేపు మాట్లాడి వివాహానికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగి కాసేపు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, పెద్దమందడి మండల మాజీ జడ్పిటిసి వెంకటస్వామి, గ్రామ నాయకులు సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

వనపర్తి పట్టణం 8వ వార్డు శ్రీనివాసపురంకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మల్ల రాములు గారి తల్లి గారైన ఉమ్మల్ల బాలకిష్టమ్మ గారు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తన తల్లి మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన నాయకుడు ఉమ్మల్ల రాములును ఎమ్మెల్యే ఓదార్చారు. ఇదే వార్డుకు చెందిన ఉమ్మల్ల శాంతయ్య సైతం మృతి చెందడంతో గౌరవ శాసనసభ్యులు వారి కుటుంబ సభ్యులను సైతం పరామర్శించారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ విభూది నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా డబ్బులు అందిస్తాం


**• మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**టేక్మాల్, జూన్ 22 (జనం సాక్షి) :** టేక్మాల్ మండలం ఎల్లంపల్లి తాండ రైతు విట్టల్ కు సంబంధించిన పత్తి పంటను పరిశీలిస్తూ రైతుతో కలిసి కలుపు తీసే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్. రైతు భరోసా డబ్బులు అర్హులైన ప్రతి రైతు కుటుంబాలకు జమ చేయబడుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ పొలం బాట పట్టారు, నిత్యం బిజీగా ఉంటూ ఆదివారాలు సెలవు రోజులను చూడకుండా ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రగతిని పరిశీలిస్తూ జిల్లాలో సుపరిపాలన లక్ష్యంగా పనిచేస్తున్నారు. కలెక్టర్ స్వయంగా విట్టల్ బాగున్నావా మీకు ఎంత పొలం ఉన్నది మీరూ పత్తి పంటను ఎప్పుడు వేశారు. విత్తనాలు ఎక్కడ కొన్నారు. ప్రస్తుతం ఎలాగ ఉన్నది పత్తిలో చీడపీడలు నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, దిగుబడి వివరాలు అడిగిన కలెక్టర్. ప్రస్తుత వాతావరణ ప్రతికూల అనుకూల పరిస్థితులు ప్రభావం తెలియజేస్తూ స్వయంగా అరక పట్టి పొలం దున్నిన కలెక్టర్. పత్తి పంట సాగు వివరాలు తెలుసుకోవడంతో వి విట్టల్ రైతు ఆనందానికి అవధులు లేవు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సరిపడ విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచామని నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు రైతు భరోసా డబ్బులు రైతు భరోసా కింద ఆదివారం వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 2,54,504మంది రైతుల ఖాతాల్లో మొత్తం 207,14,20,772 రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సాగు అవసరాలకు ఈ నిధులు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.

# రాష్ట్ర విద్యా సంచాలకుల ఆదేశాలు బేఖాతరు

- అనర్హుడ్ని విధుల్లో కొనసాగిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్న నిర్మల్ డిఈఓ
- ఆర్థిక లావాదేవీలే కారణమంటున్న ఉపాధ్యాయులు
- కోర్టు ఉత్తర్వుల పేరిట కాపాడే ప్రయత్నం
- కలెక్టర్ చొరవతో వెలుగులోకి వచ్చిన వైనం



నిర్మల్ బ్యూరో, జూన్ 22(,జనంసాక్షి 2024 ఉపాధ్యాయ నియామకాలకు వెలువడిన ఉత్తర్వుల నాటికి సరైన విద్యా యోగ్యతలు లేకుండా అడ్డదారుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉద్యోగం పొందాడని వచ్చిన ఆరోపణల మేరకు విచారణ జరిపి, నిర్ధారించి సంబంధిత ఉపాధ్యాయుని తక్షణమే ఉద్యోగ విధుల నుండి తప్పించాలని, శాఖాపరమైన చర్యలు చేపట్టాలని సూచిస్తూ తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాసంచాలకులు (డిఎస్ఈ) నరసింహారెడ్డి జారీ చేసిన ఆదేశాలను నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి (డిఈఓ) బేఖాతరు చేశారు. అంతా నిబంధనల ప్రకారమే జరుగుతున్నదని డిఈఓ చేస్తున్న ప్రకటనలు, తీసుకుంటున్న నిర్ణయాలు నిర్మల్ జిల్లా విద్యాశాఖలో తీవ్ర ప్రకంపనలు రేపుతున్నాయి .విపత్తు నుండి సంబంధిత ఉపాధ్యాయుడు బయటపడడానికి కావలసిన సమయాన్ని కల్పిస్తూ డిఈఓ తీసుకున్న నిర్ణయం ఉపాధ్యాయులను విస్తుపోయేలా చేస్తున్నది .చర్యలు తీసుకోవడానికి కోర్టు ఉత్తర్వులు కారణమంటూ కొత్త భాష్యం చెప్పడం ఆయనకే చెల్లింది. ఉత్త పుణ్యానికి జిల్లా విద్యాశాఖలోని ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు శ్రీముఖాలిస్తూ హడలెత్తించే డిఈఓ అనర్హుడ్ని కాపాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో అతను కోనసాగడానికి కారణం లక్షల్లో చేతులు మారడమే అన్న ఆరోపణలకు బలం చేకూర్చు ఉన్నది. ఉపాధ్యాయ నియామకాల కోసం 2024 లో నిర్వహించిన డిఎస్సిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించే ఉపాధ్యాయుల నియామకాలకు సైతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొట్టమొదటిసారి పచ్చ జెండా ఊపింది .రాత పరీక్ష నందు అర్హత సాధించిన సాధారణ ఉపాధ్యాయులకు ఉండాల్సిన విద్యా యోగ్యతలు ,నియమ నిబంధనల విషయమై స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయి. కానీ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించే ఉపాధ్యాయులకు ఉండాల్సిన అర్హతల విషయమై రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుల డిఎస్ఈ నుండి సరైన ఉత్తర్వులు వెలువడ లేదు .ఆ కారణంగా సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో గందరగోళం నెలకొన్నది. అనంతరం డిఎస్ఈ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీనితో స్పష్టత వచ్చిన వివిధ జిల్లాల్లో విద్యాశాఖ అధికారులు నియామక సందర్భంగా తాము చేసిన పొరపాట్లను సరిదిద్దుకున్నారు. తప్పుడు నిర్ణయాలతో జరిగిన నియామకాలను రద్దు పరిచారు. ఇది ఇలా ఉంటే నలుగురు ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా నియామకం పొందారని పాలకుర్తి మహేందర్ అనే సామాజిక ఉద్యమకారుడు రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు విషయమై లోతైన విచారణ జరిపిన ఉన్నతాధికారులు ఆరోపణలు నిజమేనని ,డీఎస్సీ నోటిఫికేషన్ నాటికి సరైన విద్యా యోగ్యతలు లేకుండానే ఉద్యోగం పొందాలని తేల్చారు. ఉన్నతాధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం నిర్మల్ జిల్లాలో గైనీ సునీల్ కుమార్ ,హన్మకొండ నందు తౌటమ్ ప్రవీణ్ ,కామారెడ్డిలో ఆర్ .అర్జున్, పెద్దపల్లిలో అంకం రవిలు పొందిన నియామకాలు చెల్లవని, వారిని తక్షణమే విధులనుండి తొలగించి శాఖా పరమైన చర్యలు చేపట్టాలని సూచిస్తూ రాష్ట్ర విద్యా సంచాలకులు నరసింహారెడ్డి 2024 మే 30వ తేదీన ఉత్తర్వులు జారీ చేస్తూ, తక్షణమే అమలుపరచాలని సూచించారు. స్పందించిన మూడు జిల్లాల జిల్లా విద్యాశాఖ అధికారులు డిఎస్ఈ ఉత్తర్వులను అమలుపరిచారు. ఉద్యోగం పొందిన వారిని విధులనుండి తొలగించారు .కానీ నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి డిఎస్ఇ ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమంగా ఉద్యోగం పొందిన గైనీ మహేష్ కు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా వేల్పూరు మండలం పడగల్ గ్రామానికి చెందిన గైనీ సునీల్ కుమార్ 2024 సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ నియామకాల సందర్భంగా సరైన విద్యా యోగ్యత లేకుండానే ఉపాధ్యాయునిగా ఉద్యోగం పొంది నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల నందు చేరారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసే సమయానికి డీఎడ్ ,బీఎడ్ అర్హతలు ఉన్నట్లు పేర్కొన్నారు .రాత పరీక్షలో అర్హత పొందిన అనంతరం 2024 అక్టోబర్ 29 ,30 తేదీల్లో జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనలో సునీల్ సమర్పించిన ధ్రువపత్రాలు నిబంధనల మేరకు లేవన్న ఆరోపణలలో గుప్పుమన్నాయి .నియామక సందర్భంగా అధికారుల పరిశీలనలో విద్యార్హత ధ్రువపత్రాలు నోటిఫికేషన్ తర్వాత పొందినవని తేలినప్పటికీ అప్పటి డిఈఓ చూసి చూడనట్లు వ్యవహరించారన్న ఆరోపణలు వినిపించాయి. నిబంధనలకు విరుద్ధంగా నియామకం పొందినారని సునీల్ పై వచ్చిన ఆరోపణలను పరిశీలించిన డిఎస్ఈ నరసింహారెడ్డి అతన్ని విధుల నుండి తొలగించాలని శాఖా పరమైన చర్యలు చేపట్టాలని సూచిస్తూ నిర్మల్ డి ఈ ఓ కు 2025 మే 30వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు అమలు పరచడంలో డి ఈ ఓ తీవ్ర జాప్యము చేశారు. 2024లో నియామకం పొంది సోన్ మండలములోని ఒక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధించే స్కూల్ అసిస్టెంట్ ఒకరు డిఈఓ ను మచ్చిక చేసుకోవడంతో ఆదేశాలు అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి .ఆదేశాలు అమలు కాకుండా డిఈఓ కల్పించిన సమయాన్ని సునీల్ కుమార్ చాకచక్యంగా వ్యవహరించి తనపై ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు కాకుండా రాష్ట్ర హైకోర్టు నుండి ఉత్తర్వులు పొందారు .ఉపాధ్యాయుని తీరు, డీఈఓ వైఖరిపై కలెక్టర్ దృష్టికి రావడంతో దిద్దుబాటు చర్యలు మొదలయ్యాయి. డిఈవో నిర్లక్ష్య వైఖరి కారణంగా నిర్మల్ పంచాయతీ హైదరాబాదుకు చేరింది .ఆదేశాలతో చేపట్టవలసిన చర్యలు న్యాయపరమైన అంశాలు ఎదురయ్యే ఇబ్బందులు న్యాయ కోవిదులతో విద్యాశాఖ అధికారులతో చర్చించుటకు ప్రత్యేక దూతను డిఈఓ హైదరాబాద్ పంపినట్లు తెలిసింది . హైకోర్టు విధించిన స్టే తొలుగుతుందా? సునీల్ కుమార్ పై చర్యలు అమలవుతాయా? అన్న ప్రశ్నలకు రాబోయే కాలం జవాబు చెబుతుంది. డిఈఓ ఉన్నతాధికారుల, ప్రజా ప్రతినిధులైన ఎమ్మెల్యేల ఆదేశాలు సైతం పెడచెవిన పెడతారని ,నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులతో, ఉద్యోగులతో, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో డిఈఓ వ్యవహరించే తీరు అసహజంగా ఉంటుందన్న విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ,నిర్మల్ జిల్లా కలెక్టర్ డిఈఓ పై ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరిపించిన పక్షములో అతను నిర్మల్ విద్యాశాఖ విధులలో చేరిన నాటి నుండి తీసుకున్న నిర్ణయాల, వ్యవహార శైలిపై ఆసక్తికరమైన ఎన్నో విషయాలు బయటపడే అవకాశం ఉంది. ఉపాధ్యాయ నియామకాల సందర్భంగా జరిగిన అవకతవకలు వెలుగు చూసే అవకాశముంది.

## విద్యాసంస్థల కు 100 మీటర్ల వరకు మద్యం పొగాకు బంద్...

- దుకాణదారులు అమ్మితే కఠినమైన చర్యలు



ములుగు, జూన్21 (జనంసాక్షి): ములుగు మండలం లోని విద్యాసంస్థల చుట్టూ 100 మీటర్స్ రేడియస్ లో ఉన్న షాపులలో మద్యం గాని పొగాకు సంబంధిత పదార్థాలు గానీ గుట్కా పాన్ మసాలాలు అమ్మకూడదు అని ములుగు లోని 16 విద్యాసంస్థలు చుట్టూ ఉన్న షాప్స్ ను ములుగు సీఐ, ములుగు ఎస్సై, సిబ్బంది తనిఖీ చేసి హెచ్చరించారు. ఒకవేళ అమ్మినట్లయితే చట్ట ప్రకారం కేసు నమోదు చేసి చర్య తీసుకుంటామని హెచ్చరించారు. షాపులకు, విద్యాసంస్థలకు టిజీఎన్ఏబి వారు విడుదల చేసిన సంబంధిత పోస్టర్స్ అంటించారు.

## మా భూమిని మాకు ఇప్పించండి



పరకాల, జూన్ 22 (జనం సాక్షి): పరకాల పట్టణంలోని మాదారం శివారులో వారసత్వంగా వచ్చిన భూమినీ మాకు ఇప్పించండి అని భాధిత దంపతులు ఆదివారం పత్రిక ముఖంగా ప్రభుత్వ అధికారులకు విన్నవించారు. బాధితులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం గ్రామానికి చెందిన నేరెళ్ల శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మాదారం శివారులో 609 సర్వే నంబర్ లో ఎకరం 19 గుంటలు భూమి తన తాత నరసయ్య, తండ్రి సారయ్య ల ద్వారా వారసత్వంగా వచ్చిన భూమిని వీఆర్ఏ, వీఆర్వో సంఘాలు అక్రమంగా వారి పేరు మీద మార్చుకొని ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం, పహానిలు ఒరిజినల్ డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. 15 ఏళ్లుగా భూమికోసం పోరాటం చేస్తున్నామని, మా భూమిని మాకు ఇప్పించమని అధికారుల చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని మా భూమి మాకు ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రూ.132,52,49,227ల రైతు భరోసా నిధులు




జయశంకర్ భూపాల పల్లి బ్యూరో, (జనంసాక్షి): రైతు భరోసా కింద ఆదివారం వరకు జిల్లాలో రూ.132,52,49,227 నేరుగా రైతుల ఖాతాల్లో జమయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి వీరు నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 1,14,011 మంది రైతుల ఖాతాల్లో మొత్తం 1,32,52,49,227 రూపాయలు నేరుగా జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం రైతు భరోసా నిధులు జమ చేసిందని, ప్రస్తుత ఖరీఫ్ సాగు అవసరాలకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు.

## వృద్ధురాలి మెడలోని మూడు తులాల గొలుసు అపహరణ



చెన్నూర్, జూన్ 22 (జనంసాక్షి) : మండలంలోని సుబ్బారాంపల్లి గ్రామం లోని రాతిపల్లి భూదమ్మ అనే వృద్ధురాలు మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి అపహరించుకుపోయారు. బూదమ్మ పని నిమిత్తం అంగ్రాజు పల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా మార్గం మధ్యలో మోటర్ సైకిల్ పై వచ్చిన ఇద్దరు యువకులు శనివారం ఆమె మెడలో నుంచి గొలుసు లాక్కొని పరారయ్యారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మంత్రికి మాల సంఘం ఆహ్వానం



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భశాఖ మంత్రి వివేక్ వెంకట స్వామిని జిల్లాకు చెందిన మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆదిలాబాద్ జిల్లాకు రమ్మని ఆహ్వానం పలికారు. అనంతరం మంత్రిని సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ కన్వీనర్ సర్వయ్య, రాష్ట్ర నాయకులు రవికుమార్, జిల్లా నాయకులు ముల్కల రాజేశ్వర్ ,పాశం రాఘవేంద్ర, అక్క పెల్లి లక్ష్మణ్, మేదరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



నిర్మల్ బ్యూరో, జూన్ 22 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను రాజ్ భవన్ లో ఆదివారం ఎమ్మెల్యే పవర్ రామరావ్ పటేల్ కలిసి పలు సమస్యలను విన్నవించారు. కాసేపు గవర్నర్ తో భేటీ అయి బాసర ఆలయ విషయమై చర్చించారు. గత ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణానికి 42 కోట్ల నిధులు ఇచ్చి వెనక్కి తీసుకుందని, ప్రస్తుత ప్రభుత్వం నిధులిచ్చి పునర్నిర్మాణ పనులు ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన గవర్నర్ ను కోరారు. దేశంలో ఏకైక సరస్వతి అమ్మవారి క్షేత్రం గత పాలకుల వైఖరి మూలంగా అభివృద్ధికి నోచుకోలేదని, పుష్కరాల వరకు ఆలయ పునర్నిర్మాణం చేపడితే భక్తులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అదేవిధంగా బాసర నుండి మహోర్ కు జాతీయ రహదారి ని అనుసంధానం చేయాలని ఆధ్యాత్మిక మార్గం నిర్మిస్తే ఈ మార్గం గుండా వెళ్లే భక్తులు అమ్మవారిని దర్శించుకొని, రేణుకా మాతను దర్శించుకుంటారన్నారు. ఆధ్యాత్మిక మార్గం ఏర్పడితే వెనుకబడిన ముధోల్ నియోజకవర్గం ప్రాంతానికి కొంత మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే తో పాటు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, లోకేశ్వరం మండల బిజెపి అధ్యక్షులు సాయన్న, సీనియర్ నాయకులు గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

## వేడుకలా ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ






మంచిర్యాల ప్రతినిధి జూన్ 22 (జనంసాక్షి) : ర్యాలీ గ్రామంలో అర్హులైన 60మంది లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు భూమి పూజ చేశారు. ఆదివారం నాడు మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండల ర్యాలీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భూమిపూజ ఒక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని ప్రజలకు ఏ అవసరం వచ్చిన వెంటనే తనను కలవాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒకరికి సంక్షేమ పథకాలు అందుతాయని హామీ ఇచ్చారు. గతంలో ప్రభుత్వం పోడు భూముల విషయంలో ఆదివాసీలను అనేక ఇబ్బందులకు గురి చేసిందని తెలిపారు. ఆదివాసీల హక్కుల కోసం తాను అధికారంలో లేకున్నా పోరాటం చేశానని తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ముందుగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు గారికి ఘన స్వాగతం పలికారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వంత ఇంటి కల సాకారం కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష కొట్టు డిప్యూటేషన్ ఆర్డర్ పట్టు

- మహబూబాబాద్ జిల్లా గిరిజన శాఖలో అక్రమ డిప్యూటీషన్లు....
- మండిపడుతున్న కుల సంఘాలు విద్యార్థి సంఘాల నేతలు..
- డిప్యూటేషన్ రద్దు చేయాలని గిరిజన శాఖ డిప్యూటీ సెక్రటరీకి వినతి పత్రం అందజేసిన ఎల్ హెచ్ పి ఎస్ నేతలు...



మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 22 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో అక్రమ డిప్యూటేషన్ లతో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నా హాస్టల్ వార్డెన్ అక్రమ సంపాదనపై విచారణ జరపాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ లక్ష్మీబాయి ని సెక్రటేరియట్ లోని వారి కార్యాలయంలో కలిసి మెమోరాండం లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బోడా రమేష్ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రం బాలిక ఆశ్రమ పాఠశాలలో గత విద్యా సంవత్సరం ఫిబ్రవరి నెలలో హాస్టల్ గోడదూకి గుర్తు తెలియని వ్యక్తులు వసతి గృహంలో ప్రవేశించి తొమ్మిదవ తరగతి విద్యార్థినీల పట్ల అసభ్య కరంగా ప్రవర్తించి విద్యార్థులపై బలత్కారానికి పాల్పడితే తోటి విద్యార్థినులు భయపడి కేకలు వేయడంతో గుర్తు తెలియని వ్యక్తి పారిపోవడం జరిగింది ఈ సంఘటలో ఏటూర్ నాగారం పి.ఓ (ప్రాజెక్టు అధికారి)ని పిర్యాదు చేయగా ఆశ్రమ వసతి గృహం వార్డెన్ పై చర్యలు తీసుకోకపోవడంతో వేసవి సెలువు ముందు రోజు భాధిత విద్యార్థిని వేరే వ్యక్తితో హాస్టల్ నుండి బయటకు వెళ్లిపోవడంతో సదరు వ్యక్తి ఆ విద్యార్థిని బలవంతంగా లోబరుచుకొని అఘాయిత్యానికి పాల్పడ్డాడు విద్యార్థిని తల్లిదండ్రులు సదరు వ్యక్తి పై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగింది నిరుపేద గిరిజన విద్యార్థినిలపై ఆగత్యాలు జరుగుతున్న కనీసం పట్టినట్టు వ్యవహరిస్తూ అందుబాటులో ఉండకుండా ఎలాంటి పర్యవేక్షణ చేయకుండా ఇంతటి దారుణాలు జరుగుతున్న పట్టింపు లేకుండా గిరిజన విద్యార్థినిల జీవితాలతో చెలగాటమాడుతు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్న ఆశ్రమ పాఠశాల వార్డెన్ అనిత పై బదిలీ వేటు వేస్తూ పక్కనే ఉన్న వసతి గృహంలో బదిలీ చేసిన తిరిగి అదే వసతి గృహంలో ఉంటానంటూ పట్టు పడుతున్న విషయం వెనక ఆంతర్యం ఏంటని గిరిజన కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయ నాయకుల అండ దండలతో ఇదేచ్చగా కమిషన్లు ఇచ్చి డిప్యూటేషన్లు తీసుకొచ్చి ప్రభుత్వ నిబంధనలో పాటించకుండా సీనియార్టీ చూడకుండా హెడ్మాస్టర్లకు 10 శాతం కమిషన్లు ఇచ్చి డిప్యూటేషన్ల పేరుతో హాస్టల్ వార్డెన్ లు విద్యార్థినిలకు మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా సాలీ సాలని నీళ్ల చారుతో భోజనం పెట్టి విద్యార్థులను కడుపు కొట్టి నోరు కొట్టి లక్షల రూపాయలు అక్రమంగా సంపాదించుకుంటున్నారని అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ హాస్టల్ వార్డెన్ లు వేరే చిన్న హాస్టళ్లకు వెళ్లడానికి ఇష్టపడడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ విధంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ విద్యార్థినిల పొట్ట కొట్టి అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ వసతి గృహ వార్డెన్లపై చర్యలు తీసుకొని వారి డిప్యూటేషన్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అజ్మీరా బాలు నాయక్ భూక్య రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో రద్దీగా మారిన హేమాచలక్షేత్రం



మంగపేట జూన్ 22 (జనంసాక్షి) : రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి చెందిన స్వయంభువు క్షేత్రం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం కావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారింది. భక్తులు సుదూర ప్రాంతాలైన వరంగల్, ఖమ్మం, హైద్రాబాద్, విజయవాడ వంటి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి చింతామణి, చెంచులక్ష్మి జలపాతాల వద్ద పుణ్యాస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు స్వామివారిని అలాగే ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి, ద్వైత అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు స్వామివారి ఆలయ విశిష్టత, చరిత్రను తెలిపి స్వామివారి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ముక్కామల రాజశేఖర్ శర్మ, అర్చకులు కారంపూడి పవనా కుమారాచార్యులు, ఏడునూతల ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మ, ఆలయ సిబ్బంది సీతారాములు, లక్ష్మీనారాయణ, శేషు, అజయ్, గణేష్, నవీన్, పులయ్య, మహేష్, నరేష్, నాగారున్ లు పాలొన్నారు.

## ఖానాపూర్ వాసవి క్లబ్ వనిత క్లబ్ లో డాన్ టూ డస్క్



ఖానాపూర్ రూరల్ 22 జూన్ (జనం సాక్షి): ఖానాపూర్ వాసవి క్లబ్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాసవి కన్యకపరమేశ్వరి ఆలయంలో డాన్ టు డస్క్ కార్యక్రమం నిర్వహించారు ఇందులో భాగంగా వాసవి మాత గుడిలో గరుకు స్తంభం ఏర్పాటు, మరియు వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకు ఒక వికలాంగునికి నిత్యావసర వస్తువులు, ఇద్దరు రైతులకు సన్మానం, వారికి అవసరమైన విత్తనాలు, చెప్పులు కుట్టేవారి ఇద్దరికి చెరో గొడుగు ఇచ్చారు. ఖానాపూర్‌లో వాసవి క్లబ్ స్థాపించి 25 సంవత్సరాలు నిండిన సందర్భంగా క్లబ్బును ముందుంచి నడిపించిన పాత అధ్యక్షుల అందర్నీ ఈ సందర్భంగా చీఫ్ గెస్ట్ చేతులమీదుగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వివన్ గోల్డెన్ స్టార్ కేసీజీఎఫ్ అంచూరి శ్రీనివాస్, గవర్నర్ వివన్ గోల్డెన్ స్టార్ గట్టు రాణి, వివన్‌కేసిజీఎష్ ఎనిమల మనోజ్ కుమార్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వివన్‌కేజిఎఫ్ మానుక రాజేంద్రప్రసాద్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, వివన్‌కేసిజీఎఫ్ రావికంటి పవన్ కుమార్ డిస్టిక్ క్యాబినెట్ ఆఫీసర్, డిప్యూటీ గవర్నర్ వివన్‌కేసిజీఎఫ్ మహజన్ జితేందర్, రీజియన్ చైర్మన్ వివన్‌కెసిజీఎఫ్ కొత్త సునీల్ ,జోన్ చైర్మన్ గోలి పద్మజ , వాసవి క్లబ్ ప్రెసిడెంట్ చిటికెశి రవీందర్, సెక్రటరీ చిటికెశి సతీష్ కుమార్, కోశాధికారి కూరగాయల సతీష్ కుమార్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎర్ర సుధాకర్, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ కటకం స్వరూప రాణి, సెక్రెటరీ నీలి శ్రీలత, కోశాధికారి మార రమ, క్లబ్ పాత అధ్యక్షులు సంఘ సభ్యులు వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యా రంగ పటిష్టతకు కృషి చేయాలి

- పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర రెడ్డి




**సిద్ధిపేట, జూన్ 22 (జనం సాక్షి) :** విద్యారంగ వ్యవస్థను పటిష్టపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్ రెడ్డి కోరారు. తాళ్ల యేసు రాజు ఉద్యోగ విరమణ అభినందన సభ ఆదివారం సిద్ధిపేటలో జరిగింది. పీఆర్టీయూ టీఎస్ సిద్ధిపేట అర్బన్ మండల- నుంచి అధ్యక్షుడు వంగ వెంకట రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దామోదర్ రెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా యేసు రాజుగారు విద్యా రంగంలో అందించిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే విడుదల అయ్యేటట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని, అదేవిధంగా ఉపాధ్యాయుల పెండింగ్ డీఏల తో పాటు, పీఆర్సీని అమలయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. బడి బాటలో భాగంగా "బడి మనది బాధ్యత మనదే "అనే నినాదంతో పీఆర్టీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డితో కలిసి బడి బాటలో పాల్గొని ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 800 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల, బదిలీలను నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయుని చొప్పున ఉండేలా ప్రభుత్వానికి సూచన చేశామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా పోటీ చేసిన వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం కృషి చేస్తామని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీ మల్లుగారి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లాలో పీఆర్టీఎస్ పటిష్టంగా ఉందని చెప్పారు. ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అందుకు పీఆర్టీయూ సిద్ధిపేట జిల్లా శాఖ పూర్తి సహకార సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అదరాసు పల్లి శశిధరశర్మ మాట్లాడుతూ పదవి విరమణ పొందిన యేసు రాజు సేవలను కొనియాడారు. భవిష్యత్తులో వారు సామాజిక కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టియూ మాస పత్రిక సంపాదక వర్గ సభ్యురాలు విజయ, రాష్ట్ర అసోసియేట్ అద్యక్షుడు ముత్యాల సురేందర్ రెడ్డి, కత్తుల బాపు రెడ్డి, పాతూరి సుజాత, పాతూరి రమాదేవి, చామకూర అనిల్ కుమార్, కె.వెంకటేశ్వర్లు, ఆస దశరథం, నర్ర మహేందర్ రెడ్డి, నర్ర భాస్కర్ రెడ్డి, ఆస లక్ష్మణ్, బి మల్లారెడ్డి, నీరడి లక్ష్మీనారాయణ, సయ్యద్ సందాని, ముక్క రమేశ్, కె.రవి, బొందయ్య, యు.రాజు వివిధ మండల శాఖల అధ్యక్షులు పార్థసారథి, ఎం.రాజిరెడ్డి, ఎ.శ్రీనివాస్ రెడ్డి, వి.శ్రీనివాస్ రెడ్డి, బి రవీందర్ రెడ్డి, నర్ర రామచంద్రారెడ్డి, కూరెళ్ళి శ్రీనివాస్ రెడ్డి, పల్లె శ్రీనివాస్ గౌడ్, ఆకుల లక్ష్మణ్ వివిధ మండలాల ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు ఇవ్వాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 22 (జనం సాక్షి) :** కొత్తగా వచ్చి లాబీయింగ్ చేసి పదవులు తెచ్చుకునే వాళ్ళు అధికారంలో ఉన్నంతసేపే పార్టీ లో ఉంటారని, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని షబ్బీర్ అలీ నివాసంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి వినతి పత్రం అందించిన జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు ఐరేనీ సందీప్ కుమార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటిందని అయినా కాంగ్రెస్ కార్యకర్తలలో ఆవేదన ఉన్నదని, పార్టీ కోసం కష్టపడ్డ వారికి పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇండ్ల లో కూడా నిరుపేద కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని. మొదటి నుండి పార్టీ జెండా మోసిన వారికి మాత్రమే పార్టీ పదవులు వస్తాయని, అర్హత ఉన్నవాళ్లము పార్టీ పదవుల కొరకు అప్లికేషన్ పెట్టుకున్నాము కావున మొదటి ప్రాధాన్యత పార్టీ కష్టకాలంలో ఉన్నవారికి ఇచ్చి పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసేవారికి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆనాడు అధికార టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి నాయకుడిగా ఉన్న నాపై వ్యక్తిగత దాడులకు దిగినా, కేసులు పెట్టినా, అక్రమ అరెస్టులు చేసినా తలొగ్గలేదన్నారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరినీ కలుపుకొని పోయే వ్యక్తిత్వం కలిగి ఉండీ పార్టీకి అధిష్టానం ఆదేశాలకు కట్టుబడి ఉండి పార్టీనీ ముందుకు తీసుకెళ్లే వారికి మాత్రమే పదవులు ఇవ్వాలి స్థానిక ఎన్నికల్లో అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## అర్హులైన పేదలకు దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు



**ఖమ్మం రూరల్, జూన్ 22 (జనం సాక్షి) :** అర్హులైన పేదలకు దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఏదులాపురం మునిసిపల్ పరిధిలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఏదులాపురం మున్సిపల్ ప్రాంతం నాయుడుపేట జంక్షన్ వద్ద రూ. 4 కోట్ల రూపాయలతో ఖమ్మం – మహబూబాబాద్ నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులకు, పెద్దతండ గ్రామంలో ఖమ్మం – సూర్యాపేట ఆర్ అండ్ బి రోడ్డు నుండి శ్రీ యోగానంద సాయి ఆశ్రమం చల్లపల్లి గార్డెన్ వరకు రూ. కోటీ 50 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, గుదిమల్ల వాటర్ ట్యాంక్ నుండి బోడగుట్ట దొంక వరకు రూ. కోటి 21 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... సంవత్సరంన్నర కాలంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా అమలు చేస్తున్నామని అన్నారు. పేదలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేపట్టామని అన్నారు. అర్హులైన పేదలందరికీ తప్పనిసరిగా ఇందిరమ్మ ఇండ్లు అందించే బాధ్యత తాను తీసుకుంటున్నానని అన్నారు. రేషన్ కార్డు ఉన్న పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్.ఈ. యాకోబ్, ఇఇ వి. యుగంధర్, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వరుణ దేవుని రాకకోసం చిన్నారుల కప్పతల్లి ఆట

- పూర్వం రోజులను గుర్తు చేసిన చిన్నారులు



**చేర్యాల, జూన్ 22 (జనంసాక్షి) :** జూన్ మొదటి వారంలో పడాల్సిన వర్షాలు పడకపోవడంతో గ్రామ దేవతలకు పూజలు చేస్తూ..వర్షాలు కురవాలి దేవుడా పంటలు బాగా పండాలి వానదేవుడా అంటూ పాటలు పాడుతూ చిన్నారులు కప్పతల్లి ఆటలు ఆడారు. ఇలాంటి పూజలు పూర్వం రోజుల్లో వర్షాలు కురవని రోజుల్లో చేసేవారు. మళ్లీ చాలా సంవత్సరాల తర్వాత చేర్యాల మండలంలోని రాంపూర్ గ్రామంలో ఇలాంటి పూజలు నిర్వహించడంతో గ్రామ ప్రజలు పూర్వపు రోజులను గుర్తు చేసుకున్నారు. చిన్నారులు అంతా కలిసి రోకలి బండను అలకరించి మధ్యలో సంచిలో కప్పను తగిలించి డబ్బు సప్పులతో గ్రామంలో ఇంటి ఇంటికి తిరుగుతూ వర్షాలు కురవాలని మహిళలు హారతి పట్టి కప్పతల్లిపై, చిన్నారులపై బిందెలతో నీళ్లు పోస్తూ వరుణుడు కరుణించాలని సాంప్రదాయ పద్ధతిగా వరుణ దేవుణ్ణి వేడుకుంటూ మొక్కులను భిక్షగా వేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. పాతకాలంలో వానలు కురువాలంటే పెద్దలు ఈ కప్పతల్లి ఆట ఆడేవారని వరుణుడు కనికరించి వర్షాలు కురిసేవని అన్నారు. అదే పద్ధతిని ఇప్పుడు పాటిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని వరుణ దేవుణ్ణి కోరారు. కప్పతల్లి ఆడినవారిలో బాగోతం మనోజ్,బండారి చరణ్, దొడ్డి సాయినాథ్, దొడ్డి సంజయ్, బండారి ప్రవీణ్, బొప్పనపల్లి చిన్ను తదితరులు పాల్గొన్నారు.


## మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం




**కోదాడ, జూన్ 22 (జనంసాక్షి) :** మాదకద్రవ్యాల వాడకం ఆరోగ్యానికి హానికరం... యువత వాటి బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని కోదాడ పట్టణ ఎస్సై సుధీర్ కుమార్ అన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు ఆదివారం కోదాడ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు, హమాలి కూలీలకు మాదకద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలు, ఆరోగ్యపరమైన సమస్యలు, ఆర్థికపరమైన సమస్యలు, కుటుంబాల చిన్నాభిన్నం పిల్లలపై ప్రభావం మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... రోజువారి కూలీ జీవనం గడిపేవారు డ్రగ్స్, మత్తుకు అలవాటు పడితే ఆర్థికంగా నష్టపోయి అనారోగ్యం పాలయ్యి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని ఇలాంటి వాటి నుండి దూరంగా ఉండాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కుటుంబ పెద్ద ఆరోగ్యం క్షీణిస్తే ఆ కుటుంబం వీధిపాలవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలను ప్రజల సహకారం పోలీసు వారికి అవసరమని కోరారు. పిల్లల పట్ల దృష్టి పెట్టాలని పిల్లలు, యువత ఏదైనా కొత్త అలవాట్లకు లోనవుతున్నట్లయితే వారిని మందలించాలి అని అవసరమైతే డాక్టర్స్ ను, ఉపాధ్యాయులను, పోలీసు వారిని సంప్రదించి కౌన్సిలింగ్ ఇప్పించాలని కోరారు. మత్తు పదార్థాలను ఉపయోగించడం వల్ల నాడీ వ్యవస్థ మెదడు వ్యవస్థ మనిషి అధీనంలో ఉండవు అన్నారు. మెదడు వత్తిడికి గురై అనారోగ్యం పాలు అవుతారు అన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఎవరైనా ఉపయోగిస్తున్నా ఎవరైనా రవాణా చేస్తున్న ఎవరైనా విక్రయిస్తున్న అలాంటి సమాచారం స్థానిక పోలీసులకు ఇవ్వాలని డ్రగ్స్ నివారణలో పోలీసులతో భాగస్వామ్యం కావాలని కోరారు.

## ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం

**మొయినాబాద్, జూన్ 22 (జనం సాక్షి) :** ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర ఎస్టిఎఫ్ అధ్యక్షులు యూ. పోచయ్య అన్నారు. ఆదివారం హిమాయత్ నగర్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్కూల్ టీచర్ సమైక్యా (ఎస్టిఎఫ్) తెలంగాణ ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నెపల్లి పాఠశాలలో పని చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఎస్టిఎఫ్ అధ్యక్షులు యూ.పోచయ్యకు ఓడీ సౌకర్యం లభించడంతో ఆయనకు ఆ సంఘం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూ.పోచయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధాయ్యుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషిగా పని చేస్తున్నానన్నారు. ఉపాధ్యాయులు సమస్యలు ధీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న బిల్లులు, డీఏలు ఇతర సమస్యలపై ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తామని ఉపాధ్యాయుల ఐక్యత వర్ధిలేలాల కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం మన లక్ష్యంగా పాఠశాలలను అభివృద్ధి చేసుకుందామన్నారు. జిల్లాలోని ఆయా మండలాల శాఖల పక్షాన వారిని అభినందిస్తు సన్మానించడం ఆయన ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ పరంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు వి.గోపాల్, ప్రతినిధులు విఠల్, రమేష్, రాంచంద్రయ్య, రాంచందర్, నర్సింహులు, లక్ష్మీనారాయణ, దిలీప్, భగవత్ గీత, రాజారావు, మొయినాబాద్ మండల అధ్యక్షుడు వి.సుధాకర్, వెంకటస్వామి, రజిత, సంతోష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## దాతలను అవమానిస్తారా..?

- కొత్త సాంప్రదాయాలతో అమ్మవారి భక్తులను ఇబ్బందులకు గురిచేయకండి
- మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**హైదరాబాద్, జూన్ 22 (జనంసాక్షి)**

కొత్త సాంప్రదాయాలకు తెరతీసి భక్తులను ఇబ్బందులకు గురి చేయొద్దని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో కళ్యాణం సందర్భంగా అమ్మవారికి సమర్పించనున్న పోచంపల్లి పట్టువస్త్రాలను పద్మశాలి సంఘం జయరాజ్ ఆధ్వర్యంలో మగ్గంపై తయారు చేసే పనులను ప్రారంభించారు. వస్త్రాల తయారీకి ముందుకొచ్చిన వారిని ఆయన అభినందించారు.

ముందుగా ఎల్లమ్మ అమ్మవారిని, పోచమ్మ అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. జులై 1న నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం ఏర్పాట్లపై దేవాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అమ్మవారి కళ్యాణంలో పాల్గొనే దంపతులకు ఇచ్చే టికెట్లను తగ్గిస్తున్నారని, దాతలకు ఇచ్చే పాస్‌లను తగ్గిస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే అధికారులను ఈ విషయమై ప్రశ్నించారు. కొత్త విధానాల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉంటుందని, పాత పద్దతులనే అవలంభించాలని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

అమ్మవారిపై భక్తితో ఆలయ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్న దాతలను అవమానిస్తారా అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని, అమ్మవారి వద్దకు వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని వివరించారు. అమ్మవారి కళ్యాణానికి వచ్చేవారి సంఖ్య కూడా ప్రతి ఏటా పెరుగుతుందని తెలిపారు. లక్షలాదిగా వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి కోటి రూపాయల విరాళం అందజేయడం పట్ల ముఖేష్ అంబానీ సతీమణి నీతా అంబానీకి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆ నిధులను ఫిక్స్డ్ డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని ఆలయ అధికారులకు సూచించారు.

### అమ్మవారికి బంగారు బోనం

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి జులై 2న పాతబస్తీకి చెందిన ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పిస్తారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.


సుమారు 500 మంది వివిధ దేవాలయాలకు చెందిన కమిటీ ప్రతినిధులు అమ్మవారికి బోనం సమర్పించే కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. బోనం సమర్పించే సమయంలో అందరూ సంయమనంతో ఉండాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈఓ మహేందర్ గౌడ్, సూపరింటెండెంట్ హైమవతి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్ కుమార్, కూతురు నర్సింహ, బలరాం, శ్రీనివాస్ గౌడ్, వనం శ్రీనివాస్, రాజేష్ ముదిరాజ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభ్యున్నతి కోసం పని చేస్తాం



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 22 (జనం సాక్షి) :** పేదల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమ పథకాలను నిరంతరంగా కొనసాగిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి 572 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా ఇంద్రాపూర్ లోని నగర యాదవ సంఘంలో 261 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ అసంబద్ధ పాలన వల్ల తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆక్షేపించారు. రూ. 7.50 లక్షల కోట్ల అప్పులపై తమ ప్రభుత్వం ప్రతి నెల రూ. 6500 వేల కోట్లు వడ్డీ కింద చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల కోసం మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ. 500 లకే వంటగ్యాస్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, సన్న బియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే కృతనిశ్చయంతో మొదటి విడతగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 35 వేల చొప్పున ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఇంటి స్థలాలు కలిగిన పేద కుటుంబాల వారు ముందుకు వస్తే, అర్హత కలిగిన వారందరికీ తప్పనిసరిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. ఐదు లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు. ఇల్లు మంజూరు కోసం ప్రజలు దళారులను ఆశ్రయించవద్దని, ఎవ్వరికీ నయా పైసా ఇవ్వకూడదని సూచించారు. పార్టీలకు అతీతంగా, పూర్తి పారదర్శకంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు తప్పకుండా మంజూరు చేస్తామని భరోసా కల్పించారు. ప్రస్తుతం మంజూరీ పత్రాలు అందుకున్న లబ్దిదారులు ప్రభుత్వ తోడ్పాటుతో త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని, సొంతింటి కలను సాకారం చేసుకోవాలని అన్నారు. ఇదిలా ఉండగా నగరంలో సొంత స్థలాలు లేని నిరుపేదల కోసం ప్రభుత్వ పరంగా అన్ని వసతులతో కూడిన ఇందిరమ్మ కాలనీలు నిర్మించేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర సహకార యునియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ చైర్మన్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటి గోడలు కల..కల..

## ఆకట్టుకుంటున్న త్రీడీలో వాల్..

ఇంటికి వచ్చిన అతిథులను త్రీడీ వాల్ పేపర్లతో కట్టిపడేస్తున్నారు ఇంటీరియర్ ప్రియులు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక వాల్ పేపర్లలోనూ సరికొత్త పోకడలు సంతరించుకుంటున్నాయి. నిర్వహణలో కాస్త శ్రద్ధ చూపిస్తే చాలు త్రీడీ వాల్ పేపర్ల మన్నిక బాగానే ఉంటుంది. కొత్తదైనా, పాత ఇళ్లయినా వాల్ పేపర్ల సహాయంతో ఇంటిని అందంగా అలంకరించుకోవచ్చు. మార్కెట్లో వాల్ పేపర్లు రోల్స్ రూపంలో లభ్యమవుతాయి. ఒక్క రోల్ కొంటే కనీసం 57 చ.అ. విస్తీర్ణానికి సరిపోతుంది. దీని ప్రారంభ ధర రూ.2 వేల నుంచి ఉంటుంది. గోడ సైజు 10బి10 ఉంటే కనీసం రెండు రోల్స్ సరిపోతాయి. గోడకు అంటించడానికి అదనపు చార్జీలుంటాయి. కనీసం రూ.400 వరకు ఉంటుంది. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా ఇంటీరియర్ డిజైనర్లు ఎప్పటికప్పుడు కొత్త పోకడలను పరిచయం చేస్తున్నారు. ప్రధానంగా వాల్ పేపర్ల విభాగంలో త్రీడీ పేపర్స్, కస్టమైజ్డ్ వాల్ పేపర్లను మార్కెట్లోకి తీసుకొచ్చారు. ఇవి మనం కోరుకున్న డిజైన్లు, సైజుల్లో లభించడమే వీటి ప్రత్యేకత. దేవుడి బొమ్మలు, కుటుంబ సభ్యుల బొమ్మలు, తమ అభిరుచులను ప్రదర్శించే బొమ్మలు వంటివి ఇంట్లోని గోడల మీద అంటించుకోవచ్చు. త్రీడీ వాల్ పేపర్లు సుమారు 1బి1 సైజ్ నుంచి 20బి20 సైజ్ దాకా లభిస్తాయి. ధర చ.అ.కు రూ.120 నుంచి వరకుంటుంది. త్రీడీ వాల్ పేపర్ల నిర్వహణ కూడా చాలా సులువు. మరకలు పడితే తడి గుడ్డతో తుడిస్తే శుభ్రమవుతుంది.

# స్మార్ట్‌గా పరికరాలు.. ఇక మీ పని మరింత ఈజీగా..

**మ్యాజిక్ మౌస్.. డేటా గార్డ్.. ఈ స్మార్ట్ గ్యాడ్జెట్స్ ఉంటే ఆఫీస్ పని అవ్వదు భారం! ఆఫీసు అంటేనే బోరింగ్‌గా, ఆఫీసు పని చాలా భారంగా అనిపిస్తోందా! అయితే, ఒక్కసారి ఈ టెక్ కొలీగ్స్‌ను కలవండి, అప్పుడు మీ ఆఫీస్ పని ఆటలాగా మారుతుంది.**

**మ్యాజిక్ మౌస్!**

ఇప్పటి వరకు మౌస్ అంటే కేవలం క్లిక్‌లు కోసమే అనుకున్నారా? అయితే మీరు ఈ 'చీర్‌డాట్స్ 2' గురించి తెలుసుకోవాల్సిందే! ఇది ఒక మల్టీ టాలెంట్ కాంబినేషన్. ఎయిర్ మౌస్, టచ్‌ప్యాడ్, క్లికర్, ఏఐ చాట్, డేటా సమ్మరీ ఇచ్చే అడ్వైజర్ అన్నీ ఇదే! ఆఫీస్‌లో ప్రెజెంటేషన్ ఇచ్చేటప్పుడు స్క్రీన్ మీద దీనితో ఇలా ఊపేస్తే, అలా స్లైడ్స్ మారిపోతాయి. ఒక బటన్‌తో స్క్రీన్‌పై స్పాట్‌లైట్ వేసి అందరి దృష్టినీ ఆకర్షించవచ్చు. ఇంకా చెప్పాలంటే, మీరు మాట్లాడిన మాటలను ఈ మౌస్ ఏఐ సాయంతో రికార్డ్ చేసి, సింపుల్ సమ్మరీలుగా మార్చేస్తుంది. మొబైల్, బ్లూటూత్‌తో కనెక్ట్ చేసుకొని కూడా దీనిని వాడుకోవచ్చు. ఒక్కసారి చార్జ్ చేస్తే దాదాపు ఇరవై రోజులు పాటు పనిచేస్తుంది. ధర 99 డాలర్లు (రూ. 8,475).



**ట్రిపుల్ ట్రీట్ చార్జ్!**

ఆఫీస్ అంటే ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఎయిర్‌పాడ్స్ వంటి చాలా రకాల ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ రోజూ ఫుల్ చార్జ్ అవ్వాల్సిందే! కాని, ఒక్కోటి వేర్వేరు వైర్లు అడిగితే, ఆఫీస్‌లో మేనేజర్ కన్నా మనకే ఎక్కువ టెన్షన్! ఈ సమస్య తీర్చడానికే వచ్చింది ఈ 'జీహూ క్యూబ్ ట్రిక్ ఎక్స్'. ఇది ఒక త్రీ ఇన్ వన్ చార్జర్. ఇది ఉంటే ఇక మీ డెస్క్ మీద ఒక్క కేబుల్ కూడా కనిపించదు. ఫోన్, వాచ్, ఎయిర్‌పాడ్స్ అన్నింటిని ఒకేచోట, ఒకేసారి చార్జ్ చేసుకోవచ్చు. ఇందులోని ఫాస్ట్ చార్జింగ్ ఆప్షన్ మిమ్మల్ని మరింత స్మార్ట్‌గా చేసేస్తుంది! ధర 55 డాలర్లు (రూ. 4,708)

**డేటా గార్డ్**

ఆఫీస్ ఫైల్స్ అంటే మామూలు విషయం కాదు, అవి ప్రమోషన్‌కి టికెట్ లాంటివి. ఒక్కసారైనా సిస్టమ్ సడన్‌గా క్రాష్ అయ్యిందంటే? అంతే సంగతులు. ఇక మీరు మీ కొత్త రెజ్యూమే రెడీ చేసుకోవాల్సిందే! పైగా హ్యాకర్లు, వైరస్‌లు, సాఫ్ట్‌వేర్ బగ్స్‌– అన్నీ డేటాపై పంజా విసురుతున్న ఈ రోజుల్లో డిజిటల్ ఫైల్స్‌ను భద్రంగా ఉంచడం అంటే, ఫ్రిజ్‌లో పిల్లలకు కనిపించకుండా ఐస్‌క్రీమ్ దాచినంత కేర్ తీసుకోవాలి. అందుకే వచ్చింది ఈ 'కింగ్‌స్టన్ ఐరన్ కీ వాల్ట్ ప్రైవసీ 80'. ఇది డ్రైవ్ కాదు, డేటాకు ఒక డిజిటల్ బౌన్సర్ లాంటిది. టచ్ స్క్రీన్‌తో, పాస్‌వర్డ్, పిన్‌లాంటి లాకింగ్ సిస్టమ్‌తో వస్తోంది. ఏకంగా 3.8 టీబీ డేటా స్టోర్ చేసుకోవచ్చు. అంటే పదేళ్ల ఆఫీస్ ఫైల్స్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు, పర్సనల్ ఫొటోలు, వీడియోలు అన్నీ ఇందులో భద్రంగా దాచుకోవచ్చు. ఒకే డ్రైవ్‌ను మల్టిపుల్ యూజర్లుగా వాడుకోవచ్చు. ఒక్కొక్కరికి ఒక్కో పాస్‌వర్డ్ కూడా ఇవ్వవచ్చు. హ్యాకర్ ట్రై చేస్తే వెంటనే రిడ్–ఓన్లీ మోడ్ ఆన్ చేసి 'బాబూ, కాస్త పక్కకు వెళ్లి ఆడుకోమ్మా!' అంటూ అడ్డుపడుతుంది. అంత భద్రంగా డేటాను చూసుకుంటుంది. ధర 729 డాలర్లు (రూ. 62,422).

## జియో నుంచి 2 కొత్త ప్లాన్‌లు.. ప్రత్యేక బెనిఫిట్లు..

మొబైల్ గేమర్లకు శుభవార్త.. గేమింగ్ ఔత్సాహికుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన రెండు కొత్త అపరిమిత 5జీ డేటా ప్లాన్లను రిలయన్స్ జియో లాంచ్ చేసింది. ఈ కొత్త ప్లాన్లు హై–స్పీడ్ డేటాను మాత్రమే కాకుండా ఉచిత బ్యాటిల్‌గ్రౌండ్స్ మొబైల్ ఇండియా (బీజీఎంఐ) స్కిన్లు, జియోగేమ్స్ క్లౌడ్ యాక్సెస్ వంటి గేమింగ్ ప్రయోజనాలను కూడా అందిస్తాయి. వినియోగదారులు వాటిని డౌన్లోడ్ చేయకుండానే 500కి పైగా ప్రీమియం గేమ్‌లను ఆడుకోవచ్చు.

ప్లాన్ వివరాలు.. ప్రయోజనాలు:జియో ప్రారంభించిన కొత్త ప్లాన్‌లు.. ఒకటి రూ.495 ప్లాన్, మరొకటి రూ.545 ప్లాన్. ఈ రెండు ప్లాన్లూ 28 రోజుల వ్యాలిడిటీతో వస్తాయి. రూ.495 ప్లాన్లో రోజుకు 1.5 జీబీ డేటా, అదనంగా 5 జీబీ బోనస్ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, జియోగేమ్స్ క్లౌడ్ యాక్సెస్ లభిస్తుంది. రూ.545 ప్లాన్లో రోజుకు 2 జీబీ 4జీ డేటా, అన్లిమిటెడ్ 5జీ డేటాతో పాటు అదే గేమింగ్ బెనిఫిట్స్ లభిస్తాయి. రెండు ప్లాన్లలో బార్డ్స్ జర్నీ సెట్, డెసర్ట్ టాస్క్ ఫోర్స్ మాస్క్, ట్యాప్ బూమ్ మొలోటోవ్ కాక్టెయిల్ వంటి ప్లేయర్లకు ఉచిత ఇన్–గేమ్ వస్తువులను అందించే ప్రత్యేక బీజీఎంఐ రివార్డ్ కూపన్లు కూడా ఉన్నాయి. ఈ రివార్డులను క్లెయిమ్ చేసుకోవడానికి వినియోగదారులు గేమింగ్ ప్యాక్‌లలో దేనితోనైనా రీఛార్జ్ చేసుకోవచ్చు. రీఛార్జ్ చేసిన తర్వాత, ధృవీకరణ సందేశం వస్తుంది. మై జియో యాప్‌లో రివార్డ్ కూపన్లు లభిస్తాయి.




ప్లేయర్ క్యారెక్టర్ ఐడీ, ఇచ్చిన యూనిక్ కోడ్ ఉపయోగించి ఈ కూపన్లను అధికారిక బీజీఎంఐ వెబ్సైట్లో రీడీమ్ చేసుకోవచ్చు. ఇక జియోగేమ్స్ క్లౌడ్ వినియోగదారులు హై–ఎండ్ పరికరాలు అవసరం లేకుండా నేరుగా వారి స్మార్ట్‌ఫోన్లు, టీవీలు లేదా బ్రౌజర్లలో గేమ్స్ ఆడవచ్చు. ఈ సేవను పొందడానికి వినియోగదారులు జియోగేమ్స్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి, వారి జియో నంబర్‌తో లాగిన్ కావాలి. సబ్ స్క్రిప్షన్ ఆటోమేటిక్‌గా యాక్టివేట్ అవుతుంది.

## కొత్త లుక్‌తో హెూండా సిటీ స్పోర్ట్ కారు

హెూండా కార్స్ ఇండియా సంస్థ న్యూ సిటీ స్పోర్ట్ కారును ఆవిష్కరించింది. దీని ధర రూ. 14,88,900గా (ఢిల్లీ ఎక్స్ షోరూం) ఉంటుంది. లైఫ్ ఈజ్ ఏ స్పోర్ట్ ట్యాగ్‌లైన్‌తో ప్రవేశపెట్టిన ఈ కార్లు పరిమిత సంఖ్యలోనే అందుబాటులో ఉంటాయని సంస్థ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహల్ తెలిపారు. వెలుపల స్పోర్టీ బ్లాక్ గ్రిల్, అలాయ్ వీల్స్, అలాగే లోపల ప్రీమియం లెదర్ బ్లాక్ సీట్లు, రూఫ్ లైనింగ్‌తో ఇంటీరియర్స్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు వివరించారు. మహీంద్రా ట్రక్ అండ్ బస్ బిజినెస్ తాజాగా అత్యధిక మైలేజీ గ్యారంటీతో ఫ్యూరి యో 8 పేరిట తేలికపాటి వాణిజ్య వాహన ట్రక్కులను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. సెగ్మెంట్లో అత్యుత్తమ మైలేజీనివ్వకుంటే ట్రక్కును వాపసు చేయొచ్చనే ఆఫరుతో దీన్ని అందిస్తున్నట్లు సంస్థ పేర్కొంది. ఈ వాహనం 4, 6 టైర్ల కార్గో వేరియంట్స్‌లో లభిస్తుంది. కొనుగోలుదారుకు అధిక ఆదాయాలు, కనిష్ట స్థాయిలో నిర్వహణ వ్యయాలతో అన్ని రకాల ప్రయోజనకరంగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దినట్లు సంస్థ ప్రెసిడెంట్ వినోద్ సహాయ్ పేర్కొన్నారు.




## తప్పుడు టికెట్ ఇచ్చి తిప్పలు పెడతారా?

### ఎయిర్‌లైన్‌కు జరిమానా

ప్రయాణికుడికి తప్పుడు విమాన టికెట్ ఇచ్చి ఇబ్బందులకు గురి చేసిన ఎయిర్‌లైన్ సంస్థ స్పైస్ జెట్‌కు వినియోగదారుల కమిషన్ జరిమానా విధించింది. స్పైస్ జెట్ తప్పుడు టికెట్లు జారీ చేయడంతో ఓ సీనియర్ సిటిజన్ ఆర్థికంగా, మానసికంగా నష్టపోయాడని, ఆ ప్రయాణికుడికి రూ.25,000 నష్టపరిహారం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. ముంబై (సబర్బన్) జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జూన్ 17న జారీ చేసిన ఉత్తర్వు లలో ప్రయాణికుడిని "మానసిక వేధింపులకు" గురిచేసిన సంఘటనలో "లోపభూయిష్టమైన సేవ, నిర్లక్ష్య ప్రవర్తన"కు స్పైస్ జెట్‌ను వినియోగదారుల కమిషన్ దోషిగా పేర్కొంది. వివరాల్లోకి వెళ్తే.. ఘట్కోపర్ ప్రాంతంలో నివసిస్తున్న సీనియర్ సిటిజన్ 2020 డిసెంబర్ 5న ముంబై నుండి దర్భంగాకు స్పైస్ జెట్‌లో రానూపోనూ టికెట్లను బుక్ చేసుకున్నారు. ముంబై–దర్భంగా ప్రయాణం పూర్తి కాగా, ప్రతికూల వాతావరణం కారణంగా తిరుగు ప్రయాణాన్ని విమానయాన సంస్థ రద్దు చేసింది. 2020 డిసెంబర్ 8న ముంబైలో పీహెచ్‌డీ ఆన్‌లైన్ పరీక్షకు హాజరు కావాల్సి ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రయాణికుడు కోరగా అదే రోజు పాట్నా నుంచి కోల్‌కతాకు, అక్కడి నుంచి ముంబైకి ప్రయాణించేందుకు స్పైస్‌జెట్ ప్రత్యామ్నాయ టికెట్ అందించింది. అయితే తీరా పాట్నాకు చేరుకున్న తర్వాత ఆ టికెట్లు తప్పుగా ఉన్నాయని విమానాశ్రయ అధికారులు తెలియజేశారు. దీంతో ప్రయాణికుడు మరుసటి రోజు ఉదయం తన సొంత ఖర్చులతో మరో విమానాన్ని బుక్ చేసుకోవాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ముంబైకి ఆలస్యంగా రావడం వల్ల ఆయన పరీక్షకు కూడా రాయలేకపో యారు. ఇదంతా నిర్లక్ష్యం వల్లే జరిగిందంటూ సదరు వ్యక్తి వినియోగదారుల ప్యానెల్ ను ఆశ్రయించారు. ఛార్జీ మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.2 లక్షలు, లిటిగేషన్ ఖర్చు కింద రూ.25 వేలు స్పైస్ జెట్ నుంచి ఇప్పించాలని కోరారు.

# ఇరాన్ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

టెహ్రాన్(జనంసాక్షి):ఇప్పటికే ఇజ్రాయెల్ దాడులతో బెంబేలెత్తుతున్న ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులకు దిగింది. కీలకమైన ఫోర్డో, నతాంజ్, ఇస్ఫాహన్ అణుకేంద్రాలపై బీ–2 స్పిరిట్ బాంబర్లతో విరుచుకుపడింది. ఈ తరుణంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఇజ్రాయెల్, అమెరికా మూకుమ్మడిగా దాడులకు దిగుతుండటంతో ఇరాన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ దాడులకు ప్రతీకారంగా పశ్చిమాసియాలోని అమెరికా పౌరులు, సైనిక సిబ్బందిని లక్ష్యంగా ఇరాన్ దాడులు నిర్వహించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. అసలు ఇరాన్ ప్రతీకారం తీర్చుకోవడానికి ఉన్న అవకాశాలేంటి? తమ దేశంలోని కీలకమైన అణుకేంద్రాలపై అమెరికా దాడులు నిర్వహించిన నేపథ్యంలో.. పశ్చిమాసియా ప్రాంతంలోని వివిధ అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించే అవకాశం ఉంది. అంతేకాకుండా న్యూయార్క్, వాషింగ్టన్ లాంటి కీలక నగరాల్లో జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బాంబుదాడులకు పాల్పడే అవకాశముంది. ఈ మేరకు అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు ఇప్పటికే ప్రభుత్వానికి స్పష్టమైన సమాచారం అందించాయి. ఈ క్రమంలోని వివిధ ప్రార్థన స్థలాలు, జనసమూహాలు ఉన్న చోట అమెరికా భద్రతను కట్టుదిట్టం చేసింది.

ఇజ్రాయెల్ తదుపరి లక్ష్యం ఐఆర్‌జీసీ

ఇరాన్‌పై గత కొన్ని రోజులుగా ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నప్పటికీ.. దాని ప్రధాన లక్ష్యం అణుస్థావరాలను నేలమట్టం చేయడమే. అణు కార్యక్రమానికి సహకరిస్తున్న కీలక శాస్త్రవేత్తలు, మిలిటరీ ఉన్నతాధికారులు కూడా ఇజ్రాయెల్ హిట్‌లిస్టులో ఉన్నారు. ఇన్నాళ్లూ వారి లక్ష్యంగానే దాడులు జరిగాయి. అమెరికా కూడా ప్రత్యక్షదాడులకు దిగుతున్న తరుణంలో.. టెల్అవీవ్ తన లక్ష్యాన్ని విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరాన్ మిలటరీ, ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కార్ప్స్ లక్ష్యంగా ఇకపై దాడులు ఉధృతమయ్యే అవకాశాలు ఉన్నట్లు అక్కడి మీడియా చెబుతోంది. ఈ నేపథ్యంలో ఓ వైపు ఆత్మరక్షణ చేసుకుంటూ, ప్రత్యర్థిపై పోరాడాల్సిన పరిస్థితులు ఇరాన్‌కు ఎదురయ్యాయి.



**ముసుగు సంస్థలను ఇరాన్ నిద్ర లేపేనా?:**ఇన్నాళ్లూ పెంచి పోషించిన హమాస్ హెజ్‌బొల్లా హూతీలు, ఇరాక్‌లోని పలు మిలీషియా సంస్థలను ఇప్పుడు ఇరాన్ ఉపయోగించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. లెబనాన్, ఇరాక్, యెమెన్ భూ భాగాల నుంచి ఇజ్రాయెల్‌పైకి దాడులు చేసేందుకు ఉగ్ర సంస్థలను ఇరాన్ వినియోగించుకోవచ్చు. అయితే, ఇజ్రాయెల్ దాడులతో ఇప్పటికే హమాస్, హెజ్‌బొల్లా అగ్రనాయకత్వం తుడిచిపెట్టుకు పోయింది. మరోవైపు ఎర్ర సముద్రంలో జరిగిన అలజడులతో హూతీలను అమెరికా అణచివేసింది. దీనికి తోడు నాయకత్వ లేమితో ఆయా సంస్థల్లో అంతర్గత కుమ్ములాటలు చోటు చేసుకుంటున్నాయి. ఈ తరుణంలో వీరంతా ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే, హెజ్‌బొల్లా కీలక నేత షేక్ నయీం ఖాసీమ్ మాత్రం ఇరాన్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఇటీవల ప్రకటించారు.

**రంగంలోకి చైనా, రష్యా?:**ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు ఏకపక్షంగా పోరు సాగిస్తున్న తరుణంలో.. చైనా, రష్యా పేర్లు తెరమీదకు వస్తున్నాయి. సైనికపరంగా ఈ రెండు దేశాలూ బలమైనవే. ఓవైపు సంయమనం పాటించాలని కోరుతున్నప్పటికీ.. పరోక్షంగా ఇరాన్‌కు మద్దతిస్తున్నాయి. అందుకు ఇటీవల ఆయా దేశాల నేతలు చేసిన వ్యాఖ్యలు బలం చేకూరుస్తున్నాయి. ఇజ్రాయెల్– ఇరాన్ యుద్ధాన్ని ఆపే ప్రయత్నం చేయకుండా.. అగ్నిలో ఆజ్యం పోసినట్లు అమెరికా వ్యవహరిస్తోందని చైనా ఆరోపించింది. అంతేకాకుండా ఇజ్రాయెల్ శత్రువులను తగ్గించుకుంటే మంచిదని అధ్యక్షుడు జిన్‌పింగ్ హితవుపలికారు. మరోవైపు.. ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంలో అమెరికా సైనిక జోక్యం చాలా ప్రమాదకరమని రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా హెచ్చరించారు. ఇరాన్‌లోని బుషెహర్ అణువిద్యుత్ కేంద్రంపై దాడి చేయడం సరికాదని ఇజ్రాయెల్‌ను కూడా రష్యా హెచ్చరించింది. అయితే.. ఈ దాడి పొరపాటున జరిగిందని ఇజ్రాయెల్ వివరణ ఇవ్వడంతో శాంతించింది. ఒక వేళ యుద్ధం తీవ్రత ఎక్కువైతే.. ఈ రెండు దేశాలు ఇరాన్‌కు తమ పూర్తి మద్దతిచ్చే అవకాశం ఉంది.

**ఇరాన్ అనూహ్య నిర్ణయం!:**ఒంటరైపోతున్న ఇరాన్ ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టేందుకు అనూహ్య నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రపంచ చమురు వాణిజ్యానికి జీవనాడి అయిన 'హార్మోజ్ జలసంధి'ని మూసివేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్ ..తదితర దేశాల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒకవంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడినుంచే వివిధ దేశాలకు చేరుతుంది. ఒకవేళ ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంటే ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు భగ్గుమంటాయి. ప్రస్తుతం ఇజ్రాయెల్,అమెరికా దేశాలు, ఇరాన్‌తో యుద్ధం చేస్తున్నప్పటికీ, దాని ప్రభావం కేవలం ఆ మూడు దేశాలకే పరిమితమవ్వడంలేదు. యావత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది. ఒకవేళ రష్యా, చైనా కూడా ఇందులో భాగస్వాములైతే పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉంటాయనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో ఆయా దేశాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో చూడాలి.



# సెబీ నిబంధనల్లో వెసులుబాటు

**జనంసాక్షి:**పెట్టుబడి సలహాదారులు (ఐఏలు), పరిశోధన విశ్లేషకులకు (ఆర్ఏలు) సెబీ నిబంధనల్లో వెసులుబాటు కల్పించింది. తమ డిపాజిట్ అవసరాలకు అనుగుణంగా వారు ఇప్పటి వరకు నిబంధనల ప్రకారం బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో నిర్ణీత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఎఫ్‌డీలకు అదనంగా లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్, ఓవర్‌నైట్ మ్యూచువల్ ఫండ్స్‌కు సైతం సెబీ అనుమతించింది. ఏదేనీ షెడ్యూల్డ్ బ్యాంకులో ఎఫ్‌డీ చేసి, అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీ (ఏఎస్‌బీ) పేరిట లీన్‌మార్క్‌డ్ (హక్కులు కల్పించడం) చేయాల్సి వచ్చేది. ఎఫ్‌డీ ఖాతాల ప్రారంభం విషయంలో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వారు సెబీ దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్‌డీకి ప్రత్యామ్నాయంగా ఏఎస్‌బీకి అనుకూలంగా మార్క్ చేసిన లిక్విడ్ మ్యూచువల్ ఫండ్ యూనిట్లను కూడా అనుమతించవచ్చని వారు సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు సెబీ బోర్డు తాజాగా ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనను ఆమోదించిన సెబీ బోర్డు లిక్విడ్ మ్యూచువల్ ఫండ్లను తక్కువ రిస్క్, తక్కువ అస్థిర సాధనాలుగా పరిగణించవచ్చని పేర్కొంది. అంతేకాకుండా లిక్విడ్ మ్యూచువల్ ఫండ్స్ పై కూడా లైను మార్క్ చేయవచ్చు. లిక్విడ్ మ్యూచువల్ ఫండ్ యూనిట్లపై లీన్ నిర్వహణ, లీన్ అమలు సెక్యూరిటీస్ మార్కెట్ ఎకోసిస్టమ్ పరిధిలోనే ఉందని, ఇది మరింత సమర్థతను తీసుకువస్తుందని సెబీ తెలిపింది.

ఆపరేషన్ సింధు..

## ఇజ్రాయెల్ నుంచి భారతీయుల తరలింపు షురూ

ఈ క్రమంలోనే 160 మందితో కూడిన తొలి బ్యాచ్ ఇజ్రాయెల్ నుంచి జోర్డాన్ సరిహద్దుకు చేరుకుంది. ఇజ్రాయెల్‌లో దాదాపు 40 వేలమంది భారతీయులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. ఇరాన్ దాడులతో స్థానికంగా పరిస్థితులు దిగజారుతుండటంతో.. అక్కడి భారతీయుల తరలింపునకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్థానిక రాయబార కార్యాలయం అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తొలి బ్యాచ్ కింద టెల్అవీవ్, హైఫాల నుంచి 160 మంది భారతీయులను రోడ్డు మార్గంలో జోర్డాన్ సరిహద్దుకు తరలించింది. ఇజ్రాయెల్ గగనతలం మూసిఉండటంతో జోర్డాన్ మీదుగా వారిని స్వదేశానికి తీసుకురానుంది. విదేశాంగశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానాలు జోర్డాన్ రాజధాని అమ్మాన్ నుంచి దిల్లీకి చేరుకోనున్నాయి. రానున్న రోజుల్లో ఈజిప్టు నుంచీ ప్రత్యేక విమానాలు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరోవైపు.. ఇరాన్ నుంచి భారతీయుల తరలింపు కొనసాగుతోంది. ఆదివారం మరో 311 మంది ప్రత్యేక విమానంలో దిల్లీకి చేరుకున్నారు.

# పాక్..హాతవిధీ

## 'నోబెల్ శాంతి'కి నామినేట్ చేద్దామనుకుంటే.. ఇలా చేశారేంటి?

### ట్రంప్ వ్యవహారంపై తల పట్టుకున్న పాకిస్థాన్

కరాచీ: ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగడాన్ని పాకిస్తాన్ ఖండించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రశంసలతో ముంచెత్తిన తర్వాతే రోజే ఇరాన్‌పై అగ్రరాజ్యం దాడులకు దిగడాన్ని పాకిస్తాన్ వ్యతిరేకించింది. నోబెల్ శాంతి పురస్కారానికి డొనాల్డ్ ట్రంప్ అన్ని విధాలా అర్హుడేనని పాక్ ప్రకటించిన రోజు వ్యవధిలోనే.. ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించిన అమెరికా వైఖరిని పాక్ తప్పుబట్టింది. ఈ మేరకు ఇరాన్‌పై అమెరికా దాడులు చేయడాన్ని ఖండిస్తున్నట్లు పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రకటన ద్వారా స్పష్టం చేసింది. ఇది ఎంతమాత్రం సమంజసం కాదని 'ఎక్స్' లో పేర్కొంది పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వచ్చే ఏడాది నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని కోరుతూ ఆయన పేరును అధికారికంగా ప్రతిపాదించాలని నిర్ణయించినట్లు పాకిస్తాన్ ప్రభుత్వం శనివారం(జూన్ 21వ తేదీ) వెల్లడించింది. ఇటీవల నిర్ణయాత్మక దౌత్యపరమైన జోక్యంతో భారత్–పాకిస్తాన్ ఘర్షణ ఆగేలా ట్రంప్ కృషి చేశారని, అందుకు నోబెల్ శాంతి బహుమతికి ఆయన అర్హుడేనని తేల్చిచెప్పింది. అయితే నాలుగురోజుల క్రితం ట్రంప్ పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు వైట్‌హౌస్‌లో విందు ఇచ్చిన సంగతి తెలిసిందే. ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఆ సమయంలో అసిమ్ మునీర్ విజ్ఞప్తి చేశారు. తాజాగా పాక్ ప్రభుత్వం అధికారికంగా దీనిపై ప్రకటన చేసింది. భారత్–పాక్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సమయంలో డొనాల్డ్ ట్రంప్ వ్యూహాత్మకంగా వ్యవహరించారని, ఇరు దేశాలతో మాట్లాడి శాంతికోసం కృషి చేశారని పేర్కొంది. అణ్వస్త్రాలు కలిగిన రెండు దేశాల మధ్య యుద్ధం జరగకుండా నివారించారని కొనియాడింది. భారత్–పాక్ మధ్య అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణకు ట్రంప్ చొరవే కారణమని తెలిపింది. మరి ఇప్పుడు అదే ట్రంప్.. ఇరాన్‌పై దాడులకు దిగడంతో పాకిస్తాన్ ఉలిక్కిపడింది. కొన్ని దేశాల మధ్య శాంతి ఒప్పందానికి ట్రంప్ కారణమయ్యారని నిన్న, మొన్నటి దాకా భావించిన పాక్.. ఇరాన్‌పై అమెరికా యుద్ధాన్ని ఖండించింది. ట్రంప్ నోబెల్ శాంతి పురస్కారానికి అర్హుడని అనుకున్న వేళ.. ఆయన ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధం కావడంతో ఇలా జరిగేందటనే భావనలో పడింది పాక్. తమకేదో సాయం చేశాడని నోబెల్‌కు సిఫార్సు చేద్దామనుకుంటే.. ట్రంప్ ఇలా చేశారేంటని అనుకోవడం ఇప్పుడు పాక్ వంతైంది. తాము ఓ అధికార ప్రకటన చేసిన రోజు వ్యవధిలోనే ట్రంప్ 'ఎంత పని చేశారు' అని తలలు పట్టుకోవడే తప్పితే ఏమీ చేసేది లేకుండా పోయినట్లైంది పాక్ పరిస్థితి.




## క్లాస్‌రూంలో గురకపెట్టి నిద్రపోయిన టీచర్..

**జాల్నా:** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి సన్మార్గంలో నడిపించాల్సిన ఓ టీచర్ తరగతి గదిలోనే విద్యార్థులం దరూ ఉండగానే నిద్రపోయిన ఘటన మహారాష్ట్రలో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా.. అధికారులు విచారణకు ఆదేశించారు. మహారాష్ట్రలోని జాల్నా జిల్లా గడేగావన్ గ్రామంలో ఉన్న మరాఠీ మీడియం జిల్లా పరిషత్ పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వీకే ముండే.. ఇటీవల తరగతి గదిలో సుమారు 15 నుంచి 20 మంది విద్యార్థులు పాఠాలు చదువుకుంటుండగా, ఆయన కుర్చీలో వెనక్కి వాలి.. కాళ్లు బల్లపై పెట్టి గురక పెడుతూ సుమారు 30 నిముషాలు గాఢ నిద్రలో మునిగిపోయారు. ఈ దృశ్యాన్ని ఓ వ్యక్తి వీడియో తీసి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడంతో సంచలనం సృష్టించింది. "మాస్టారు ఎంతసేపటి నుంచి నిద్రపోతున్నారు? ఓ విద్యార్థిని అడగ్గా.. అర గంట నుంచి అంటూ సమాధానం ఇవ్వడం వీడియోలో వినిపిస్తోంది. కాసేపటికి ఆ ఉపాధ్యాయుడు ఒళ్లు విరుచుకుంటూ నిద్ర లేచాడు. ఈ ఘటనపై జోనల్ విద్యాధికారి సతీష్ షిండేకు ఫిర్యాదు అందగా.. ఆయన స్పందిస్తూ.. సంఘటనపై విచారణ జరిపిస్తామని.. వాస్తవాలు తేలిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# విద్యా, వైద్యం, వ్యవసాయం ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత

- అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి
- రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా చర్యలు చేపట్టాలి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదివారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియం హాల్లో నిర్వహించిన సమీక్షలో పెద్దపెల్లి జిల్లా నుంచి మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సమీక్షలో వర్షాభావ పరిస్థితులు, క్రాప్ బుకింగ్, సాగు వివరాలు, విత్తనాలు, ఎరువుల లభ్యత, రైతు భరోసా, ఆయిల్ పామ్ సాగు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, గ్రౌండింగ్ జరిగిన ఇండ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, బడి బాట, మధ్యాహ్న భోజనం, తదితర అంశాల గురించి సుదీర్ఘంగా చర్చించారు. మన పెద్దపల్లి జిల్లా నుంచి విద్యాశాఖ అధికారి డి మాధవి, వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటి పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాబోయే 3.5 సంవత్సరాల వ్యవధిలో సాచురేషన్ పద్ధతిలో నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేల దృష్టిలో ఉన్న నిరుపేదల జాబితాను కలెక్టర్ లకు అందిస్తే ఇందిరమ్మ కమిటీ లో ద్వారా స్క్రూటినీ చేయించి, అర్హులైన నిరు పేదలైతే పార్టీలకతీతంగా తప్పనిసరిగా మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పెద్దపెల్లి జిల్లాలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కార్యాచరణ చేపట్టిందని, అవసరమైన డిజైన్ డిపిఆర్ రూపకల్పన పనులు జరుగుతున్నాయని అన్నారు

రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరికంటే రెండింతల ఆదాయం వచ్చే పంటలను రైతులకు సూచించాలని, రైతులను ఒప్పిస్తూ కూరగాయల పంట విస్తరణ చేయాలని అన్నారు. కల్తీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి హెచ్చరించారు. విద్యా, వైద్యం, వ్యవసాయం ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంచేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు, విద్యాశాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులకు అవసరమైన బోధన శిక్షణ కూడా అందించడం జరుగుతుందని అన్నారు. బడి బాట కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు, మౌలిక సదుపాయాల కల్పన పట్ల స్థానిక ఎమ్మెల్యేలు ఇతర ప్రజా ప్రతినిధులతో కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాలో రివ్యూ నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. కరీంనగర్ లో ఉన్న జ్యోతి బా పూలే గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించి అక్కడ పరిస్థితుల పై నివేదిక అందించాలని మంత్రి ఆదేశించారు.



# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

**వేములవాడ (జనంసాక్షి):** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తర లివచ్చిన భక్తులు ఆలయ కల్యాణకట్ట లో తల నీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని తరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు.



# కౌశిక్ రెడ్డి ఒక రాజకీయ జోకర్

- బెదిరింపు కేసుకు, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్

**హుజురాబాద్, జూన్ 22 (జనంసాక్షి) :** హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్దే తమ ప్రధాన లక్ష్యమని,ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా పరిష్కారం చూపిస్తున్నామని,భవిష్యత్ లో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.ఆదివారం రోజున హుజురాబాద్ పట్టణ పరిధిలోని దమ్మక్కపేటలో 20లక్షలతో చేపట్టిన పైప్ లైన్ పనులను ప్రారంభం చేశారు.అనంతరం ప్రణవ్ మీడియాతో మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబానికి తొత్తులుగా మారిన వ్యక్తులు ఎవరు తప్పు చేసిన ఆది ఒప్పు అన్నట్టుగా కేటీఆర్,హరీష్ రావు మాట్లాడడం సిగ్గుచేటని,అసలు కేసు ఎందుకు అయ్యిందో బీఆర్ఎస్ నాయకులు గమనించాలని అన్నారు.ఒక గ్రానైట్ వ్యాపారిని బెదిరించి 50 లక్షల రూపాయలు ఇస్తావా,చస్తావా అని బెదిరిస్తే వ్యాపారి భార్య సుబేదారి పోలీసు స్టేషన్ లో కేసు పెడితే పోలీసులు కేసు నమోదు చేశారనీ,ఏదో ఉద్యమం చేసి రిలీజ్ అయిన వ్యక్తిలాగా సోషల్ మీడియాలో కౌశిక్ రెడ్డి బిల్డప్ ఇవ్వడం చూస్తే ప్రజలు నవ్వుకుంటున్నారని, ఎలాంటి తప్పు చేయకపోతే ముందస్తు బెయిల్ కు ఎందుకు వెళ్లాడనీ?ఒక ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి చిల్లర వీధిరౌడీలాగా,రాజకీయ జోకర్ లాగా ప్రవర్తించడం సిగ్గుచేటని అన్నారు.మహిళ ఫిర్యాదు చేస్తే ఆ కేసు మీకు ఫాల్తు కేసులాగా కనపడుతుందా అని కేటీఆర్,హరీష్ రావు ను ప్రశ్నించారు.ఇదే కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు 25 లక్షలు ఇచ్చాను అని వ్యాపారి చెప్పింది నిజం కాదా అని,నియోజకవర్గంలో అనేక మందిని ఇబ్బందులకు గురి చేసింది కౌశిక్ రెడ్డి,స్వయంగా బాధితులే ప్రెస్ మీట్ పెట్టి చెప్పారనీ,ఇంకోసారి కౌశిక్ రెడ్డి స్థాయికి మించిన మాటలు మాట్లాడితే గ్రామాల్లో తిరగనియ్యమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ,మండల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నాయకులు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.





# జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను అందజేస్తాం



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 22 (జనం సాక్షి) :** నిజామాబాద్ జర్నలిస్టులకు నగరంలో నివాస యోగ్యం కలిగిన స్థలాలు నూటికి నూరు శాతం అందజేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తో విపులంగా చర్చించామని వారు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నెలలో ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని మహేశ్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ వెల్లడించారు. హైదరాబాద్ కు వచ్చి జర్నలిస్ట్ బృందం కలిసిన తర్వాత ఇండ్ల స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. ఆదివారంనాడు ఛలో హైదరాబాద్ టీమ్ ఆధ్వర్యంలో యూనియన్లకు అతీతంగా జర్నలిస్టు నాయకులు నిజామాబాద్ లో మహేష్ గౌడ్, షబ్బీర్ అలీని గౌరవ పూర్వకంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు ఐ న్యూస్ పంచారెడ్డి శ్రీకాంత్, బిగ్ టీవీ కత్తుల రాజేష్, సుబాష్ వాగ్మరే, విజయ క్రాంతి, ప్రమోద్ గౌడ్, పాకాల నర్సింలు, 99టీవీ మండే మోహన్, వి6 రజనీకాంత్, మేఘ 9 విఘ్నేష్ ఎన్ టీవీ బాల కుమార్, టీవీ 9 దివాకర్, పి.టీ.ఐ ఆనంద్ పాల్, బి.ఆర్.కే.ధనుంజయ్, ఇండియన్ ఎక్స్ ప్రెస్ శాస్త్రి, జమాల్పూర్ గణేష్ , క్రైం మధు, కబురు శివ కుమార్, దిశ ఆడెపు శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ కోశాధికారి సందీప్, ఉపాధ్యక్షుడు ఆంజనే యులు, గోవింద్ రాజ్, మహమ్మద్ గౌస్, కొట్టూర్ శ్రీనివాస్, మల్లెపూల నర్సయ్య, సంగీత, అనిత, రవిబాబు, కట్ట సతీష్, యాసిన్, ఉస్మాన్, రవుఫ్, ఫరూక్, సాజిద్, కె. రవికుమార్. సదానంద్, అజ్మత్, జైపాల్, డాక్టర్ శ్రీనివాస్, శ్రీధర్, సురేందర్ గౌడ్ తో పాటు వీడియో, ఫోటో జర్నలిస్టులు పాల్గొన్నారు.





# దశాబ్దాల గిరిజనుల కల నెరవేరింది

**జగన్నాథపూర్ వంతెన నిర్మాణానికి 17.50 కోట్ల నిధులు**

**రాయికల్ జూన్ 22(జనం సాక్షి):** జగన్నాథపూర్, బోర్నపల్లి వంతెన నిర్మాణం గిరిజనుల దశాబ్ద కలవని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి అన్నారు. రాయికల్ మండలం జగన్నాథపూర్,బోర్నపల్లి గ్రామాలను కలుపుతూ వంతెన నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి వినతి పత్రం అందించగా బ్రిడ్జ్,రహదారి నిర్మాణానికి 17.50 కోట్ల నిధులు మంజూరుకు జీ ఓ 207 ఉత్తర్వులు జారీ చేయడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆదివారం రాయికల్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేక శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్,మాజీ మంత్రి జీవన్ రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ... రాయికల్ మండలంలోని నూరు శాతం గిరిజన ప్రాంతమైన జగన్నాథపూర్ గ్రామ ప్రజలు ఏళ్ల తరబడి వంతెన నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారని,జగన్నాథ్ పూర్ బోర్నపల్లి వంతెన నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేయడంతో దశాబ్దాల గిరిజనుల కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు.వంతెన నిర్మాణంతో పాటు గిరిజన ఆవాస ప్రాంతాల వరకు బీటి రోడ్డు ఏర్పాటు చేయనున్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం 8 సంవత్సరాల క్రితం బ్రిడ్జ్ నిర్మిస్తానని హామీ ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం అన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితోపాటు,మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ కు మాజీ మంత్రి జీవన్ రెడ్డిలకు రాయికల్ మండల ప్రజలు,గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ గౌడ్,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షాకీర్,హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, యూత్ కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు ఏలేటి జలంధర్ రెడ్డి, బత్తిని నాగరాజు, నాయకులు ఎద్దండి భూమారెడ్డి, కొయ్యేడి మహిపాల్ రెడ్డి, బాపురపు నర్సయ్య, బత్తిని భూమయ్య, వాసం దిలీప్, కోడిపెల్లి ఆంజనేయులు,పరాచ శంకర్, ఉప్పు లక్ష్మణ్, పెందూరు మారుతి, కొమ్ముల ఆదిరెడ్డి,కడకుంట్ల నరేష్, అశోక్, మోబిన్, మంద రమేష్,రాకేష్ నాయక్, తలారి రాజేష్, రాజారెడ్డి, బాపురపు రాజీవ్, జక్కుల సాగర్, శివ, రాజేష్, ఆనంద్, సంతోష్, భూమయ్య, రాజేందర్, రవీందర్, రమేష్, ప్రసాద్, సాయి, శ్రీనివాస్, జగన్నాథపూర్, బోర్నపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

మల్హార్, జూన్ 22(జనంసాక్షి)
భూపాలపల్లి జిల్లా మాలహార్ రావు మండల పరది లోని కిషన్ రావు గ్రామం లో ఆదివారం రోజున అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం అయింది. గ్రామానికి చెందిన కాగితపు బాపు కు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలి పోయింది. బాపు వృత్తిపరంగా వడ్రంగి పని చేస్తూ జీవనోపాధి పొందూచు జీవిస్తున్న బాపు పనిముట్లు పూర్తిగా కాలిపోయాయి.వారి కుటుంబానికి ప్రభుత్వం పరంగా ఆర్థిక సహాయం చెయ్యాలని బాధితులు కోరుచున్నారు.

# పోలీసులకు కూడా క్రీడలు అవసరమే

**నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 22 (జనం సాక్షి) :** పోలీసులకు కూడా మానసిక ఉల్లాసం ఉండాలంటే క్రీడలు అవసరమేనని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్ పట్టణంలోని పోలీస్ మైదానంలో అన్ని విభాగాలైన నిజామాబాద్ సబ్ డివిజన్, ఆర్మూర్ సబ్ డివిజన్, బోధన్ సబ్ డివిజన్, ఆర్మడ్ రిజర్వ్ విభాగం , అలైడ్ బ్రాంచులు, హెూమ్ గార్డ్స్ విభాగం మొదలగు విభాగాలకు పోలీస్ క్రికెట్ మ్యాచ్ లు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ప్రజా రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ క్రీడలను మరిచిపోతున్నారని, కానీ పోలీసులకు కూడా క్రీడలు ఎంతో అవసరమని అయన అన్నారు. పోలీసు సిబ్బంది నిత్యం ఒత్తిడిలో ఉంటూ విధులు నిర్వహిస్తూ ఉంటారని, వారికి క్రీడలు ఎంతో మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని, స్పోర్ట్స్ లో పాల్గొని రిఫ్రెష్ అయిన పోలీసులు తిరిగి మరింత ఉత్సాహంతో విధుల్లో బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. సమయం దొరికినప్పుడు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. పోలీసులు ఉద్యోగ వృత్తిలో ఎంతో బిజీగా గడుపుతామని, క్రీడలు జీవితంలో మానసిక ఒత్తిడిలను తట్టుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో చాలా బాగా రాణిస్తున్నారని, క్రీడాకారులు అందరిలో స్కిల్స్ టాలెంట్ బాగా ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి ప్రజల కోసం పనిచేయాలని, ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ముందు ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో నిజామాబాద్ కమిషనరేట్ కు మంచి పేరు తీసుకురావాలి ఆకాంక్షించారు. ఈ క్రికెట్ మ్యాచ్ రెండు రోజులు నిర్వహించడం జరుగుతుందని క్రీడాకారులు అయినటువంటి పోలీస్ సిబ్బంది చక్కగా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఇట్టి క్రికెట్ మ్యాచ్ ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నిజామాబాదు అదనపు పోలీస్ కమీషనర్ ( అడ్మిన్ ) బస్వా రెడ్డి, అదనపు పోలీస్ కమీషనర్ చందర్ రావ్, నిజామాబాద్ రాజా వెంకట్ రెడ్డి, బోధన్ పి.శ్రీనివాస్, ఆర్మూర్ జె. వెంకటేశ్వర్ రెడ్డి లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


**బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో**

# బడులకు తాళం




**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 22 (జనం సాక్షి) :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ నియోజకవర్గం సోమవారం మరో హల్‌చల్ కు వేదిక కానుంది. బాన్సువాడ నియోజక వర్గంలో మన ఊరు మన బడి పథకం కింద చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని నిరసిస్తూ నేడు నియోజక వర్గంలోని అన్ని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలకు తాము తాళం వేయనున్నట్లు సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సత్తిబాబు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈ సందర్భంగా అయన ప్రభుత్వం ఇదిగో నిధులున్నాయి అని తమతో చెప్పి తీరా పనులన్నీ చేయించుకొని ఇప్పుడు పైసలు లేవని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. గత రెండు సంవత్సరాల నుండి విడుదలను విడుదల చేయకుండా ఆపివేసిన బకాయిల కోసం అధికారుల చుట్టు, రాజకీయ నాయకుల చుట్టూ తిరిగినప్పటికి ప్రయోజనం లేదన్నారు. అందుకే మన ఊరు మన బడి పథకం కింద పనులు జరిగిన అన్ని పాఠశాలలకు తాళం వేయడం జరుగుతుందని, ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు పాఠశాలలు తెరవబడవని ఖరాఖండిగా తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలా పరిష్కారం చూపుతారో చూడాల్సిందే.





# నంబరు ప్లేట్‌లేని ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా

**అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**

**జమ్మికుంట, జూన్ 22 (జనంసాక్షి):** జమ్మికుంట మండల పరిధిలోని విలాసాగర్, కొండపాక గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా మళ్లీ వేగం పుంజుకుందని,నంబరు ప్లేట్‌లను తొలిగించిన ట్రాక్టర్ల ద్వారా పట్టపగలే పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దందా స్థానికుల కళ్లకు కన్పిస్తున్నా, సంబంధిత అధికారులకు స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తుందని, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోకపోవడం తో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఈ అక్రమ వ్యాపారానికి మద్దతుగా ఎవరెవరు ఉన్నారో బయటపెట్టి, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఇసుక మాఫియాను అడ్డుకునేందుకు సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని, నంబరు ప్లేట్‌లు లేని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# స్థానిక ఎన్నికలకు ఇంకా సమయం పడుతుంది

**టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 22 (జనంసాక్షి) :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడుతుందని ఇటీవల పలువురు మంత్రులు ప్రకటనలు చేసినప్పటికీ, నెలాఖరులో షెడ్యూల్ విడుదల చేసి వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహిస్తారని ప్రచారం జరిగినప్పటికీ, మొదటగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి ప్రకటించినప్పటికీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్కుమార్ గౌడ్ మాత్రం ఈ విషయంపై కీలక వ్యాఖ్యలు చేసి ఔరా అనిపించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ఇంకా ఏ నిర్ణయం జరగలేదని, ఇంకా సమయం పడుతుందని ఆదివారం నిజామాబాద్ లో తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలపై మంత్రివర్గంలో చర్చించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం ప్రకటిస్తామన్నారు. ఈ నెల 16న జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే స్థానిక ఎన్నికలపై చర్చించి ప్రకటన చేస్తారని ప్రచారం జరిగగా ఆ రోజు ఎలాంటి ప్రకటన వెలువడలేదని అన్నారు. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పడంతో ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. సీఎం రేవంత్రెడ్డి అధ్యక్షతన సోమవారం మంత్రివర్గ సమావేశం జరగనుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్ పై ఈ సమావేశంలో చర్చించనున్నారని, గోదావరి జలాలను అక్రమంగా తరలిస్తే ఊరుకోమని ఇటీవల సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారని, అలాగే బనకచర్లకు అనుమతి ఇవ్వొద్దని ఆయన ఢిల్లీకి వెళ్లి కేంద్ర జలశక్తి మంత్రిని కూడా కోరారన్నారు. అయితే సోమవారం నిర్వహించే కేబినెట్ మీటింగ్లో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ ఉంటుందా లేదా అనే దానిపై స్పష్టత లేదన్నారు. తమ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిందని, ఈ మేరకు కులగణన చేసి బీసీ రిజర్వేషన్ల బిల్లులను అసెంబ్లీలో ఆమోదించిందన్నారు. ఆ బిల్లులను కేంద్రానికి పంపితే కేంద్రం నుంచి వాటికి ఇంకా అనుమతులు రాలేదన్నారు. దీంతోనే స్థానిక ఎన్నికల ప్రక్రియ ఆలస్యం అవుతున్నట్లు అయన పేర్కొన్నారు. ప్రభుత్వం మాత్రం ఎన్నికలపై ఎలాంటి ప్రకటన చేయడం లేదని, తాజాగా పీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ మరింత ఆలస్యం అయ్యేలా కనిపిస్తోందని పలువురు చర్చించుకోవడం గమనార్హం.

# బుమ్రాయజాలం

## జస్ప్రీత్‌కు ఐదు వికెట్లు..

- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 465 ఆలౌట్
- భారత్‌కు స్వల్ప ఆధిక్యం!



హెడింగ్లీ టెస్టులో భారత పేసర్ల ధాటికి ఇంగ్లండ్ జట్టు కుప్పకూలింది. జస్ప్రీత్ బుమ్రా (5-83) సంచలన బౌలింగ్‌తో రెండో సెషన్‌లోనే ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 465 పరుగులకు ముగించింది. ప్రసిధ్ కృష్ణ (3-128) కీలక వికెట్లతో ఇంగ్లండ్‌ను కట్టడి చేయగా, బుమ్రా టెయిలెండర్లను పెవిలియన్‌కు పంపాడు. దీంతో భారత్‌కు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. టీ బ్రేక్ తర్వాత టీమిండియా తమ రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించనుంది.

భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజు రసవత్తరంగా సాగింది. తొలి సెషన్‌లో ఓలీ పోప్ (106)ను ఔట్ చేసిన ప్రసిధ్ కృష్ణ ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. హ్యారీ బ్రూక్ (99) మరియు కెప్టెన్ బెన్ స్టోక్స్ (20) జట్టు స్కోర్‌ను 300 దాటించారు. అయితే, 82 పరుగుల వద్ద గల్లీలో యశస్వీ జైస్వాల్ జారవిడిచిన క్యాచ్‌తో బతికిన బ్రూక్, సెంచరీకి ఒక్క పరుగు దూరంలో ఉండగా ప్రసిధ్ బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఈ వికెట్‌తో 49 పరుగుల ఏడో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రిస్ వోక్స్ (38), బ్రైడన్ కార్సే (22) బౌండరీలతో 8వ వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఈ జోడీని మహ్మద్ సిరాజ్ విడదీశాడు. ఆ తర్వాత బుమ్రా వోక్స్‌ను బౌల్డ్ చేసి, జోష్ టంగ్ (11)ను క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. భారత బౌలర్లలో బుమ్రా 5 వికెట్లతో విజృంభించగా, ప్రసిధ్ 3 వికెట్లు పడగొట్టాడు.

అండర్సన్, తెండుల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలోనే మూడో రోజు టీ విరామం ప్రకటించారు. 327/5తో రెండో సెషన్ ను మొదలు పెట్టిన ఇంగ్లిష్ జట్టు మరో 138 పరుగులు జోడించి ఐదు వికెట్లు కోల్పోయింది. హ్యారీ బ్రూక్ (99* 112 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్క పరుగుతో సెంచరీ మిస్ చేసుకున్నాడు. శతకం ముంగిట బ్రూక్ని ప్రసిద్ధ ఔట్ చేశాడు. జేమీ స్మిత్ (40* 52 బంతుల్లో 3 ఫోర్లు), క్రిస్ వోక్స్ (38బీ 55 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సు) కీలక పరుగులు చేశారు. బెన్ స్టోక్స్ (20), బ్రైడన్ కార్స్ (22), జోష్ టంగ్ (11) పరుగులు చేశారు.

రెండో రోజు సెంచరీ హీరో ఓలీ పోప్ (106* 137 బంతుల్లో 14 ఫోర్లు) మూడో రోజు ఆట మొదలైన కాసేపటికే పెవిలియన్ చేరాడు. రెండో రోజే బెన్ డకెట్ (62) అర్ధ శతకం చేసిన సంగతి తెలిసిందే. భారత బౌలర్లలో బుమ్రా (5/83), ప్రసిద్ధ కృష్ణ 3, సిరాజ్ 2 వికెట్లు పడగొట్టారు. ఫస్ట్ ఇన్నింగ్స్ టీమ్ఇండియా 471 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. మొదటి ఇన్నింగ్స్లో భారత్ కు 6 పరుగుల ఆధిక్యం లభించింది.

### సెంచరీ చేజార్చుకున్న బ్రూక్

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టిన హ్యారీ బ్రూక్ (99) సెంచరీకి ఒక్క పరుగు దూరంలో ఔటయ్యాడు. ప్రసిధ్ బౌలింగ్‌లో షార్ట్ బంతిని నియంత్రణ లేకుండా ఆడి శార్దూల్‌కు క్యాచ్ ఇచ్చాడు. లంచ్ తర్వాత బ్రూక్, జేమీ స్మిత్ (40)లు బౌండరీలతో జట్టు స్కోర్‌ను పరుగెత్తించారు. అయితే, స్మిత్ కొట్టిన షాట్‌ను రవీంద్ర జడేజా మరియు సాయి సుదర్శన్ కలిసి బౌండరీ వద్ద అద్భుతంగా అందుకున్నారు. బ్రూక్ సెంచరీ దిశగా దూసుకెళ్తుండగా, ప్రసిధ్ తెలివిగా వేసిన బంతికి ఔటై, నిరాశతో వెనుదిరిగాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ 6 పరుగుల వెనుకబడి ఉంది, భారత్ రెండో ఇన్నింగ్స్‌లో ఆధిక్యాన్ని పెంచేందుకు సిద్ధమవుతోంది.



# సీఎం పదవిచ్చినా.. రాజకీయాల్లోకి రాను

## సౌరభ్ గంగూలీ షాకింగ్ వ్యాఖ్యలు!



మాజీ క్రికెటర్లు సాధారణంగా రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వెళ్లడం లేదా కోచింగ్ బాధ్యతలు చేపట్టడం సర్వసాధారణం. అంతర్జాతీయంగా చాలామంది మాజీ క్రీడాకారులు ఇదే మార్గాన్ని ఎంచుకుంటారు. రాజకీయాల్లో మంత్రి లేదా ముఖ్యమంత్రి పదవి దక్కే అవకాశం వస్తే ఎవరైనా సంతోషంగా అంగీకరిస్తారు. కానీ, టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ మాత్రం రాజకీయాలపై తనకు ఏమాత్రం ఆసక్తి లేదని స్పష్టం చేశాడు. తాజాగా ఒక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయనను రాజకీయాల్లోకి వెళ్తారా లేక టీమిండియా కోచ్‌గా మారతారా అని ప్రశ్నించగా, దాదా ఆసక్తికర సమాధానాలు ఇచ్చాడు.వచ్చే ఏడాది బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, మాజీ క్రికెటర్‌గా, బీసీసీఐ మాజీ అధ్యక్షుడిగా ప్రజాదరణ పొందిన గంగూలీ రాజకీయాల్లోకి అడుగుపెడతాడనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ ప్రశ్నకు సమాధానంగా దాదా, తనకు రాజకీయాలపై ఆసక్తి లేదని, ఏ పార్టీలోనూ చేరే ఉద్దేశం లేదని తేల్చిచెప్పాడు. అయితే, క్రికెట్ కోచింగ్‌పై మాత్రం ఆసక్తి ఉందని, మహిళల క్రికెట్ అభివృద్ధికి కృషి చేయాలనుకుంటున్నానని పేర్కొన్నాడు. అవకాశం దొరికితే భారత క్రికెట్‌ను కొత్త శిఖరాలకు చేర్చేందుకు కోచ్‌గా పనిచేయడానికి సిద్ధమని గంగూలీ వెల్లడించాడు."నేను క్రికెట్‌కు వీడ్కోలు చెప్పి దాదాపు 25 ఏళ్లు అవుతోంది. ఆ తర్వాత బీసీసీఐ అధ్యక్షుడిగా పనిచేశాను. ఇప్పటికీ భారత క్రికెట్‌కు మరింత సేవ చేయాలనే ఆలోచన ఉంది. నాకు ఇప్పుడు 50 ఏళ్లు. కోచింగ్ బాధ్యతలు చేపట్టడానికి నేను సిద్ధంగా ఉన్నాను. కానీ, భవిష్యత్తు ఏమిటో చెప్పలేం. రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. ఏ పార్టీలోనూ చేరను. ప్రతి ఏడాదీ నన్ను రాజకీయాల్లోకి రమ్మని అడుగుతుంటారు. కానీ, నా మనసు అటువైపు మళ్లడం లేదు. రాజకీయాలు అంత సులభం కాదు. ముఖ్యమంత్రి పదవి ఇస్తామన్నా నేను రాజకీయాల్లోకి రాను. అందుకే రాజకీయాలు నాకు సంబంధం లేని విషయమని భావిస్తున్నాను," అని గంగూలీ స్పష్టం చేశాడు.

**దాదా గుర్తుండిపోయే క్షణాలు**

సౌరభ్ గంగూలీ అంటే లార్డ్స్ మైదానంలో చొక్కా విప్పి విజయ గర్జన చేసిన క్షణం అభిమాను లకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అద్భుతమైన సిక్సర్లతో అలరించిన ఈ మాజీ కెప్టెన్, టీమిండియాకు సారథిగా దూకుడు స్ఫూర్తిని నింపాడు. రిటైర్మెంట్ తర్వాత బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఆ తర్వాత బీసీసీఐ అధ్యక్షుడిగా సేవలందించాడు. అనంతరం ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు రెండు దఫాలుగా టీమ్ డైరెక్టర్‌గా వ్యవహరించాడు.

# పసికూనపై సూపర్ విక్టరీ..

**కెనడా విజయం.. టీ20 వరల్డ్ కప్‌కు అర్హత**



2026లో జరగనున్న పురుషుల టీ20 వరల్డ్ కప్‌కు మరో జట్టు అర్హత సాధించింది. అమెరికా రీజినల్ క్వాలిఫయర్‌లో కెనడా జట్టు బెర్తు ఖరారు చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బహమాస్‌పై సమష్టిగా రాణించిన నికోలస్ కిర్టన్ బృందం అద్భుత విజయం సాధించి, మెగా టోర్నీలో 13వ జట్టుగా చోటు దక్కించుకుంది. అమెరికా రీజినల్ ఫైనల్‌లో కెనడా జట్టు బహమాస్‌ను కేవలం 57 పరుగులకే కట్టడి చేసింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని కెనడా బ్యాటర్లు కేవలం 5.3 ఓవర్లలోనే ఛేదించారు. ఈ లీగ్‌లో వరుసగా నాలుగు విజయాలు సాధించిన కెనడా, వరల్డ్ కప్ బరిలో స్థానం సుస్థిరం చేసుకుంది.2026 టీ20 వరల్డ్ కప్‌కు భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇప్పటికే 12 జట్లు ఈ టోర్నీకి అర్హత సాధించాయి. భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్ జట్లు ఇందులో ఉన్నాయి. మిగిలిన ఏడు స్థానాల కోసం పోటీ జరుగుతోంది. యూరోపియన్ క్వాలిఫయర్ నుంచి రెండు జట్లు, ఆఫ్రికా క్వాలిఫయర్ ఫైనల్‌లోని రెండు జట్లు, ఆసియా యూఏపీ క్వాలిఫయర్‌లో టాప్-3 జట్లు వరల్డ్ కప్‌కు అర్హత పొందనున్నాయి.



# స్వర్ణముత్యం

## వెటరన్ మాధ్యూకు బంగారు పతకం

**భారత్‌కు తొలి రోజే నాలుగు పతకాలు..**

బీజింగ్‌లో జరుగుతున్న పారా పవర్ లిఫ్టింగ్ వరల్డ్ కప్‌లో భారత బృందం ఘనమైన ప్రారంభం సాధించింది. తొలి రోజే ఒక స్వర్ణం, ఒక రజతం, రెండు కాంస్య పతకాలతో భారత జెండాను రెపరెపలాడించారు లిఫ్టర్లు. వెటరన్ లిఫ్టర్ జాబీ మాథ్యూ అద్భుత ప్రదర్శనతో భారత్ ఖాతాలో స్వర్ణం చేర్చాడు. తొలి ప్రయత్నంలో విఫలమైనప్పటికీ, వరుసగా 145 కిలోలు, 150 కిలోలు ఎత్తి పసిడి పతకం సాధించాడు. ఆదివారం ప్రారంభమైన పోటీల్లో గుల్ఫమ్ అమీద్ దేశానికి తొలి పతకం అందించాడు. పురుషుల 59 కిలోల విభాగంలో 145 కిలోలు ఎత్తి కాంస్య పతకం గెలుచుకున్నాడు. అదే ఉత్సాహంతో 72 కిలోల కేటగిరీలో పోటీపడిన రాముభాయ్ బంభవ తొలి ప్రయత్నంలో 151 కిలోలు ఎత్తాడు. తదుపరి రెండు ప్రయత్నాల్లో 155 కిలోలు, 156 కిలోలు ఎత్తినప్పటికీ అవి పరిగణించబడలేదు. అయినప్పటికీ, అతడు కాంస్య పతకం సాధించాడు. చైనా ఆతిథ్యమిచ్చే ఈ పారా వరల్డ్ కప్‌లో 40 దేశాల నుంచి లిఫ్టర్లు పాల్గొంటున్నారు. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచినవారు 2026 వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, 2028 పారాలింపిక్స్‌లకు అర్హత సాధిస్తారు. ఈ లక్ష్యంతో భారత లిఫ్టర్లు పూర్తి శక్తితో భారీ బరువులు ఎత్తేందుకు సిద్ధంగా ఉన్నారు.

# ఇంగ్లండ్ మాజీ పేసర్ డేవిడ్ లారెన్స్ కన్నుమూత



ఇంగ్లండ్ క్రికెట్ ఒక దిగ్గజ ఆటగాడిని కోల్పోయింది. మాజీ పేసర్ డేవిడ్ వాలెంటైన్ లారెన్స్, అరుదైన మోటార్ న్యూరాన్ డిసీజ్‌తో బాధపడుతూ, 61 ఏళ్ల వయసులో ఆదివారం తుదిశ్వాస విడిచాడు. ఈ వ్యాధితో దీర్ఘకాలం పోరాడిన లారెన్స్ మరణం పట్ల ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు గాఢమైన సానుభూతిని తెలియజేసింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. మోటార్ న్యూరాన్ డిసీజ్ అనేది ప్రాణాంతకమైన న్యూరలాజికల్ వ్యాధి, ఇది కండరాలను బలహీనపరిచి, కొన్ని నెలలు లేదా సంవత్సరాల్లో తీవ్రమవుతుంది. ఈ వ్యాధి కారణంగా చక్రాల కుర్చీకి పరిమితమైన లారెన్స్, చివరి రోజుల్లో నడవలేకపోయాడు, మాట్లాడే సామర్థ్యాన్ని కూడా కోల్పోయాడు.1964 జనవరి 28న జమైకా తల్లిదండ్రులకు గ్లౌసెస్టర్‌లో జన్మించిన లారెన్స్, 17 ఏళ్ల వయసులో గ్లౌసెస్టర్‌షైర్ తరఫున 1981లో ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 170 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లలో 477 వికెట్లు తీసి, సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. అతని వేగవంతమైన బౌలింగ్ శైలి అతడిని 1988లో ఇంగ్లండ్ జట్టులోకి తీసుకొచ్చింది. 1988 నుంచి 1992 వరకు ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన లారెన్స్, 18 వికెట్లు సాధించాడు. 1991లో వెస్టిండీస్‌పై ది ఓవల్‌లో 5/106 వికెట్ల ప్రదర్శనతో అతను గుర్తుండిపోయాడు, ఈ మ్యాచ్‌లో లెజెండరీ బ్యాటర్ వివ్ రిచర్డ్స్‌ను ఔట్ చేసిన ఘనత కూడా ఆయనదే.

అయితే, 1992లో న్యూజిలాండ్‌లోని వెల్లింగ్‌టన్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో బౌలింగ్ సమయంలో లారెన్స్ ఎడమ మోకాలి ఎముక (పటెల్లా) విరిగిపోయింది. ఈ గాయం అతని అంతర్జాతీయ కెరీర్‌ను అకాలంగా ముగించింది. ఈ ఘటన గుండెల్ని పిండేసేలా ఉందని, ఆయన మోకాలు విరిగిన శబ్దం మైదానం అంచుల వరకు వినిపించిందని ప్రేక్షకులు వర్ణించారు.

లారెన్స్ 2023లో మోటార్ న్యూరాన్ డిసీజ్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. ఈ వ్యాధితో పోరాడుతూ, అతను అవగాహన కోసం నిధుల సేకరణలో చురుకుగా పాల్గొన్నాడు. 2025లో కింగ్స్ బర్త్‌డే హానర్స్‌లో అతనికి గౌరవం లభించింది. అలాగే, గ్లౌసెస్టర్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్‌లో 2022లో మొదటి బ్రిటిష్-జన్మించిన బ్లాక్ ప్రెసిడెంట్‌గా నియమితుడై, క్రికెట్‌లో వైవిధ్యం మరియు సమ్మిళనానికి గట్టి వాదిగా నిలిచాడు. లారెన్స్ కుటుంబం విడుదల చేసిన ప్రకటనలో, "డేవిడ్ లారెన్స్ మోటార్ న్యూరాన్ డిసీజ్‌తో ధైర్యంగా పోరాడి కన్నుమూశారని తెలియజేయడం మాకు బాధాకరం. 'సిడ్' మైదానంలోనూ, జీవితంలోనూ స్ఫూర్తిదాయకమైన వ్యక్తి, ముఖ్యంగా మా కుటుంబానికి అత్యంత ప్రియమైనవాడు," అని పేర్కొన్నారు.

**టీమ్ఇండియా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లి ఇటీవల టెస్టులకు వీడ్కోలు పలికారు. గతంలోనే వీరిద్దరూ టీ20 ప్రపంచకప్ నెగ్గిన సమయంలో పొట్టి ఫార్మాట్కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఇక వీరికి మిగిలింది వన్డేలే. 2027 వన్డే ప్రపంచకప్ లో ఆడాలనే లక్ష్యంతోనే వీరు ఆ ఫార్మాట్లో కొనసాగుతున్నారన్న విషయం తెలిసిందే. అయితే.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వచ్చే వన్డే ప్రపంచకప్ ఆడటం సాధ్యమేనా..? ఇదే అంశంపై మాజీ కెప్టెన్, మాజీ బీసీసీఐ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ స్పందించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వచ్చే వన్డే ప్రపంచకప్ ఆడటం అంత సులభం కాదని దాదా అభిప్రాయపడ్డాడు.**

## శేరిలింగంపల్లి సర్కిల్ ఏసిపికి

# స్థానచలనం ఎప్పుడో!?

**సంవత్సర కాలంలోనే 400 అక్రమాలకు పైగా ఈయన ట్రాక్ రికార్డ్!!**

**గ్రేటర్ కమిషనర్ గారూ కాస్త కన్నెయ్యండి**



**శేరిలింగంపల్లి, జూన్ 22 (జనంసాక్షి) :** ఏళ్లుగా పాతుకుపోయి ఎక్కడికి అక్కడ అక్రమాలకు ఆద్యం పోస్తూ... కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న పలువురు జిహెచ్ఎంసి అధికారులను, ప్రత్యేకించి టౌన్ ప్లానింగ్ విభాగంలో బాగా వేసిన ఆయా సర్కిల్లో అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసిపి)లు, టిపిఎస్ లు, ఇతర అధికారులను గ్రేటర్ కమిషనర్ కర్ణన్ ఉన్నఫలంగా మార్చిన విషయం విధితమే. దీంతో స్థానచలనం జరిగిన ప్రాంతాలలో తప్పకుండా అవినీతి తగ్గి అధికారుల విధులలో పారదర్శకత పెరుగుతుందనేది స్థానిక ప్రజల అభిప్రాయం. సాధార ణంగా గ్రేడ్ వన్ అధికారులు, గెజిటెడ్ స్థాయి అధికారులు తాము పనిచేస్తున్న ప్రాంతంలో రెండు మూడు సంవత్సరాలకు మించి పనిచేయడం కష్టమే. ఎందుకంటే అప్పటికే వారు తమ విధులు, ప్రజా పాలన పరిధిలో ప్రభావితం చేయగల స్థాయికి చేరుకుంటారనేది ఉన్నతాధికారుల అభిప్రా యం. ఇందులో భాగంగానే ఎలాంటి మచ్చ లేకుండా, ప్రజల మన్ననలు అందుకుంటూ తమ విది ధర్మాన్ని నిర్వహించే అధికారులను రెండు, మూడు సంవత్సరాలు పనిచేసిన వెంటనే స్థానచలనం కల్పిస్తూ మరోచోట వారికి పోస్టింగులను కేటాయించడం పరిపాటి. ఇక అవినీతి ఆరోపణలు, లంచావదారులైన అధికారులకు ఉద్యోగం లో సస్పెన్షన్, కోర్టు తాఖీదులు, బాధ్యతల నుండి తప్పించడం వంటి ప్రత్యేక చర్యలు షరా మామూలే. ఇలాంటి అధికారులు కొన్ని సందర్భాలలో ఆరు నెలలకు మించి కూడా పనిచేయకుండానే స్థానచలనం పొందిన సందర్భాలు లేకపోలేదు.

**ఏసిపి అవినీతికి అంతే లేదు...!**

శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం ప్రధాన అధికారి అయిన ఏసిపి అవినీతికి అంతే లేకుండా పోయింది. ఈయన తలచుకుంటే రాత్రి రాత్రే ఎలాంటి భవనానికైనా అనుమతి పత్రాలు మంజూరు అవుతాయి. బేరం కుదరకపోతేమాత్రం అది ఎంత సక్రమమైనా విచారణ పేరుతో సంవత్సరాలు సాగాల్సిందే. ఈ క్రమంలో కేవలం సంవత్సర కాలం లో శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో దాదాపు 400 అక్రమ నిర్మాణాలకు రెక్కలు వచ్చి అవి వివిధ స్థాయి భవనా లుగా రూపాంతరం చెందాయంటే శేరిలింగంపల్లి ఏసిపి ఏ స్థాయిలో అవినీతిని పెంచి పోషిస్తున్నాడో ఊహి ంచవచ్చు. ఒక ఇంటి నిర్మాణానికి ప్రామాణికంగా భావించే కనీస నియమాలను సైతం పక్కనపెట్టి, ఆ మాటకొస్తే అతను సమర్పించిన ఇంటి పత్రాలు ఎంతవరకు నిజమనే క్షేత్రస్థా యి పరిశీలనను సైతం తోసిరాజని వారు అందజేసే 'ముడుపుల బరువు'ను బట్టి రోజుల వ్యవధిలో వారికి అనుమతి పత్రాలు ఇంటికి చేరిపోతుండడం ఏసిపి ఘనమైన అక్రమ చరిత్రకు నిలువెత్తు నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సదరు ఎసిపి పై ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా లతోపాటు సామాజిక మాధ్యమాలలో వందల కొద్ది అవినీతి చట్టాలు పూర్తిస్థాయి ఆధారాలతో తేటతెల్లమైనప్పటికీ శేర్లింగంపల్లి నుండి అతడిని బదిలీ చేయడంలో గ్రేటర్ కమిషనర్ కొంత నిర్లిప్తతను ప్రదర్శించడం విమర్శలకు తావిస్తోంది. శేరిలింగం పల్లిలోని చైన్ మెన్ల అండదండలతో ఏకంగా ఓ అవినీతి సామ్రాజ్యాన్ని స్థాపించి కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాను గండి కొడుతున్నా అతడిని మాత్రం శేరిలింగంపల్లి నుండి పంపించకపోవడం వెనక మతలబేంటని సామాజిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్ కమిషనర్ ఇప్పటికైనా దృష్టిని సారించి శేర్లింగం పల్లి ఏసిపి అవినీతిని బట్టబయలు చేయడంతో పాటు తక్షణమే స్థానాచల్నం కల్పించి ఆయన చిత్తశుద్ధిని చాటుకోవాలని పలువురు కోరుతున్నారు.



# భారీ కొండచిలువ పట్టివేత

**రేవల్లి, జూన్ 22 (జనంసాక్షి) :** గోపాల్ పేట మండలంలోని అస్లం కుంట చెరువు దగ్గర 13 అడుగుల పొడవు, 30 కెజీ ల కొండచిలువ, 5 ఫీట్ల పొడవు గల భారీ కొండచిలువ కనిపించింది. ఉడుమును మింగి వేస్తుండగా దాన్ని గమనించిన గ్రామానికి చెందిన కిరణ్ పంచాయతీ రాజ్ సెక్రెటరీ సాగర్ స్నేక్స్ సొసైటీ అధ్యక్షులు చీర్ల కృష్ణ సాగర్ కి సమాచారం ఇవ్వడంతో, సాగర్ తన మిత్ర బృందంతో వెంటనే గోపాల్ పేట గ్రామం లో ఉన్న అస్లకుంట చెరువు దగ్గరకు చేరుకొని, భారీ సైజులో ఉన్న కొండచిలువ ఉడుమును పూర్తిగా మింగివేసి మెల్లిగా నీటి కుంటలోకి జారుకుంటుండగా నీటి కుంటలోకి దిగి కొండచిలువను సురక్షితంగా బంధించి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే భారీ ఉడుమును మింగేసిన కొండచిలువ కడుపులో నుంచి ఉడుమును బయటికి తీసారు.

అనంతరం సాగర్ కొండచిలువను బంధించారు. అనంతరం కృష్ణ సాగర్ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఊరికి చెరువు దగ్గరగా ఉండడంతో చెరువు దగ్గరికి చిన్నపిల్లలు చాపల వేటకు వెళ్తున్నారని, చిన్నపిల్లల్ని చెరువు వైపుకు వెళ్లకుండా చూసుకోవాలని, ఇలాంటి భారీ సర్పాలు చిన్న పిల్లల్ని మింగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పాములు కనబడితే వాటి నుంచి దూరంగా జరిగి నాకు సమాచారం ఇస్తే వెంటనే వాటిని పట్టుకొని సురక్షితమైన అడవి ప్రాంతంలో వదిలివేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చిలక కుమార్ సాగర్, అవినాష్. గ్రామస్తులు కిరణ్, కుమ్మరి బాలస్వామి, భిక్షపతి, నరేందర్, కృష్ణయ్య, గ్రామస్థులు పాల్గొని కృష్ణసాగర్‌కు అభినందనలు తెలిపారు.

# ప్రతి మండలానికి రెండేసి జీపీ, అంగన్‌వాడీ భవనాలు

- మొదటి త్రైమాసికంలోనే రికార్డు స్థాయిలో స్థలాల గుర్తింపు
- త్వరలో నూతన జీపీ, అంగన్వాడీ భవనాలకు శంకు స్థాపన
- తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మంత్రి సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రతి మండలానికి రెండు గ్రామ పంచాయతీ భవనాలు, మరో రెండు అంగన్వాడీ భవనాల చొప్పున నిర్మించాలని టార్గెట్ పెట్టుకున్న తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆ దిశలో వేగంగా అడుగులు వేస్తుంది. భవనాల నిర్మాణం కోసం అవసరమైన స్థలాల గుర్తింపును వేగంగా పూర్తి చేస్తుంది. గత ఏడాది నవంబర్ లో టార్గెట్ పెట్టుకోగ..స్థలాల గుర్తింపు, అప్పగింత లో జాప్యం కారణంగా అనుకున్న స్థాయిలో భవనాల నిర్మాణాలు పూర్తి కాలేదు. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే జీపీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. మరీ ముఖ్యంగా మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ తీసుకుని భవన నిర్మాణాల కోసం స్థలాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా, ఎప్పటి కప్పుడు పంచాయతీ రాజ్ కమిషనరేట్ అధికారులు, జిల్లా డీఆర్డీఏలతో సమీక్షలు నిర్వహిస్తూ వచ్చారు. దీంతో మొదటి త్రైమాసికంలోనే గణనీకంగా భవనాల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించారు. మొత్తం ఈ ఏడాది 1148 అంగన్వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకోగా...ఇప్పటికే 813 అంగన్వాడీ భవనాల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించారు. మరో 98 చోట్ల స్థలాలను గుర్తించాల్సి ఉంది. మిగిలిన భవనాలకు సంబంధించి గతంలో భవనాల నిర్మాణం మొదలుపెట్టగా నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

ఇక జీపీ భవనాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి మండలానికి రెండు చొప్పున మొత్తం 1144 జీపీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకోగా మొదటి త్రైమాసికం ముగియక ముందే 549 గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. మిగిలిన 84 చోట్ల ఇంకా స్థలాలను గుర్తించాల్సి ఉంది. మిగిలిన గ్రామాల్లో జీపీ భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే ప్రధానంగా యాదాద్రి భువనగిరి. వికారాబాద్, సంగారెడ్డి వంటి హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలు.. ఏజెన్సీ ప్రాంతాలున్న ఆదిలాబాద్, నిర్మల్ వంటి జిల్లాల్లో స్థలాల గుర్తింపునకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీనాభివృద్ధి డైరెక్టర్ జీ సృజన జిల్లా కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడుతూ..స్థలాల గుర్తించి అప్పగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరి కొద్ది రోజుల్లో స్థల సేకరణ పూర్తవుతుందన్న నమ్మకంతో అధికారులున్నారు. జీపీ భవనాలు, అంగన్వాడీ భవనాలకు యునిక్ మోడల్ ఉండాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారి చేసారు. రాష్ట్రంలో ఎక్కడికెల్లినా ఆయా భవనాలను చూడగానే ప్రజలు అవి జీపీ భవనాలని, అంగన్వాడీ భవనాలని గుర్తించేలా ఉండేలా డిజైన్ రూపొందించాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం జీపీ భవనాలకు, అంగన్వాడీలకు వేరు వేరుగా డిజైన్లు రూపొందిస్తున్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా ఒక్కో పంచాయతీ భవన నిర్మాణ కోసం రూ. 20 లక్షలు ఖర్చు చేయనున్నారు. అదే అంగన్వాడీ భవనం కోసం ఉపాధి హామీ నిధుల ద్వారా రూ. 8 లక్షలు, 15వ ఫైనాన్స్ కమీషన్ నిధులు రూ. 2 లక్షలు, మహిళా శిశు సంక్షేమం నుంచి రూ. 2 లక్షల నిధులు మొత్తం కలిపి రూ.12 లక్షలు వెచ్చించనున్నారు. ప్రణాళిక బద్దంగా పనిచేయడం ద్వారా వచ్చే మార్చి నాటికి మొత్తం 1148 జీపీ భవనాలు, 1148 అంగన్వాడీ భవనాలను నిర్మించనుంది తెలంగాణ ప్రభుత్వం. దీంతో నూతన జీపీ భవనాలు, అంగన్వాడీ భవనాలతో పల్లెలు కొత్త రూపు సంతరించుకోనున్నాయి.

**త్వరలో జీపీ శంకుస్థాపనలు : పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క**

స్థలాల గుర్తింపు ప్రక్రియ చివరి దశలో ఉన్న నేపథ్యంలో, త్వరలో నూతన భవనాలకు శంకు స్థాపన చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. చివరి త్రైమాసికంలో భవనాల నిర్మాణాలు చేపట్టడం వల్ల పనులు పెండింగ్ లో మిగిలిపోతున్నాయన్నారు. అందుకే ఈ దఫా మొదటి త్రైమాసికంలో స్థలాల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తున్నామని, యునిక్ డిజైన్ తో త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. నూతన జీపీలు, అంగన్వాడీ భవనాల కోసం వేగంగా స్థలాలు గుర్తించడానికి కృషి చేసిన శాఖ అధికారులను, జిల్లా కలెక్టర్లను అభినందిస్తున్నట్లు తెలిపారు.

# వామపక్ష పార్టీలన్నీ ఏకం కావాలి

- సామ్రాజ్యవాదాన్ని రూపుమాపాలి
- మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మంచిర్యాల ప్రతినిధి జూన్ 22 (జనంసాక్షి) : సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మావోయిస్టు పార్టీసభ్యులు జనజీవనం స్రవంతిలోకి వచ్చి ఎర్ర జెండా పార్టీ లైన సిపిఐ, సిపిఎం పార్టీలతో ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం నాడు మంచిర్యాల జిల్లాకేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్ (అమరజీవి గుండా మల్లేష్ స్మారక హాల్)లో సీపీఐ జిల్లా 4 వ మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభలు రేగుంట చంద్రకళ,వనం సత్యనారాయణ, బొల్లం తిలక్ అంబేద్కర్ అధ్యక్షతన జరిగాయి. ఈ మధ్య కాలంలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ సెంట్రల్ కార్యదర్శి నంబాల కేశవరావు, టెంటు సింహాచలం అలియాస్ సుధాకర్,పొచ్చెర అడేళ్ళు,గాజర్ల రవి,అరుణ వారికి సీనియర్ రిపోర్టర్ ఏండి మునీర్, జిల్లా లో మరణించిన పార్టీ సభ్యులకు, తీవ్రవాదుల దాడుల్లో పహల్గాంలో మరణించిన వారికి సంతాపం తెలియజేశారు. విమాన ప్రమాదంలో మరణించిన ప్రయాణికులకు మహాసభలో సంతాపం తెలిపి మౌనం పాటించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివ రావు ప్రసంగించారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావాల్సిన ప్రభుత్వం ఇందుకు వ్యతిరేకంగా ఏరివేత పేరుతో మావోయిస్టులను చిన్నపిల్లలను, మహిళను పాశవికంగా చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అప్పటి నుండి ఇప్పటి వరకు కార్మికులు, కర్షకులు, రైతుల, ప్రజల పక్షాన నిలబడి పోరాడే కమ్యునిస్టుల పోరాటం ఫలితంగా ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని అన్నారు. దేశంలో మోది ప్రభుత్వం మతోన్మాద విధానాలను ఎదుర్కొవడానికి కమ్యునిస్టుల పాత్ర ఎంతో ఉందని, ప్రశ్నించే గొంతుకగా కమ్యునిస్టులు ఉన్నారనే భయంతోనే ప్రజల పక్షాన జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. సామ్రాజ్యవాద అమెరికాకు మొకరిల్లి పనిచేయడం దేశానికి మంచిది కాదన్నారు. ప్రపంచంలో అమెరికా పెద్దన్న పాత్ర పోషిస్తు తన గుప్పిట్లో అన్ని దేశాలను పెట్టుకోవాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ప్రజల పక్షాన ఆనాటి నుండి ఈనాటి వరకు మనిషి బతికి ఉన్నంత కాలం కమ్యూనిస్టులు ప్రజల పక్షానే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మహాసభల్లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడుచాడి వెంకటరెడ్డి రాష్ట్ర కార్యదర్శివర్ణసభ్యుడుక చేన శంకర్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు మిట్టపల్లి వెంకటస్వామి, మేకల చాను, రేగుంట చంద్రశేకర్, కె.వీరభద్రయ్య, బొల్లం పూర్ణిను జోగుల మల్లయ్య, మున్నేనమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు

# ఏటేటా పెరుగుతున్న క్యాన్సర్ కేసులు






- అన్ని జిల్లాలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్లు ప్రారంభిస్తాం
- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- కార్యక్రమానికి హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్, నందమూరి బాలకృష్ణ

హైదరాబాద్ (జనంసాక్షి) : క్యాన్సర్ సమస్య దేశవ్యాప్తంగా పెరుగుతోందని, తెలంగాణలో ప్రతి ఏటా 50 నుంచి 55 వేల మంది కొత్తగా కేన్సర్ భారిన పడుతున్నారని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బసవతారకం హాస్పిటల్ 25వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, నందమూరి బాలకృష్ణ హాజరయ్యారు. సిల్వర్ జూబ్లీ సందర్భంగా బసవతారకం డాక్టర్లు, సిబ్బంది, మేనేజ్‌మెంట్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కేన్సర్‌తో మృతి చెందిన తన భార్య బసవతారకం పేరిట ఎన్‌టీఆర్ 25 ఏండ్ల కిందట ఈ హాస్పిటల్ ప్రారంభించారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకూ లక్షల మంది పేషెంట్లకు ఈ హాస్పిటల్ వైద్య సేవలు అందిస్తోందని, ఎన్టీఆర్ ఐకానిక్ లీడర్, లెజెండరీ యాక్టర్ .. సినిమా, సామాజిక సేవలో ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తి అని తెలిపారు. నాటి ఆయన విజనే నేటి ఈ హాస్పిటల్ అని, లక్షలాది మంది పేద రోగులకు జీవితంపై ఆశ, నమ్మకం అందిస్తోందని తెలిపారు. ఇవి కేవలం నంబర్లు కాదు.. రోగుల జీవితాలను, వారి కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేసే ప్రమాదకర వ్యాధి ఇది అని, ఎర్లీ స్టేజ్‌లో గుర్తిస్తేనే ఈ వ్యాధిని నయం చేయగలమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ యూనిట్లను ప్రారంభించబోతున్నామని, ప్రతి జిల్లాల్లో కేన్సర్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. త్వరలోనే వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కేన్సర్ స్క్రీనింగ్, డయాగ్నొసిస్, డే కేర్ కీమోథెరపి, పాలియేటివ్ కేర్ వంటి సేవలన్నీ ఈ సెంటర్లలో అందిస్తామని తెలిపారు. ఇంకా అడ్వాన్స్‌డ్ వైద్య సేవలు అందించేలా రీజనల్ కేన్సర్ కేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకు రాబోతున్నామని తెలిపారు. పేద పేషెంట్లకు సేవలు అందిస్తున్న బసవతారకం వంటి హాస్పిటళ్లకు ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఎన్‌టీఆర్ స్థాపించిన ఈ హాస్పిటల్‌ను నడిపిస్తూ, పేదలకు సేవలు అందిస్తున్న బాలకృష్ణను ఆయన అభినందించారు.

# బీసీ బిల్లు సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి

- జూలై 17న రైల్‌రోకోను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్సీ కవితకు అండగా ఉండాలి
- బీసీలకు ఆర్.కృష్ణయ్య సంచలన పిలుపు



హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీ బిల్లు సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, జూలై 17న రైల్‌రోకోను విజయవంతం చేయాలని బీసీ నేత, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆదివారం ఆర్. కృష్ణయ్యతో ఎమ్మెల్సీ కవిత భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల కోసం కవిత ముందుకొచ్చి మాట్లాడుతున్నారు.. ఫైట్ చేస్తున్నారని కొనియాడారు. బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు ఆమెకు మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీలు కూడా కవితకు మద్దతివ్వడంతో పాటు.. అండగా ఉండాలని పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. బీసీలకు 75 ఏళ్లుగా అన్యాయం జరుగుతోంది. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకొని కమిట్మెంట్‌తో పోరాటం చేయకపోతే చాలా ప్రమాదం ఉంది. ఇప్పుడున్న రిజర్వేషన్లు కూడా తగ్గుతాయని హాట్ కామెంట్స్ చేశారు. బీసీ కాకపోయినా కవిత మన కోసం పోరాటం ప్రారంభించారు.. కేవలం మన కోసం పులి మీద స్వారీకి సిద్ధమయ్యారని అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఆమె చేసే పోరాటాన్ని ఎవరూ తప్పుపట్టొద్దని కోరారు. అందరం ఐక్యంగా ఉద్యమం చేస్తేనే.. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దిగి వస్తాయని చెప్పారు. జూలై 17న జరిగే జాగృతి రైల్ రోకోకు కచ్చితంగా మద్దతు ఇస్తామని ఎమ్మెల్సీ కవితకు ఆర్.కృష్ణయ్య హామీ ఇచ్చారు.

# సీఎంను కలిసిన పద్మశ్రీ నోరి దత్తాత్రేయుడు



హైదరాబాద్ (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ ఆంకాలజిస్ట్ పద్మశ్రీ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మర్యాదపూర్వకంగా కలిసారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ కృషిని అభినందించారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధికి ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎంకు తెలిపారు.

# మిర్చి కన్నా పత్తి సాగే బెటర్

**పత్తివైపు అధిక రైతుల మొగ్గు**



ఆదిలాబాద్, జూన్22 (జనంసాక్షి) : అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. అన్న చందంగా మారింది మిర్చి రైతుల పరిస్థితి. ప్రభుత్వాల అసమర్థత కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడారు. కనీసం పండించిన పంటను అమ్ముదామంటే మార్కెట్లో కొనేవారు కరవయ్యారు. దిక్కుతోచక పంటను కొందరు స్వయాన తగులబెట్టి తమ కడుపు మంటను వెళ్లగక్కారు. మరికొందరు కూలీ కూడా వెళ్లదని పంటను చేలల్లోనే వదిలేసారు. చేసేది లేక నిస్సహాయంగా ఆగ్రహాన్ని, ఆవేదనను తమలోనే అణచివేసుకున్నారు. దీంతో ప్రస్తుతం మళ్లీ మిర్చివేయాలంటేనే భయపడుతున్నారు. దీంతో మరోమారుపత్తి వేసేందుకు రైతులు సమాయత్తం అయ్యారు. మిరప పంట సాగు చేసినా అందుకు తగ్గట్లు మార్కెట్ సౌకర్యం లేకపోవడం, రోజురోజుకు ధర తగ్గడం వల్ల మిరప పంట సాగుచేసిన రైతులకు శాపంగా మారింది. పత్తి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు అన్నదాతలు పంట మార్పిడికి శ్రీకారం చుట్టారు. దీనికితోడు జిల్లాలో మిరప పంటకు అనువైన నేలలు ఉండటంతో ఎక్కువ మంది రైతులు పత్తికి బదులు మిరప వైపు మొగ్గుచూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పత్తి, వరి పంటల తర్వాత మూడో పంటగా మిరప సాగు చేయడం విశేషం. పంటను మార్కెట్‌కు తరలిస్తే ఖర్చులు కూడా వెళ్లక మిరప రైతు కుదేలు అయ్యారు. మొదట తీసిన పంటే పూర్తి స్థాయిలో అమ్మకపోగా.. కనీసం మరో రెండు దఫాలుగా తీయాల్సిన పంట చేలోనే ఉండిపోయింది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. అందుకు తగ్గట్లు ధర లేకపోవడం మిరప రైతులను కుదేలు అయ్యేలా చేసింది. మిర్చి ద్వారా నష్టపోయిన రైతులు ఇప్పుడు పత్తి ద్వారా అదృష్టం పరీక్షించుకోబోతున్నారు.

**తెలంగాణ జాగృతిలో 'యూనిటీ ఆటో యూనియన్' విలీనం**

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ జాగృతిలో 'యూనిటీ' తెలంగాణ ఆటో డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విలీనమైంది. ఆదివారం బంజారాహిల్స్ లోని నివాసంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమక్షంలో జాగృతిలో చేరారు.

# అంతరించిపోతున్న బీడీ పరిశ్రమ

**ప్రత్యామ్నాయ వృత్తుల్లో బీడి కార్మికులు**



నిర్మల్, జూన్22 (జనంసాక్షి) : ప్రస్తుతం మారిన పరిస్థితుల కారణంగా జిల్లాలో బీడీ పరిశ్రమ దాదాపుగా అంతరించిపోయిందనే అంటున్నారు. రోజురోజుకూ బీడీ పరిశ్రమ బలహీన పడుతుండటం కార్మికులకు శాపంగా మారుతోంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాలు, సిగరెటѕ వినియోగ ప్రాబల్యం పెరగడం లాంటి అంశాలన్నీ బీడీ పరిశ్రమను దెబ్బతీస్తూ వస్తున్నాయి. వేలాది మంది బీడీ కార్మికులకు ఉపాధిపై భరోసా రోజురోజుకూ కరవవుతున్న క్రమంలో తప్పుకుంటు న్నారు. పొగాకు దుష్ఫలితాలపై సమాజంలో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం లక్షలాది మంది బీడీ కార్మికుల జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. కారణం.. బీడీ పరిశ్రమ కేంద్రీకృతమైన ఈ ప్రాంతంలో ప్రత్యామ్నాయ ఉపాధి కరవైంది. బీడీ వినియోగం తగ్గిపోవడంతో ఈ పరిశ్రమ యజమానులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో బీడీకి డిమాండ్ వారిపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ స్వయం ఉపాధిపై, వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి తాత్కాలిక ఉద్యోగులుగా తీసుకోనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకొని వీరంతా జీవనం సాగిస్తున్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో నెట్టుకొస్తున్న తరుణంలో ప్రభుత్వం వీరికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో బతుకులు బాగుపడనున్నాయి. నిర్మల్ జిల్లాలో ఉన్న 60 వేల మంది కార్మికులతో పాటు వారిపై ఆధార పడుతున్న దాదాపు మరో 1.50 లక్షల మందికి ఉంటారని కార్మికశాఖ అధికారులు అంచనా వేశారు. ఉద్యానవనం (పండ్లు, పూలు, కూరగాయల సాగు), కోళ్ల పరిశ్రమ, గేదెలు, గొర్రెల పెంపకం, కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, చేతి వృత్తులు, అగర్‌బత్తుల తయారీ, పాపడ్, పచ్చళ్ల తయారీపై ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు వివిధశాఖల్లో దినసరి ఉద్యోగాలుగా పనులు చేసేందుకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో టైలరింగ్, బ్యూటీషియన్, బ్యాంకింగ్, ÷నాన్స్, బీమా ఏజెంట్లు, ఆసుపత్రుల్లో సేవలు, మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్స్, పశువైద్య సేవలపై శిక్షణ ఇవ్వనున్నారు. బీడీ కంపెనీలు ఎప్పుడు మూతపడుతున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. బీడీలు చుట్టుడమే జీవనాధారంగా ఉన్న అనేక కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుంది. స్వయం ఉపాధి పొందేందుకు రుణ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370